జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

తమిళనాట ప్రభుత్వ కార్యక్రమాల్లో
ఇకమీదట తమిళ తల్లి గీతాలాపన

పేరుకు మాత్రమే ఉపాధిహామీ
అదంతా 'రోజ్‌గార్ చోరీ'

వాగులో కొట్టుకుపోయిన వ్యాన్
బాలిక సహా 9 మంది మృతి.. 07

సంపుటి 09, సంచిక: 252 | మంగళవారం | 11-08-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## విద్యార్థులపై పోలీసుల చర్య

# చర్చకు సిద్ధం

ప్రతిపక్షాల డిమాండ్‌కు దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం

- పెల్లెట్ గన్‌ల వినియోగంపై అమిత్ షా స్పష్టత ఇవ్వాలి
- పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిపక్ష ఎంపిల నిరసనలు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు 16వ రోజైన సోమవారం కూడా ఉభయసభల్లో ప్రతిపక్ష సభ్యులు నిరసనలు వ్యక్తం చేశాయి.జులై20న'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా విద్యార్థులు, యువతపై పోలీసుల అమానుష చర్యపై, అయోధ్యలోని రామాలయంలో విరాళాల చోరీపై హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చిన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. సోమవారం ఉదయం లోక్‌సభ, రాజ్యసభ ప్రారంభమైన తరువాత విపక్ష ఎంపిలు ప్లకార్డులు చేబూని వెల్ వైపు దూసుకొచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉభయసభల్లోనూ పలుమార్లు వాయిదాల పర్వం కొనసాగింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాలను పూర్తిగా చేపట్టలేకపోయింది. ప్రతిపక్షాల నినాదాల మధ్య ప్రభుత్వం నాలుగు బిల్లులు ప్రవేశపెట్టింది. కాగా, విపక్షాల పట్టుదల కారణంగా విద్యార్థుల నిరసనల పై లోక్‌సభలో చర్చేందుకు ప్రభుత్వం దిగొచ్చింది. ఈ చర్చపై హోం మంత్రి అమిత్ షా స్పందిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభలో తెలిపారు. ఆ తర్వాత, ప్రతిపక్ష ఎంపిల నినాదాలు కొనసాగుతున్నప్పటికీ, ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు, 2026, చర్చ లేకుండానే ఆమోదం పొందింది. అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. అంతకు ముందు లోక్‌సభలో మాట్లాడు తూ రిజిజు మాట్లాడుతూ అమిత్ షా స్పందించినప్పుడు వాకౌట్ చేయవద్దని ప్రతిపక్షాలను కోరారు. ఈ విషయంపై సవివరమైన సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ మొదటి రోజు నుంచే అమిత్ షా నుండి ఒక ప్రకటనను డిమాండ్ చేస్తున్నారని, విద్యార్థుల సమస్యపై చర్చించి, సవివరమైన సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రిజిజు అన్నారు. అయితే ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలను కొనసాగించారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు అధ్యక్ష తరువాయి 8లో

### ప్రభుత్వ చర్య వల్లే పార్లమెంట్ స్తంభన

- ప్రతిపక్షాలు చర్చను కోరుకుంటున్నాయి
- ప్రధాని మోదీ, అమిత్ సభకు రావడానికి భయపడుతున్నారు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

07

### బిల్లులపై చర్చ జరగాలి

- సభ సజావుగా జరిగేందుకు సహకరించండి
- ప్రతిపక్ష ఎంపిలకు లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా విజ్ఞప్తి



# జైల్ భరో సక్సెస్

- స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నరేంద్ర మోదీ సర్కార్
- కార్మిక సంఘాల, ఎస్‌కెఎం నేతల ఆగ్రహం
- విదేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్
- ర్యాలీలను అడ్డుకున్న పోలీసులు ఎక్కడిక్కడే నేతల అరెస్టులు

ప్రజాపక్షం/హైదరాబాద్/ఖమ్మం

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని, విదేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను (ఎఫ్‌టిఎలు) తక్షణమే ఉపసంహరించుకోవాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల, నియోజకవర్గ కేంద్రాలలో పెద్ద ఎత్తున నిరసన తరువాయి 8లో





## పాలమూరు–రంగారెడ్డి

### జాతీయ హోదాకు కేంద్రం నిరాకరణ

ఎంపి రేణుక చౌదరి ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించే ప్రతిపాదన ప్రస్తుతం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను పరిశీలించిన అనంతరం జాతీయ హోదా అంశంలో ముందుకు వెళ్లే పరిస్థితి లేదని కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ప్రాజెక్టుకు అంతర్రాష్ట్ర జల వివాద తరువాయి 12లో

## జార్ఖండ్ అసెంబ్లీ ముట్టడిలో ఉద్రిక్తత



- విద్యార్థులపై లాఠీఛార్జ్, వాటర్ కెనాన్ల ప్రయోగం
- పరీక్షల్లో అక్రమాలపై రాంచీలో విద్యార్థుల భారీ నిరసన
- అసెంబ్లీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులు
- బారికేడ్లు తొలగించేందుకు యత్నించడంతో వాటర్ కెనాన్లతో అడ్డుకున్న పోలీసులు



**రాంచి :** నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలకు నిరసనగా ఉద్యోగార్థులు సోమవారం చేపట్టిన 'చలో అసెంబ్లీ' ఉద్రిక్తంగా మారింది. విద్యార్థులు బారికేడ్లను ఛేదించుకుని జార్ఖండ్ అసెంబ్లీ ప్రాంగణానికి సమీపిస్తుండగా, పోలీసులు వారిపై వాటర్ కెనాన్లు, బాష్ప వాయువులు ప్రయోగించి, లాఠీఛార్జ్ చేశారు. 'జెఎస్‌ఎస్‌సి–సిజిఎల్ పరీక్షలను రద్దు చేయండి లేదా సిబిఐ విచారణ జరపండి, 'జెఎస్‌ఎస్‌సిపై దాడి చేయకుండా సిఐడి ఎందుకు తప్పించుకుంటోంది?' అని రాసి ఉన్న ప్లకార్డులు, త్రివర్ణ పతాకాలతో వారు ప్రదర్శన చేశారు. నిష్పక్షపాత విచారణ జరపండి, నిజాన్ని బయటపెట్టండి అంటూ నినాదాలు చేస్తుండగా, భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య వేలాది మంది యువతీ యువకులు ఒకదాని తర్వాత ఒకటిగా బారికేడ్లను బద్దలు కొట్టుకుంటూ ముందుకు దూసుకెళ్లారు. ఈ యాత్ర జగన్నాథ్‌పూర్ ఆలయం వద్దకు చేరుకోగానే పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించడంతో, నిరసనకారులు త్రివర్ణ పతాకాలను ఊపుతూ నృత్యం చేయడం ప్రారంభించారు. అయితే, నిరసనకారులు ముందుకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. అయితే, ఈ ఉద్రిక్తతల మధ్య పలువురు విద్యార్థులు బారికేడ్ల పైకి ఎక్కి నిలబడ్డారు. పోలీసులు తమపైకి వాటర్ క్యానన్లతో నీటిని కొడుతున్నప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ నీటి ధారల మధ్యే బారికేడ్ల పైనే డ్యాన్స్ చేస్తూ తమ నిరసనను వినూత్నంగా వ్యక్తపరిచారు. జనసమూహాన్ని అదుపు చేయడంలో విఫలమైన పోలీసులు, నిరసనకారులు సభకు సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్నప్పుడు పలు దఫాలుగా బాష్పవాయువును ప్రయోగించారు. నిషేధాజ్ఞలు విధించడంతో పాటు, తరువాయి 8లో

## రాష్ట్రాలకు కేంద్రం బెదిరింపులు

- తమ కబంధ హస్తాల్లో పెట్టుకునేందుకు మోదీ సర్కార్ కుట్ర
- పాదయాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ విమర్శ

ప్రజాపక్షం / కరీంనగర్ / గన్నేరువరం




కేంద్రంలోని బిజెపి పాలనకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త పాదయాత్రలు సోమవారం ఐదవరోజుకు చేరుకున్నాయి. పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును సిపిఐ శ్రేణులు తూర్పార పడు తున్నారు. ప్రతి గ్రామంలో ఉన్న ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిస్తున్నారు. సోమవారం నాటి పాదయాత్రలో వరంగల్ హనుమకొండ జిల్లాల్లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, నాగర్‌కర్నూల్ జిల్లాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ్మ కరీంనగర్ జిల్లాలో మరో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, నల్లగొండలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. కరీంనగర్ జి ల్లా గన్నేరు మండలంలో మండల కార్యదర్శి చొక్కళ్ళ శ్రీశైలం అధ్యక్షతన జరిగిన పాదయాత్రలో కలవేణ శంకర పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆయా ప్రభుత్వాలను తమకబంద హస్తాల్లో పెట్టుకోవడానికి అడ్డదారులు తొక్కుతుతూ బెదిరింపులలకు పాల్పడుతుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువస్తే దేశంలోని రైతులంతా ఏకమై అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించారని ఆ మహత్తర పోరాటంలో 750 మందికి పైగా రైతులు మృతి చెందారని తరువాయి 12లో



## వర్షాల కోసం సాగర్‌లో వరుణ యాగం

పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు



ప్రజాపక్షం/నల్లగొండ

వర్షాలు సంవృద్ధిగా కురువాలని ఆ కాంక్షిస్తూ నాగార్జునసాగర్ కృష్ణా నది తీరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగం వైభవంగా ముగిసింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరువాయి 8లో

# పేద పిల్లలకు నాణ్యమైన విద్య

- ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతున్నాం
- కెజిబివి నూతన భవనం ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/ఎల్కతుర్తి



పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పేదల పక్షపాతిగా పని చేస్తోందని తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో రూ.3.25 కోట్లతో నిర్మించిన కెజిబివి (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యం) నూతన భవనాన్ని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, పేద కుటుంబాల పిల్లలు కూడా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యను పొందేలా ప్రభుత్వం విద్యారంగంపై భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పిల్లలు కడుపునిండా భోజనం చేయాలనే ఉద్దేశంతో డైట్ ఛార్జీలను 40 శాతం, తరువాయి 8లో

## రాష్ట్రంలో 73.95 లక్షల ఓట్లు తొలగింపు!

- రాష్ట్రం ఓటర్లు 3.38 కోట్ల మంది
- తెలంగాణలో ముగిసిన 'సర్' ప్రక్రియ
- డిజిటలైజేషన్‌లో యాదాద్రి భువనగిరి టాప్
- చివరి స్థానంలో హైదరాబాద్, ఆ తరువాతి స్థానాల్లో మేడ్చల్, రంగారెడ్డి
- ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలకు కసరత్తు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో కీలకమైన ఎన్యూమరేషన్ దశ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు గుర్తించారు. ఈ ప్రక్రియలో 73,95,954 మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు తరువాయి 8లో

# బిజెపి – అకాలీదళ్ పునఃసమాగమం

ఇరవైనాలుగేళ్ల అలయెన్స్ బంధాన్ని ఆరేళ్లక్రితం తెంచుకున్న బిజెపి, శిరోమణి అకాలీదళ్ 2027 అసెంబ్లీ ఎన్నికలకు మళ్లీ సంధి కుదుర్చుకుంటాయా? అంటే 'ఔను, కావచ్చు' అనే సూచనలు కనిపిస్తున్నాయి. పార్లమెంటు నియోజకవర్గాల పెంపుదల–నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) – వాటితో జతచేసి మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలుకోసం రాజ్యాంగ సవరణ సహా బిల్లుల ఆమోదం కోసం నరేంద్రమోదీ ప్రభుత్వం మెజారిటీ సమీకరణ ప్రయత్నాలు పునఃప్రారంభించిన ఈ దశలో అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ ఇటీవల ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీతో జరిపిన చర్చలు ఈ పుకార్ల షికారుకు ప్రాతిపదిక అయినాయి. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ఫార్ములాను గతంలో వ్యతిరేకించిన అకాలీదళ్ ఇప్పుడు దాన్ని బలపరుస్తూ, మహిళా రిజర్వేషన్‌ను తక్షణం అమలు చేయాలని, లోక్‌సభ సీట్లను అన్ని రాష్ట్రాలకూ 50శాతం పెంచాలని కోరటంలో ఆంతర్యం ఏమిటి? అకాలీదళ్‌కు లోక్‌సభలో ఉన్న ఒకే ఒక్క సీటు (హర్‌సిమ్రాత్ కౌర్ బాదల్ (భటిండా) బిజెపికి మెజారిటీ చేకూర్చదు లేదా రాజ్యసభలో గణాంకాలు మార్చబోదు. అయితే జాతీయ రాజకీయ ఏకాభిప్రాయం కోసం బిజెపి ప్రయత్నిస్తున్నట్లు కనిపించటం, పాత చిరకాల మిత్రపార్టీని మళ్లీ దగ్గరకు తెచ్చుకోవటం ఈ చర్చల ప్రధానోద్దేశం. మోదీ–బాదల్ పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల పొత్తు గూర్చి కాకపోయినా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, జాతీయ ప్రయోజనాల పేరుతో భావసారూప్య పార్టీల పునరైక్యత ఆవశ్యకత గూర్చి చర్చించి ఉంటారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, మోదీ–బాదల్ సమావేశాన్ని 'హృదయంలో వచ్చిన మార్పు'గా అభివర్ణించారు. రెండు పార్టీలు మళ్లీ దగ్గరవుతున్నాయనటానికి ఇది సూచన.

బిజెపి–అకాలీదళ్ ఏవో సైద్ధాంతిక విభేదాలతో తమ దీర్ఘకాల బంధాన్ని తెంచుకోలేదు. 2020లో మోదీ ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా తమ సహజపునాది అయిన పంజాబ్ రైతులు వీధులకెక్కి పోరాటం చేస్తున్న సందర్భంలో ఆ పునాది నిలుపుకునే ఉద్దేశంతో అప్పుడు కేంద్ర మంత్రివర్గంలోఉన్న ఏకైక అకాలీదళ్ మంత్రి హర్‌సిమ్రాత్ కౌర్ బాదల్ రాజీనామా చేశారు. అకాలీదళ్ ఆ తర్వాత ఎన్‌డిఎతో సంబంధాలు తెంచుకుంది. రైతులు సంవత్సరంపాటు ఢిల్లీ సరిహద్దులో దేరాలు వేసుకుని, ట్రాక్టర్లపై గుడారాలు వేసుకుని పట్టువిడవని విక్రమార్కుల్లా పరాక్రమించటంతో మోదీ వెనక్కితగ్గక తప్పలేదు. అందునా ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్నందున పశ్చిమ యుపిలో రైతుల ఆగ్రహాన్ని చల్లబరిచే వ్యూహంతో కావచ్చు – మోదీ తొలిసారి జాతికి క్షమాపణలు చెప్పి ఆ రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల మూడు చట్టాలు ఉపసంహరించుకున్నారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలన్న రైతుల డిమాండ్‌కు సానుకూలంగా స్పందించి దాని పరిశీలనకు ఒక కమిటీ ఏర్పాటు చేశారు. యుపిలో బిజెపి అధికారం నిలుపుకుంది. రైతుల డిమాండ్‌పై మోదీ చన్నీళ్లు చల్లారు. ఆ కమిటీ నివేదిక ఏమైందో తెలియదు. ఏటా కొంచెం ఎంఎస్‌పి పెంచుతూ, వ్యవసాయోత్పత్తులకు స్వామినాధన్ జాతీయ రైతు కమిషన్ సిఫారసులు అమలు చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. రైతులు మళ్లీ ఆందోళన మొదలుపెట్టినా అది మునుపటి అంత తీవ్రంగా లేదు. కాగా 2022 అసెంబ్లీ ఎన్నికల్లో పంజాబ్‌లో అధికారం ఆమ్ ఆద్మీపార్టీ చేతికి వచ్చింది. ఆప్ అసెంబ్లీలోని 117 సీట్లలో 92 గెలుచుకోగా అకాలీదళ్‌కు మూడు, బిజెపికి రెండు సీట్లు దక్కాయి. అకాలీదళ్‌కు 18.38 శాతం ఓట్లు లభించాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అకాలీదళ్‌కు భటిండా సీటు ఒక్కటే దక్కింది. అత్యధిక నియోజకవర్గాల్లో మూడవ, నాల్గవ స్థానం పొందింది. అలయెన్స్ రద్దు రెండు పార్టీలకూ పెద్ద నష్టం చేసింది.

తాజా పరిస్థితుల్లో ఆప్ తన పార్టీని గ్రామీణ ప్రాంతంలో సైతం పటిష్టం చేసుకుని వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతోంది. కాంగ్రెస్‌కూడా పునరుత్తేజంతో పనిచేస్తున్నది. కాబట్టి తమస్థితిని బలోపేతం చేసుకోవటానికి అలయెన్స్ పునరుద్ధరణ అకాలీ–బిజెపి రెండింటికీ అవసరం. తమ గ్రామీణ ఓటుకు బిజెపి పట్టణ ఓటుతోడైతే ఎన్నికల ఫలితాలు మెరుగ్గా ఉంటాయని అకాలీదళ్ నాయకత్వం భావిస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లోకి చొచ్చుకు పోవటానికి అకాలీదళ్‌తో మైత్రి అవసరాన్ని బిజెపి గుర్తిస్తున్నది. కాబట్టి ఇప్పటికిప్పుడు అకాలీదళ్ ఎన్‌డిఎలోకి తిరిగి రాకపోయినా ఆ దిశగా అడుగులకు మోదీ–బాదల్ సమావేశం ప్రాతిపదిక నెలకొల్పింది. పంజాబ్‌లో అకాలీదళ్, మహారాష్ట్రలో శివసేన బిజెపికి మతతత్వ బంధంతో సహజమిత్రులు. ప్రకాశ్‌సింగ్ బాదల్ బ్రతికి ఉన్నంతకాలం పంజాబ్‌లో, బాబాసాహెబ్ థాక్రే జీవించి ఉండగా మహారాష్ట్రలో బిజెపి ఆ ప్రాంతీయ పార్టీలకు మిత్రపక్షంగా రెండవస్థానంలోనే ఉంది. ఇప్పుడు మహారాష్ట్రలో శివసేనను చీల్చి నెం.1 స్థానంలోకి వచ్చింది.

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం సందర్భంలో, దాని అమలును 2026 సెన్సెస్ అనంతరం డీలిమిటేషన్‌తో ముడిపెట్టిన మోదీ ప్రభుత్వం తక్షణం (2024 ఎన్నికలు) అమలులోకి తేవాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను తోసిపుచ్చింది. గడచిన బడ్జెట్ సమావేశాల సందర్భంలో రాజ్యాంగ సవరణ బిల్లు తెచ్చిన బిజెపి, దానిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం పిలవటానికీ నిరాకరించింది. పర్యవసానంగా ఆ బిల్లు వీగిపోయింది. ఇప్పుడు రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం పొంది 2029 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్ అమలుకు బిజెపి చూపుతున్న ఆతృత సందేహాస్పదంగా ఉంది. సంఖ్యాబలం సమీకరణకు ఆప్, టిఎంసి, శివసేన (ఉద్ధవ్) ఎంపిలను చీల్చింది. అయినా సంఖ్యలు సరిపోవటం లేదు. తమిళనాడు పార్టీలతో సంప్రదిస్తున్నది. డిఎంకె తమ పాత వైఖరిని పునరుద్ఘాటించగా, పాలక కూటమి ప్రస్తుత పార్లమెంటు సీట్ల సంఖ్యతోనే మహిళా రిజర్వేషన్ అమలును కోరింది. జన్ జీ ఆందోళనతో తలబొప్పికట్టిన మోదీ ప్రభుత్వం దాన్నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు మళ్లీ డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ లింకు బిల్లులపై లీకులు వదులుతున్నది. ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించేనా?



## జార్ఖండ్‌లో విద్యార్థులపై బలప్రయోగం తప్పు

జార్ఖండ్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం తప్పు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది, చర్చల ద్వారా మాత్రమే పరిష్కారాలు లభిస్తాయి. జార్ఖండ్ ప్రభుత్వం ఆ విద్యార్థుల మాటలను వినడాన్ని కొనసాగించాలి. వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

– రాహుల్‌గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు



# నేరపూరితమైనా లేదా అసమర్థతైనా బాధ్యత హోం మంత్రిదే

రాహుల్‌గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు

అందరికీ సమాన విద్యా వ్యవస్థను, పేపర్ లీక్‌లపై జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ 2026 జూలై 20న భారతదేశ యువత ఏకమైంది.ఈ యువతీ యువకులు ప్రతీ కులం, వర్గం, ప్రాంతం, మతం నుండి వచ్చారు. వారు న్యాయం కోరేంత ధైర్యవంతులు, తమ రాజ్యాంగ హక్కులను తెలుసుకునేంత వివేకవంతులు, తమ అంతర్గత సంఘర్షణను చూసి నవ్వుకునేంత లేత మనస్కులు, తాము పోరాడి గెలవగలమని నమ్మేంత నిష్కపటమైనవారు.

నిరసనకారులు పాడుతూ, నృత్యం చేస్తూ, నవ్వుతూ, చేతులు పట్టుకుని, ఐక్యంగా నిలబడగా, దేశం మొత్తం వారిని ఆశ్చర్యంతో చూసింది. వారి తరం వారి వేదనకు, అలాగే భయంతో మౌనంగా ఉండిపోయి బాధపడుతున్న కోట్లాది మంది భారతీయుల వేదనకు వారి ప్రతిఘటన గొంతుక ఇచ్చింది.

**హింసను ఎదుర్కొన్నారు**

ఈ నిరసనలు భారతదేశపు గర్వించదగిన శాంతియుత ప్రతిఘటన వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాయి. ఈ ప్రతిఘటన సంప్రదాయమే దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టింది, రాజ్యాంగంలోని 19వ అధికరణం ద్వారా పరిరక్షించబడుతోంది. అయినప్పటికీ, క్రూరమైన దాడి ద్వారా యువత గొంతును ప్రభుత్వం అణచివేసేందుకు ప్రయత్నించింది. వారిపై భాష్ప వాయువు గోళాలతో దాడి చేశారు, మేకులు దింపిన లాఠీలతో కొట్టారు, పెల్లెట్ గన్‌లను కాల్చారు.

నేను కలిసిన పంతొమ్మిదేళ్ల సాహిల్ లోచాబ్ శరీర పైభాగమంతా వందలాది సీసపు గుళికలు దిగి ఉన్నాయి. ఒక గుళిక అతని కంటికి తగిలి, బహుశా అతన్ని అంధుడిని చేసిందేమో. లాఠీలు ధరించిన పోలీసులు యువతులపై దారుణంగా దాడి చేయడం ద్వారా వారి ప్రైవేట్ పార్ట్‌లను గాయపరిచారు. మైనర్‌లను లాఠీలతో బాదారు. వారి ఎముకలు విరిగాయి, శరీరాలపై గాట్లు, గాయాలు అయ్యాయి. బిహార్‌లోని సివాన్‌లో విద్యార్థి నిరసనకారులపై ఎకె–47తో సహా పలు తుపాకులతో కాల్పులు జరిపారు. దీంతో చాలామంది తీవ్రంగా గాయపడ్డారు.

ఈ చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన హింసకు ఎవరు అధికారం ఇచ్చారు?

**కేంద్రీకృత అధికారం**

నరేంద్ర మోదీ ప్రభుత్వం తన కేంద్రీకృత నియంత్రణ గురించి తనకు తానే గర్వపడుతుంది. అది అంగారక గ్రహ యాత్ర అయినా, ఒలింపిక్ పతకం అయినా, దాని ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలకే దక్కుతుందని పదే పదే డప్పు కొట్టి చెప్పుకుంటుంది.

వారి ఆమోదం లేకుండా ఏదీ ముందుకు సాగదు.

ఢిల్లీ నగర నడిబొడ్డున పార్లమెంటుకు కేవలం 500 మీటర్ల దూరంలో ఈ హింసాకాండ జరిగింది. ఇక్కడ ఢిల్లీ పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఎఎఫ్) మోహరించాయి. ఈ రెండు భద్రతా బలగాలు నేరుగా హోం మంత్రికి నివేదిస్తాయి.

కేవలం రెండు అవకాశాలు మాత్రమే ఉన్నాయి. మొదటిది, విద్యార్థులపై దాడికి ఆయన అధికారం ఇచ్చారు. అలాంటప్పుడు ఆయన బాధ్యుడు. రెండవది, అది జరుగుతోందని ఆయనకు ఏమాత్రం తెలియదు, అంటే ఆయన పూర్తిగా అసమర్థుడు అని అర్థం. ఏది ఏమైనప్పటికీ, హోం మంత్రిగా ఆ రోజు జరిగిన దానికి ఆయనే బాధ్యుడు, అందుకే ఆయన రాజీనామా చేయాలి.

పైగా, అతని నిష్క్రియాపియత్వం విద్యార్థులపై జరిగిన దాడిని ఆయన ఆమోదిస్తున్నాడని రుజువు చేస్తోంది. ఆయన ఎలాంటి విచారణకు ఆదేశించలేదు, కనీసం ఒక ప్రకటన కూడా జారీ చేయలేదు. ఆయన పార్లమెంటుకు రావడానికి నిరాకరించారు. చర్చ జరగాలని ప్రతి రోజు ప్రతిపక్షం ఇస్తున్న తీర్మానాలను ఏకపక్షంగా తిరస్కరించారు.

అదే సమయంలో, తన ప్రతిష్టను కాపాడుకోవాలనే ఆత్రుతతో ప్రధాని మోదీ, తన ప్రచార యంత్రాంగాన్ని, గోదీ మీడియాను రంగంలోకి దించారు. యువ నిరసనకారులను భయపెట్టేందుకు, వారిపై ప్రథమ సమాచార నివేదికలు (ఎఫ్‌ఐఆర్) నమోదు, అరెస్టులు కొనసాగుతున్నాయి. భారతీయ జనతా పార్టీకి చెందిన ఆన్‌లైన్ ట్రోల్స్, యువ మహిళా నిరసనకారులను, వారి తల్లిదండ్రులను బెదిరించి, బహిరంగ క్షమాపణలు చెప్పేలా ఒత్తిడి చేస్తున్నారు. తమ భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకున్న భారత యువతను 'క్షమిస్తున్నట్లు' ప్రధాని మోదీ స్వయంగా ఒక వీడియో చేశారు. జవాబుదారీతనం కోరుతున్న తన సొంత ప్రజలను ఒక ప్రధానమంత్రి క్షమించడం ఎంత హాస్యాస్పదం.

**భారత యువతకు అండగా..**

ప్రధానమంత్రి మోదీ వాస్తవ పరిస్థితులకు స్పష్టంగా దూరంగా ఉన్నందున, నేను ఆయనను హెచ్చరిస్తున్నాను. దేశవ్యాప్తంగా యువత మేల్కొంది. ఆయన ప్రతిష్ట దెబ్బతిన్నది, దాన్ని తిరిగి నిర్మించడం అసాధ్యం. ఆయనను గానీ, హోం మంత్రి షాను గానీ, లేదా ఏ అధికారిని గానీ వారి చర్యల పర్యవసానాల నుంచి తప్పించుకోవడానికి భారతదేశ యువత అనుమతించదు. ప్రతిపక్షంలో ఉన్న మేము యువతకు అండగా నిలుస్తాము. ఈ నేరాలకు శిక్షించబడకుండా పడకుండా ఉండేందుకు మేము అనుమతించబోము.

2026 జూలై 20న సాహిల్, భారతదేశవ్యాప్తంగా ఉన్న వేలాది మంది యువకులు, తాము ఎన్నుకున్న వారి నుండి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేశారు. ఆలస్యంగానో, త్వరగానో వారికి ఆ జవాబుదారీతనం లభిస్తుంది. మేలు అలా జరిగే విధంగా తప్పక చేస్తాము.

*సౌజన్యం : 'ది హిందూ', ఆంగ్ల దినపత్రిక (తేదీ:10–08–26)*

# బిజెపికి దూరమైన జెన్ జీకి భాగవత్ బుజ్జగింపు

కె.రవీంద్రన్

భారతదేశ యువతరంతో సంభాషణను ఆరంభించేందుకు ఆర్‌ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ చేసిన ప్రయత్నం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఎందుకంటే, యువత తమ పరిధిలోనే హాయిగా ఉన్నారని రాజకీయ వ్యవస్థకు విశ్వాసం ఉన్నట్లయితే, ఇటువంటి జోక్యం అవసరయ్యేది కాదు. యువత తప్పుదారి పట్టలేదని, దిశానిర్దేశం లేకుండా లేరని, వారికి ఆదేశాల కన్నా చర్చలే అవసరమని ఆర్ఎస్ఎస్ చీఫ్ చేసిన వాదన బుజ్జగించినట్లుగా అనిపించవచ్చు. అయితే, పరీక్షా పత్రాల లీకేజీలతో విద్యార్థులకు, ప్రభుత్వానికి మధ్య జరిగిన అసాధారణ సంఘర్షణ తర్వాత ఇది చోటుచేసుకోవటం, అంతే స్థాయిలో రాజకీయంగా సంక్షోభ నివారణ చర్యగా కూడా కనిపిస్తోంది.

సందేశంలోని పదాల కన్నా, అది వెలువడిన సమయమే ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకుంది. పరీక్షా పత్రాల లీకేజీలపై వారాల తరబడి సాగిన యువత సమీకరణ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను రాబట్టగలిగేంత శక్తిమంతమైన నిరసన ఉద్యమంగా పరిణమించింది. ఈ ఆందోళన ప్రారంభమైనప్పుడు ఈ ఫలితం దాదాపుగా ఊహించలేనిది. పాతుకుపోయిన రాజకీయ వ్యవస్థలకు వెలుపల కూడా తాము సంఘటితం కాగలమని, తమను అప్రతిష్టపాలు చేసే ప్రయత్నాలను ప్రతిఘటించగలమని, తమను దగాచేసి అధికారంలో కొనసాగాలని నిశ్చయించుకున్నట్లు కనిపించిన ప్రభుత్వం నుండి జవాబుదారీతనాన్ని రాబట్టగలమని యువ నిరసనకారులు నిరూపించారు.

కాబట్టి బిజెపి స్వయంగా గుర్తించడం ఆలస్యమైన ఒక రాజకీయ వాస్తవాన్ని భాగవత్ అంగీకరించారు; భారతదేశ యువతను రాజకీయ సందేశాలకు కేవలం శ్రోతలుగా నిరవధికంగా పరిగణించటం సాధ్యం కాదు. వారు వ్యవస్థను ప్రశ్నించినపుడు వారికి స్వేచ్ఛను నిరాకరించలేము.

ఇది నరేంద్ర మోదీ అత్యంత జాగ్రత్తగా పెంచి పోషించుకున్న రాజకీయ గుర్తింపులలో ఒకదానిపై నేరుగా దెబ్బ కొడుతుంది. దశాబ్దానికి పైగా మోదీ భారతదేశ డెమోగ్రఫిక్ డివిడెండ్ (జనాభా లబ్ధి) పదేపదే ప్రస్తావిస్తూ, 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చే పరివర్తనకు దేశంలోని అపారమైన యువ జనాభానే చోదక శక్తిగా చెబుతున్నారు. యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, డిజిటల్ నైపుణ్యాలు, ఆవిష్కరణలు, ఆకాంక్షలు ఆయన రాజకీయ పదజాలంలో ఒక ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాయి. ఎంవై భారత్, వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు, జాతీయ పరివర్తనలో యువతను భాగస్వాములుగా చూపించే ఈ కథనం చుట్టూనే రూపొందించబడ్డాయి.

ఇందులో కష్టమైనదేమిటంటే, జనాభా లబ్ధి ప్రసంగాల ద్వారా సృష్టించబడదు. దానికి పనిచేసే సంస్థలు, విశ్వసనీయమైన పరీక్షలు, విస్తరిస్తున్న ఉపాధి, సామాజిక చైతన్యం, ప్రతిభకు ప్రతిఫలం లభిస్తుందనే నమ్మకం అవసరం. యువతకు, పరీక్ష పత్రం లీక్ అవ్వడం అనేది కేవలం ఒక పరిపాలనాపరమైన అవకతవక కాదు. ఇది సంవత్సరాల తరబడి చేసిన సన్నాహాలు, కుటుంబ పొదుపు, వ్యక్తిగత త్యాగాల విధ్వంసానికి దారితీయవచ్చు. ఒక ప్రభుత్వం పరీక్ష వివాదాన్ని విచారణ, కొత్త చట్టం లేదా పరిపాలనా పునర్వ్యవస్థీకరణ అవసరమైన విషయంగా చూడవచ్చు. కానీ, ఆ పరీక్ష కోసం మూడేళ్లుగా సిద్ధమవుతున్న 22 ఏళ్ల యువకుడు/యువతి, తమ భవిష్యత్తు నిర్మాణం కోసం పడిన శ్రమ కూలిపోవడాన్ని చూస్తారు. జంతర్ మంతర్ ఉద్యమం ఎందుకు అంత త్వరగా రాజకీయ శక్తి ని పుంజుకుందో వివరించడానికి ఈ అవగాహనా అంతరాలు సహాయపడతాయి.



రాజకీయ వ్యవస్థలోని కొన్ని వర్గాలు, అసమ్మతి తెలిపే విద్యార్థులను రాజకీయ ఆందోళన అనే సాంప్రదాయ పదజాలంతో చూడటమే అతిపెద్ద పొరపాటు. ప్రభుత్వాలు అన్నిచోట్లా వీధుల్లో నిరసనలను ఇష్టపడవు. బిజెపికి అదనపు ఇబ్బంది ఏమిటంటే, దాని రాజకీయ సంస్కృతి ప్రజలమధ్య బహిరంగ చర్చను జాతీయ ఎజండా మద్దతుదారులకు, దానికి అడ్డుపడేవారికి మధ్య ఎక్కువగా విభజిస్తున్నది. సైద్ధాంతికమైనవి కాకుండా వ్యక్తిగతమైన మనోవేదనలు ఉన్న తరానికి ఇలాంటి ద్వంద్వ వైఖరిని వర్తింపజేసినప్పుడు అది ప్రమాదకరంగా మారుతుంది.

మోదీకి సాంప్రదాయ మీడియాను దాటవేసి ఓటర్లతో ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పరచుకోవడానికి సహాయపడిన అదే డిజిటల్ పర్యావరణ వ్యవస్థ, ఇప్పుడు యువ పౌరులకు రాజకీయ పార్టీలను దాటవేసేందుకు వీలు కల్పిస్తోంది. మరో ప్రతిపక్ష కూటమి ఆవిర్భావం కంటే ఈ పరివర్తనే బిజెపిని ఎక్కువగా ఆందోళనకు గురిచేయాలి. రాజకీయ సంస్థకు ఇకపై సాంప్రదాయ సంస్థాగత మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అవసరం లేదని యువత సమీకరణ నిరూపించింది. పాతుకుపోయిన పార్టీలు ఏం జరుగుతుందనేది పూర్తిగా అర్థం చేసుకునేలోపే ఒక రెచ్చగొట్టే నినాదం, ఉమ్మడి ఇబ్బందులు, వికేంద్రీకృత ఆన్‌లైన్ సమాజం ఒక ఉద్యమాన్ని సృష్టించగలవు.

కాక్రోచ్ జనతా పార్టీ ఆ అవకాశాన్ని కచ్చితంగా నిరూపించింది. అది ఒక సంప్రదాయ రాజకీయ పార్టీగా మారుతుందా లేదా అనేది దాని ప్రాధాన్యత ఎన్నడూ కాదు. వాస్తవానికి ఎన్నికలలో పోటీ చేయడం కంటే ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉండటమే దాని ఆకర్షణను బాగా పరిరక్షించవచ్చు. ఇంతకుముందు కేవలం ఓటింగ్ వర్గంగా మాత్రమే పరిగణించబడిన ఒక తరం, తమ సొంత రాజకీయ భాషను, నాయకత్వాన్ని, సమీకరణ పద్ధతులను సృష్టించుకోగలదని నిరూపించడంలోనే దీని ప్రాముఖ్యత ఇమిడి ఉంది. యువతకు ఆదేశాల కంటే సంభాషణే అవసరమని సంఘ్ నిజంగా విశ్వసిస్తే, తమ భావజాల కుటుంబానికి చెందిన ప్రభుత్వాలను యువత విమర్శించినప్పుడు ఈ సూత్రం వర్తించాలి. ఘర్షణ ఇప్పటికే రాజకీయ నష్టాలను కలిగించిన తర్వాత, ఇది కేవలం ప్రజా సంబంధాల సర్దుబాటుగా మాత్రమే పనిచేయకూడదు. అలాగే, అధికారాన్ని యువత సవాలు చేసినప్పుడల్లా వారిని రాజకీయంగా అపరిపక్వంగా పరిగణిస్తూ, వారిని ఆవిష్కర్తలుగా, పారిశ్రామికవేత్తలుగా, దేశనిర్మాతలుగా బిజెపి కీర్తించకూడదు. అసలు సమస్య విశ్వసనీయతకు సంబంధించినది. కోట్లాది మంది యువ పౌరులు ఉండటం జాతీయ పురోగతికి దానంతట అదే పూచి ఇస్తుందన్నట్లుగా, జనాభా లబ్ధిని సంవత్సరాలుగా దాదాపు ఒక ఆర్థిక అనివార్యంగా చూపిస్తూ వచ్చారు. కానీ అది వాస్తవం కాదు. అవకాశాల కంటే ఆకాంక్షలు వేగంగా విస్తరించినప్పుడు, తమ భవిష్యత్తును నిర్దేశించే సంస్థలు కనీస న్యాయానికి కూడా హామీ ఇవ్వలేవని విద్యావంతులైన పౌరులు గ్రహించినప్పుడు, ఈ జనాభా లబ్ధి ఒక జనాభా భారంగా మారగలదు.

తమ జీవితాంతం 'వికసిత్ భారత్' వాగ్దానాలను వింటూ, ఆ వాగ్దానం చేయబడిన భవిష్యత్తులో తమ స్థానం ఏమిటని ప్రశ్నించడం ప్రారంభించిన యువతను ఇప్పుడు రాజకీయ వ్యవస్థ ఎదుర్కొంటోంది.

భారతదేశ యువత ఇకపై కేవలం రాజకీయ నాయకులు వేదికల నుండి ప్రస్తావించే జనాభా లబ్ధి మాత్రమే కాదు. వారు తమ సమస్యలను నిర్వచించుకోగల, తమ పోరాటాలను ఎంచుకోగల, ప్రభుత్వాలు స్పందించేలా ఒత్తిడి చేయగల స్వయంప్రతిపత్తి గల రాజకీయ వర్గంగా ఎదుగుతున్నారు. దేశ భవిష్యత్తుగా కీర్తించబడటం నుంచి, దాని వర్తమానంలో తమ గొంతుకను వినిపించాలని డిమాండ్ చేసే స్థాయికి మారడం అనేది ఎంతో ముఖ్యమైన అంశం. వారికి చేరువయ్యేందుకు ఆర్‌ఎస్ఎస్ అధిపతి చేసిన ప్రయత్నంలోని ఏ ఇతర విషయం కన్నా ఇది చాలా ఎక్కువ పర్యవసానాలకు దారితీయవచ్చు.

# స్వాతంత్ర్య పోరాటంలో ఎఐఎస్‌ఎఫ్ ఉజ్జ్వల పాత్ర



శ్రీమతి క్రిష్ణ ఝా

ఈరోజు(ఆగస్టు12) అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవం. 1936లో సంస్థాపన దినం నుంచీ అది జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో పాలు పంచుకుంది.84సంవత్సరాల క్రితం, 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమం ఆరంభంకాగా, ఎఐఎస్ఎఫ్ అందులో అగ్రశ్రేణి పాత్ర పోషించింది.

సింధ్‌లో అరెస్ట్ చేసి ఉరికంబానికి పంపబడిన తొలి ఆగస్టు తిరుగుబాటుదారుల్లో ఒకరు ఎఐఎస్‌ఎఫ్ కార్యకర్త. అతని పేరు హేము కలానీ– సింధ్‌లోని సుక్కూర్‌లో స్కూల్ విద్యార్థి; సుక్కూర్ విద్యార్థి యూనియన్‌లో క్రియాశీల కార్యకర్తల్లో ఒకడు. ఆ ప్రాంతంలో ఎఐఎస్‌ఎఫ్ ఆ యూనియన్ మాటున పనిచేసింది. బ్రిటిష్ పాలకులు 1942 ఆగస్టు 24 రాత్రి హేమును అరెస్టు చేశారు. అటు తరువాత అతనికి ఉరిశిక్ష విధించబడింది. 1943 జనవరి 21 ఉరితీశారు. ఆ సమయంలో అతని పెదవులు ఇంక్విలాబ్ జిందాబాద్ అని ఉచ్ఛరించాయి. సింధ్‌లో ప్రతి ఇల్లు అతని పేరు తలచుకుంది. జోథ్‌పూర్‌లో ఒక బహిరంగ కూడలికి హేము కలానీ చౌక్ అని పేరు పెట్టారు.

అమర జీవుల జాబితాలో చేరుతున్న బాలురు, బాలికల ప్రవాహం త్వరలోనే అనంతం కావటంతో వరదగేట్లు తెరుచుకున్నాయి. అది చారిత్రాత్మక ఘటనగా మారి యావద్దేశాన్నీ కుదిపివేసింది. యుపి (అప్పుడు యునైటెడ్ ప్రావిన్సెస్) ఉద్యమానికి ప్రధాన కేంద్రమైంది. ఆ ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రముఖుల్లో సర్జూపాండే ఒకరు. ఆయన , రామాసింగ్ తదితర అనుచరులతో 1942ఆగస్టు 15 న కాశీమాబాద్ పోలీస్ స్టేషన్ చేరుకుని, అక్కడున్న పోలీస్ అధికారి మీద ఒత్తిడి తెచ్చి అతని చేత యూనియన్ జాక్ పతాకం దించి త్రివర్ణ పతాకం ఎగుర వేయించారు. వారు అక్కడున్న తుపాకులన్నీ తీసుకుని అంతర్ధానమైనారు. కాశిమాబాద్ పోలీస్ స్టేషన్‌పై వారం రోజుల పాటు మువ్వన్నెల పతాకం ఎగిరింది.

సర్జూపాండే కనిపిస్తే కాల్చివేయాలని ఉత్తర్వులు జారీ అయినాయి. ఆ ఘటన ప్రతిచోటా కథలుగా చెప్పుకోబడింది. సర్జూ, అతని అనుచరులు ఒక గ్రామంనుంచి మరో గ్రామానికి మారుతూ చాలా కాలం అజ్ఞాత జీవితం గడిపారు. గ్రామస్థులు ఎన్నడూ ఆయన్ను అప్పగించలేదు. పోలీస్‌లు వారి కుటుంబాలను వేధించసాగారు.

కొద్ది మాసాల తర్వాత సర్జూ, సుశుండి గ్రామంలో సహచరుడు రామాసింగ్‌తో పాటు అరెస్టు అయినాడు. సర్జూను ముందుగా ఘాజీపూర్ జైలుకు, అక్కడినుంచి బెనారస్, ఇతర జైళ్లకు పంపారు. అధికారులు అతని పట్ల అమానుషంగా ప్రవర్తించారు. ఒంటరి జైలు గదిలో బంధించారు, సంకెళ్లు వేశారు, పాశవికంగా దెబ్బలు కొట్టారు. పిండి మిల్లులో బలవంతంగా పనిచేయించారు. పేము బెత్తంతో స్పృహకోల్పోయేవరకు కొట్టినప్పుడల్లా ఆయన 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అని నినదించాడు. తన కేసు తానే వాదించుకున్నాడు. అన్ని ఆరోపణలూ అంగీకరించాడు. ఆయనకు 42 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, భారీ జుల్మానా విధించబడినాయి.

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఎఐఎస్‌ఎఫ్ కార్యకర్తలు అదే రీతిన తిరగబడ్డారు. బెనారస్ హిందూ యూనివర్సిటీ(బిహెచ్‌యు)లో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పడంతో సైన్యాన్ని రప్పించారు. సైన్యం ఎనిమిది రోజులు తిష్టవేసింది. రెండు ఎస్ ఎఫ్ సంఘాలకు – కాంగ్రెస్‌కు చెందిన షా గ్రూపు, భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన ముఖీం ఫారూఖీ గ్రూపుకు చెందిన విద్యార్థులు ఐక్యంగా పనిచేశారు. వారు కలిసికట్టుగా పనిచేశారు, కలిసికట్టుగా లాఠీలు, తూటాలు ఎదుర్కొన్నారు, జైలుకెళ్లారు.

బిహెచ్‌యుకు చెందిన ఎస్‌ఎఫ్ సంఘాలు తమ కార్యకలాపాలను త్వరలోనే వారణాసి నుంచి ఘాజీపూర్‌కు విస్తరించారు. విశ్వనాథ్ సింగ్ అనే ఎఐఎస్‌ఎఫ్ కార్యకర్త జిల్లా కేంద్రంలోని కొత్వాలీకి విద్యార్థులతో పెద్ద ప్రదర్శన తీశారు. ఫిరోజాబాద్‌కు చెందిన ఓం ప్రకాశ్ పలీవాల్–భారతమాత ఆత్మగౌరవం రక్షణకు ప్రాణత్యాగాలు చేయండి, తర్వాతి తరాలు మిమ్ము స్మరించుకుంటాయి అని విద్యార్థులకు పిలుపుయిచ్చారు. ఆ తదుపరి కాలంలో పలీకాల్ ఎఐఎస్‌ఎఫ్ ( ఫారూఖీ) ప్రముఖ నాయకునిగా ఎదిగారు.

క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైనప్పుడు, బిహార్లో చంద్రశేఖర సింగ్ , రాహుల్ సాంకృత్యాయన్ , ఇంద్రదీప్ సిన్హా సహా ఎఐఎస్‌ఎఫ్ నాయకుల్లో అత్యధికులు నౌగాఛియాలో జరుగుతున్న ఎఐఎస్‌ఎఫ్ భాగల్పూర్ జిల్లా మహాసభలో ఉన్నారు.మహాసభ రెండురోజులు కొనసాగింది. చర్చల్లో క్విట్ ఇండియా ఉద్యమం ప్రాధాన్యం వహించింది. వారి నౌగాఛియాలో ఉండగా గాంధీజీ అరెస్టు వార్త అందింది. చంద్రశేఖరసింగ్ , ఆయన మిత్రులు ఆ మరునాడే పట్నా చేరారు. గాంధీజి, ఇతర జాతీయ నాయకుల అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తూ ఎఐఎస్‌ఎఫ్ ఒకరోజు సమ్మె పిలుపుఇచ్చింది.

ఆగస్టు12న , బిహార్ ఎఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర సింగ్ నాయకత్వంలో విద్యార్థులు సచివాలయం వద్ద పెద్ద ప్రదర్శన నిర్వహించారు. బ్రిటీష్ ప్రభుత్వం లాఠీచార్జీకి, కాల్పులకు ఒడిగట్టింది. ఏడుగురు విద్యార్థులు అమరులైనారు, అనేక మంది గాయపడ్డారు. ఎఐఎస్‌ఎఫ్ కార్యకర్తలు వారిని ఆసుపత్రికి మోసుకెళ్లారు. కార్యానంద శర్మ , సంత్ లాల్ సింగ్ , భోగేంద్రఝా, తేజ నారాయణ్ తదితర అనేక మంది ఎఐఎస్‌ఎఫ్ నాయకులను అరెస్టు చేశారు, జైలుకు పంపారు.

చంద్రశేఖర సింగ్ గాక, బిహార్‌లో విద్యార్థుల నిరసన ఆందోళనలకు నాయకత్వం వహించిన ఎఐఎస్‌ఎఫ్ ప్రముఖ కార్యకర్తల్లో కృష్ణ చంద్ర చౌదరి, చతురానన మిశ్రా,గంగాధర్ దాస్ , జైమంగళ్‌సింగ్ , డాక్టర్ రాం విలాస్ శర్మ , సియావర్ షరన్ తదితరులున్నారు. రాష్ట్రంలో పోలీస్‌లు మొత్తం 122 చోట్ల కాల్పులు జరిపారు. బెగుసరాయ్ జిల్లాలోని బిహత్‌లో ప్రజలు పోలీస్‌లతో హోరాహోరీ పోరాటం చేశారు. బిహత్–తేఘర మధ్య రోడ్డుపై పోలీస్‌ల కాల్పుల్లో యుచిత్ సింగ్ అనే విద్యార్థి అమరుడైనాడు.

స్వాతంత్ర్య పోరాటంలో ఎఐఎస్‌ఎఫ్ పాల్గొనటానికి గొప్ప ఉదాహరణల్లో ఒకటి సతారాలో క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా నానా పటేల్ ఏర్పాటు చేసిన పత్రీ సర్కార్. ఎఐఎస్‌ఎఫ్ కు చెందిన విద్యార్థి కార్యకర్తలు, ఆరు, ఏడు తరగతులవరకు చదువుకున్న రైతులు. ఈ ఉద్యమ రహస్య జీవిత కార్యకర్తల్లో అత్యధికంగా ఉన్నారు.1946 జనవరి వరకు కొనసాగిన పత్రీ సర్కార్ దాని సామాజిక , వ్యవస్థాగత, పరిపాలనాత్మక , న్యాయ కృషితో ఆ ప్రాంతంపై, జాతీయోద్యమంపై గాఢమైన ముద్రవేసింది. ఈ చరిత్రాత్మక ఉద్యమంలో విద్యార్థులు, యువజనులు చెప్పుకోదగ్గ దోహదం చేశారు.

అహింసాయుత మార్గంలో పనిచేయటం ప్రారంభించిన సంఘాల్లో కొన్ని1942 ఉద్యమంలో హింసాయుత పద్ధతులు చేబట్టాయి. ' పరిస్థితులు బట్టి పద్ధతులు ఉపయోగించాలి' అన్న గాంధీజీ ప్రకటనను అవి ఉపయోగించుకున్నాయి. ఆ విధంగా, పులిన్ బెహారీ సేన్ అనే ఎఐఎస్‌ఎఫ్ క్రియాశీల కార్యకర్త ఖెజురీలో మిలిషీయాను నడిపాడు. దాని రహస్య కార్యకర్తలు యువకులకు లాఠీలు , కత్తులు ఉపయోగించటంలో శిక్షణ యిచ్చారు, విప్లవ సాహిత్యం పంపిణీ చేశారు.

అహ్మదాబాద్‌లో ఎఐఎస్‌ఎఫ్ కార్యకర్త , కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ నాయకుడు కూడా అయిన జయంతి ఠాకోర్ తన ''ఆజాద్ ప్రభుత్వం'' నుంచి గృహ యజమానులకు ఆదేశం జారీ చేశాడు.: 'ప్రతి ఒక్క ఇంటి యజమాని జాతీయోద్యమ నిధికి అణా చొప్పున ( 16అణాలు ఒక రూపాయి) చెల్లించాలి''. ఆ విధంగా 50 రూపాయలు సేకరించాడు. అతడు త్వరలోనే అహ్మదాబాద్ నగర అధిపతి (హెడ్)గా ప్రజాదరణ పొందాడు . ఆయన కింద ''పోల్ నాయక్‌లు'' ఉన్నారు. కులప్రాతిపదికపై ఏర్పడిన నివాస ప్రాంతాలను ''పోల్'' అని పిలిచేవారు. వారు వాటికి నాయకులు. ఆయన పర్యవేక్షణ కింద 19 మంది నాయకులు 14 నగర వార్డులు వ్యవహారాలు చూశారు.

# భూ పోరాట యోధుడు దాసరి


### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
### శతజయంతి సభలో నేతల ఘన నివాళి
### ఎన్ఆర్ దాసరి కాంస్య విగ్రహం ఆవిష్కరణ



**నూజివీడు :** ఒక్కరు ఉన్నప్పటికీ త్యాగాలకు సిద్ధపడి ప్రజల కోసం పోరాటం చేయడమే కమ్యూనిస్టులుగా కామ్రేడ్ ఎన్ఆర్ దాసరికి మనమిచ్చే ఘన నివాళి అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. భూపోరాటయోధుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు దాసరి నాగభూషణరావు శత జయంతి సందర్భంగా నూజివీడు అమర్‌భవన్‌లో సోమవారం దాసరి కాంస్య విగ్రహాన్ని సిపిఐ సీనియర్ నాయకులు చలసాని జగన్నాధరావు, కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆవిష్కరించారు. అనంతరం అమర్‌భవన్ సొసైటీ అధ్యక్షులు, సిపిఐ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దాసరి పోరాట చరిత్ర నేటి తరానికి స్ఫూర్తి, ప్రేరణ అన్నారు. ఒకే పార్టీని నమ్ముకొని... పేదల కోసం పోరాడే తత్వం గలవారే కమ్యూనిస్టులని అన్నారు. కమ్యూనిస్టు పార్టీకి 100 ఏళ్ల చరిత్ర ఉందని, అయినా కమ్యూనిజం లేదని కొంతమంది ఇంకా పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని, అలాంటి వారికి గట్టి సమాధానం చెప్పాలని పార్టీ శ్రేణులకు కూనంనేని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు సిద్ధాంతం పట్ల ఇష్టంతో, విశ్వాసంతో ఉండాలని, దీనికోసం ఎటువంటి కష్టానికైనా, త్యాగానికైనా సిద్ధపడాలన్నారు. మానవ కేంద్రీకృత సిద్ధాంతమే కమ్యూనిజమన్నారు. ప్రపంచవ్యాప్తంగా 300 కోట్ల మంది ప్రజలు కమ్యూనిజం పాలిత దేశాల్లో ఉన్నారని, భారతదేశంలో కోట్ల మంది ఎర్రజెండా పట్టుకున్నారని పేర్కొన్నారు. దాసరి ప్రేరణతో యువతరాన్ని ప్రజా ఉద్యమాల వైపు నడిపించాలని, నిరుత్సాహం కమ్యూనిస్టుల రక్తంలో ఉండకూడదన్నారు. కమ్యూనిస్టులు ఒక్కరే ఉన్నా పోరాటం కొనసాగించాలన్నారు. అదే దాసరికి ఇచ్చే ఘన నివాళి అని ఆయన సూచించారు. గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ దాసరి ఆశయాల కోసం పనిచేస్తూ ప్రజా ఉద్యమాలు నిర్మించడమే కమ్యూనిస్టుల కర్తవ్యమని పేర్కొన్నారు. పోరాటాల ద్వారా పేదలకు భూమి పంపిణీ చేసి... వారిలో సామాజిక మార్పుకు దాసరి శ్రీకారం చుట్టారన్నారు. జీవిత చరమాంకం వరకు కమ్యూనిస్టుగా నిలిచిన గొప్ప నాయకుడు దాసరి అన్నారు. శత జయంతి కార్యక్రమంలో ఆయన త్యాగాలను కొనియాడుతున్నామంటే ఆయన చూపిన పోరాట స్ఫూర్తి కారణమన్నారు. అధ్యయనం లేకుండా పోరాటం లేదని నమ్మిన మహానేత దాసరి అని, ఆయన స్ఫూర్తితో ఇప్పుడున్న సమాజాన్ని మార్చాలంటే ప్రజలతో మమేకమై ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ బడుగుల ఉన్నతి కోసం జీవితాంతం పోరాడిన నాయకుడు దాసరి నాగభూషణరావు అని కొనియాడారు. ఏ బాధ్యత తీసుకున్నా వెనకడుగు వేయని తెగింపు గల నేత దాసరి అన్నారు. మాజీ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్నీ వదులుకొని నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజా ఉద్యమాల్లో మమేకమైన వ్యక్తి దాసరి అని, దాసరి పోరాటం నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ దాసరి ఆశయాలు కొనసాగించడానికి ఆచరణ ముఖ్యమని, దాసరి చూపిన పోరాటస్ఫూర్తితో నేటితరం కమ్యూనిస్టులు ప్రజా ఉద్యమాలపై దృష్టి సారించాలన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ నిస్వార్థపరుడు, నిజాయతీపరుడు దాసరి నేటి తరానికి స్ఫూర్తి అన్నారు. శక్తి, సామర్థ్యం, రాజకీయ చతురత దాసరి సొంతమని, ఆయన ఎన్నో భూపోరాటాలు నిర్వహించి విజయవంతం చేశారన్నారు. సిపిఎం నాయకుడు వై.కేశవరావు, సిపిఐ (ఎంఎల్) నాయకుడు హరినాథ్, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కష్ణ చైతన్య, నూజివీడు కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ తదితరులు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నాయకులు చంద్రనాయక్, ఆర్.పిచ్చయ్య విప్లవ గేయాలు ఆలపించారు.

## దాసరి నాగభూషణ రావు ఆశయ సాధనకు కృషి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేదల కోసం తన జీవితాంతం అవిశ్రాంత ఉద్యమాలు నిర్వహించిన గొప్ప నేత దాసరి నాగభూషణరావు అని, ఆయన ఆశయాల సాధన కోసం సిపిఐ, ప్రజా సంఘాల శ్రేణులు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ పిలుపునిచ్చారు. సిపిఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు దాసరి నాగభూషణ రావు 100వ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో దాసరి నాగభూషణ రావు చిత్రపటానికి ఈ.టి.నరసింహ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ దాసరి నాగభూషణ రావు పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో తనదైన గొప్ప పాత్ర పోషించారని కొనియాడారు. ఆనాటి నాయకుల త్యాగాల స్ఫూర్తితో నేటి యువత కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి దోహదపడాలని నరసింహ అన్నారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.శ్రీమాన్, ఇస్కఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కె.రాజశేఖర్, సిపిఐ నాయకులు శ్రీరాములు, దశరథ, కళ్యాణ్, రాజేందర్ పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



### గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/కమలాపూర్ :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని, పేదల కష్టాలు, బాధలు తీర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదల గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, సన్నబియ్యం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని పేర్కొన్నారు. సొంతిల్లు అనేది ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి అన్నారు. గతంలో వివిధ దశల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను కూడా పూర్తి చేసి పేదలకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, , హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో వారం రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజులపాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అయితే భారీ వర్షాలకు దారితీసే బలమైన వాతావరణ వ్యవస్థలు ప్రస్తుతం చురుగ్గా లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సాధారణ వర్షాలే నమోదయ్యే అవకాశముందన్నారు. సోమవారం విడుదల చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం సోమవారం నుంచి గురువారం వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. అలాగే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అడపాదడపా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. తొలి మూడు రోజులు వర్షాలతో పాటు బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ప్రస్తుతం రాష్ట్రంపై ప్రభావం చూపే బలమైన వాతావరణ వ్యవస్థలు ఏవీ లేవని తెలిపారు. అయితే వాతావరణంలో తేమ అధికంగా ఉండటం, పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరగడం వల్ల సాయంత్రం, రాత్రి వేళల్లో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు.

## 'పిఎం ఏక్తా మాల్' టెండర్లలో భారీ కుంభకోణం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'పిఎం ఏక్తా మాల్' టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. ప్రజల భూమిని, కేంద్ర నిధులను ప్రైవేటు డెవలపర్లకు సిఎం రేవంత్ రెడ్డి దోచి పెడుతున్నారని, దీనిపైన కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ టెండర్లను రద్దు చేసి, 'స్వతంత్ర విచారణ' చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు కెటిఆర్ సోమవారం లేఖ రాశారు. రూ.2,059.81 కోట్ల పిఎం ఏక్తా మాల్ ప్రాజెక్టు విషయంలో తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని,ఈ ప్రాజెక్ట్‌లో కేంద్రానికి చెందిన రూ.202 కోట్ల నిధులు ఉన్నాయని వివరించారు. రాయదుర్గంలోని 6.30 ఎకరాల విలువైన ప్రజా భూమిలో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని, ప్రభుత్వానికి కనీసం 9 లక్షల చదరపు అడుగులు.. ప్రైవేటు డెవలపర్ మాత్రం 18 లక్షల చదరపు అడుగులను వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారని ఆ లేఖలో వివరించారు. ప్రజా భూమిని, ప్రజాధనాన్ని వినియోగిస్తూ ప్రభుత్వ వాటా కంటే కూడా ప్రైవేటు డెవలపర్‌కే రెట్టింపు వాటా ఉన్నదని తెలిపారు. రూ 200 కోట్ల వడ్డీలేని ఎస్ఎఎస్‌సిఐ రుణాన్ని ప్రైవేటు డెవలపర్‌కు బ్యాక్‌టుబ్యాక్‌గా మళ్లించే విధంగా టెండర్ నిబంధనలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిధులను ప్రైవేటు సంస్థల చేతికి అందకుండా చూడాలని, ఆ టెండర్‌ను రద్దు చేయాలని, దీనిపైన విచారణ చేపట్టి, బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. గతంలో అమృత్ టెండర్లు, బొగ్గు కుంభకోణం విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినా స్పందించలేదని ఆరోపించారు. ప్రధానితో సహా కేంద్ర మంత్రులు తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడడమే తప్ప, తగిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆధారాలతో సహా వివరాలను అందించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలపై కేంద్రం స్పందించడం లేదని కెటిఆర్ ఆరోపించారు.

## నాలుగు కార్మిక కోడ్లను వెంటనే రద్దు చేయాలి

### రాజ్‌భవన్ ముట్టడిలో ఐఎన్‌టియుసి నేతల డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాలుగు కార్మిక కోడ్లను వెంటనే రద్దు చేసి ప్రస్తుత కార్మిక హక్కులను పరిరక్షించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణను నిలిపివేయాలని ఐఎన్‌టియుసి డిమాండ్ చేసింది. అఖిల భారత ఐఎన్‌టియుసి అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవరెడ్డి పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ నిరసన దినోత్సవం సందర్భంగా 'ఛలో రాజ్‌భవన్' కార్యక్రమం నిర్వహించారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ప్రారంభించిన చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ (ఐఎన్‌టియుసి) వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ నేతృత్వంలో రాష్ట్ర ఐఎన్‌టియుసి కార్యాలయం (నారాయణగూడ) నుంచి రాజ్‌భవన్ వరకు సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌లు విజయ్ కుమార్ యాదవ్, నగన్న గౌడ్, జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, మున్సిపల్ కార్మికులకు వృత్తిపరమైన ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2004 జనవరి 1 తర్వాత నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, శాశ్వత ఉద్యోగుల హక్కులు, వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రతను కాపాడాలని కోరారు. ప్రతి కార్మికుడికి న్యాయం, గౌరవం, సామాజిక భద్రత, గౌరవప్రదమైన ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ర్యాలీ రాజ్‌భవన్‌కు చేరుకున్న అనంతరం నిరసన తెలుపుతున్న ఐఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి : ఆదిల్ షరీఫ్**

ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ, సమాజానికి నిరంతరం సేవలందిస్తున్న కార్మికులు, ముఖ్యంగా మున్సిపల్ కార్మికుల సేవలు అమూల్యమన్నారు. కార్మికులకు న్యాయం, గౌరవం, సామాజిక భద్రత, వృత్తిపరమైన రక్షణ, మెరుగైన పని పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## ఆయుష్ వైద్య విద్యార్థులకు స్టైఫండ్ తక్షణమే పెంచాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయూష్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని తక్షణమే వారి స్టైఫండ్ పెంచాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం రాష్ట్రంలోని ప్రభుత్వ ఆయుష్ విద్యాసంస్థల హౌస్ సర్జన్స్, పిజి స్కాలర్స్ చేపట్టిన నిరవధిక దీక్షకు ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సోమవారం రామంతాపూర్ జెఎస్‌పిఎస్ ప్రభుత్వ హోమియోపతిక్ మెడికల్ కాలేజీలో కొనసాగుతున్న 7వ రోజు వైద్య విద్యార్థుల దీక్షలో కె.ధర్మేంద్ర,మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆయుష్ విద్యార్థులు సంవత్సరాలుగా తక్కువ స్టైఫండ్ చెల్లించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి, వివక్షకు నిదర్శనమన్నారు. విద్యార్థులు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే దీక్షకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2016 తర్వాత నిలిచిపోయిన స్టైఫండ్ పెంపును వెంటనే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఆయుష్ పి.జి. స్కాలర్స్‌కు సుమారు రూ.30 వేలు మాత్రమే అందుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ.60 వేల వరకు అందుతున్నట్లు తెలిపారు. ధరలు, విద్యా ఖర్చులు, జీవన వ్యయం పెరుగుతున్నా తెలంగాణలో మాత్రం స్టైఫండ్ పెంచకపోవడం అన్యాయమన్నారు. పక్క రాష్ట్రాల్లో సముచిత స్టైఫండ్ అందిస్తున్నప్పుడు తెలంగాణ విద్యార్థులకు ఎందుకు ఇవ్వడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆయుష్ విద్యార్థుల సమస్యను ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్చలకు పిలిచి స్టైఫండ్ పెంపుతో పాటు ఇతర వైద్య విద్యార్థులతో సమాన హక్కులు కల్పించాలి అని వారు కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తే, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల పోరాటానికి పూర్తి అండగా నిలిచి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని వారు హెచ్చరించారు. ఈ దీక్షలో ఆయుష్ వైద్య విద్యార్థుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు నితిన్, వైద్య విద్యార్థులు శ్రవణ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భర్త చనిపోతే భార్యకు వెంటనే వృత్తి, ఆసరా పెన్షన్ వర్తింపచేయాలి

### బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15 నుంచి అందించనున్న నూతన పెన్షన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విధివిధానాలు గీత, ఇతర వృత్తిదారులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉన్నాయని, వాటిని తక్షణమే సవరించాలని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులలో ఉద్యోగులు ఉండటం, ఇళ్లు, తదితర ఆస్తులు కలిగి ఉంటే పెన్షన్‌కు అనర్హులనే నిబంధనలు సరైనవికావని అన్నారు. విశ్రాంత ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు వర్తించని నిబంధనలు వృత్తి, ఆసరా పెన్షన్ దారులకు వర్తింపచేయడం అన్యాయమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
ఇప్పటికే అనేక మంది గత 6, 7 ఏళ్లుగా తమ వృత్తిలో ఉన్న తమ కుమారులు ఉద్యోగాలు చేస్తుంటే పెన్షన్ రద్దు చేయడం, పెన్షన్ పొందుతున్న వృత్తిదారులు మరణిస్తే తన భార్యకు పెన్షన్ వర్తింపచేయకపోవడమనేది దుర్మార్గమన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు పరిష్కరించాలని, కొత్త వారికి కూడా ఈ పథకం వర్తింపచేయాలని, ఎక్స్‌గ్రేషియా బకాయిలు చెల్లించాలని, ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా ఆసరా పెన్షన్లను రూ.5 వేలకు పెంచాలని బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమాన్ని.. ఒక గొప్ప వేడుకలా నిర్వహించాలి

### కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశభక్తికి, ఐక్యతకు ప్రతీకగా 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ ఒక గొప్ప వేడుకలా నిర్వహించాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తమ ఇళ్లపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపి, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణలు జాతీయ పతాకాలు ఎగురవేశారు.

## కోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదు

### ఆగస్టు 15 తర్వాత హైడ్రాపై పోరాటం ఉధృతం చేస్తాం
### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైకోర్టు పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ తీరులో ఎలాంటి మార్పు రావడం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతంరావు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్‌లతో కలిసి ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కోర్టును తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. సల్కం చెరువు పరిధిలో అక్రమ నిర్మాణాలపై స్పష్టమైన ఆధారాలు, కోర్టు ఆదేశాలు ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. నాదర్‌గూల్, బాలాపూర్ ప్రాంతాల్లో వేల ఎకరాల ప్రభుత్వ, భూదాన్ భూముల్లో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా జరుగుతున్నా హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. పెద్దలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం అన్నట్లుగా అధికారుల తీరు ఉందని, రంగనాథ్‌కు మజ్లిస్ ఆస్తుల పట్ల ఉన్న శ్రద్ధ ప్రజల పట్ల లేదని విమర్శించారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతున్న హైడ్రా, ఆ వివరాలను ప్రజల ముందు ఎందుకు ఉంచడం లేదని నిలదీశారు. రాష్ట్రాన్ని హిట్లర్, హైడ్రా, హిల్ట్ కాన్సెప్ట్‌తో నడిపించాలని చూశారని, చివరకు అది 'హాల్ట్'లో పడిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ భూములు, చెరువులను ఎవరు కబ్జా చేసినా బిజెపి ఊరుకోదని, ప్రజాధనాన్ని కాపాడేందుకు రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఆగస్టు 15 తర్వాత హైడ్రా, క్యూర్ చట్టంపై ప్రత్యేక సెమినార్ నిర్వహిస్తామన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా భూకబ్జాలపై ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని చెప్పారు. క్యూర్ విధానం వల్ల సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన వరుణ యాగంపై స్పందిస్తూ, సిఎం వరుణ యాగం చేస్తే తాము కాంగ్రెస్ కొట్టుకుపోవాలని వాయు యాగం చేస్తామని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. వానాకాలం ముగిసే సమయంలో యాగం చేయడం కొత్త నాటకమని, ఎల్‌నినో పరిస్థితి ముఖ్యమంత్రికి ముందే తెలియదా? అని ప్రశ్నించారు.

పార్టీ వ్యవహారాలపై స్పందిస్తూ, నిబంధనల ప్రకారం అధ్యక్షుడి రెండేళ్ల పదవీకాలం పూర్తయ్యాక కొత్త అధ్యక్షుడిని నియమిస్తారని, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే జిహెచ్ఎంసి ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. ధరణి, భూ భారతి పోర్టళ్ల మధ్య పెద్ద తేడా లేదని, పాత ప్రభుత్వం ఒక రకంగా దోచుకుంటే ప్రస్తుత ప్రభుత్వం మరో రకంగా దోచుకుంటోందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు అవకాశాలు ఉన్నవారికే పార్టీ టికెట్లు ఇస్తుందని స్పష్టం చేశారు.

# రైతుకు అండగా.. వ్యవసాయానికి భరోసాగా రాష్ట్ర ప్రభుత్వం

**రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం**
**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**ప్రజాపక్షం/హనుమకొండ :** రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కెఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం తీసుకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు.రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.రైతులు, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందించి సమగ్ర భూ సర్వేకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని భూముల యజమానులు సంతృప్తిగా ఉండటమే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వానికి నిజమైన ఆనందమని మంత్రి పేర్కొన్నారు.వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పు ల నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే పంటలను ఎంచుకోవాలని, నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి రైతు మేళా ద్వా రా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికతలు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతుల సూచనలు, అనుభవాలను రైతులు సద్వినియోగం చేసుకుని, వ్యవసాయంలో కొత్త విధానాలను అనుసరించి ఉత్పాదకత, ఆదాయాన్ని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.రైతు మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, విత్తనాలు, పంటల సాగు విధానాలు, వివిధ ఉత్పత్తుల గురించి రైతులు నిపుణులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సార య్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్ పా యి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆ దిరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, జిల్లా హార్టికల్చర్ అధికారి కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, వివిధ శా ఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీ ల రైతులు, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలుపాల్గొన్నారు.

## మావోయిస్టు రహిత ప్రాంతంగా కర్రె గుట్టలు : సివి ఆనంద్



**ప్రజాపక్షం/(నూగూరు) :** కర్రె గుట్టల ప్రాంతాన్ని మావోయిస్టు రహిత ప్రాంతంగా ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ తెలిపారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ సర్కిల్ పరిధిలోని పామునూరు సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంపును ఆయన సందర్శించారు.పామునూరు నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు.అనంతరం కర్రెగుట్టల్లో పోలీసు జెండాను ఎగురవేసి, శాంతికి ప్రతీకగా పావురాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 50,60 ఏళ్ళుగా మావోయిస్టు ప్రాంతంగా ఉన్న కర్రె గుట్టల్లో మావోయిస్టు ఏరివేత అనంతరం ప్రస్తుతం శాంతి వాతావరణం నెలకొందని ఆయన అన్నారు. పామునూరు బేస్ క్యాంపు నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు రహదారి మంజూరైందని త్వరితగతిన పూర్తి చేసి ప్రజా రవాణాకు అనుకూలంగా మార్చడంతో పాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పూర్వయం రహదారి చివరి భాగం వరకు వెళ్ళి పనులను పరిశీలించారు. ఇంకా మావోయిస్టు కార్యకలాపాల్లో ఉన్న వారు పోలీసుల ఎదుట లొంగిపోవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున పునరావాసం, అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. అడిషనల్ డిజిపి, ఐజి, ములుగు జిల్లా ఎస్‌పి రామ్‌నాథ్ కేకన్, అటవీ శాఖ ఉన్నతాధికారులు, సిఆర్‌పిఎఫ్ అధికారులు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి




**ప్రజాపక్షం/వాజేడు:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 6 నుంచి 14 వరకు సిపిఐ ఆధ్వర్యంలో చేపడుతున్న దేశవ్యాప్త రాజకీయ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న బద్లావ్ జరూరీ హై (మార్పు అత్యవసరం) చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ములుగు జిల్లా వాజేడు మండలం ధర్మారం గ్రామంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆదంత ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల శ్రీను, గగ్గురి నరసింహారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం వనదేవతలను దర్శించుకోనున్న నేపథ్యంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క మేడారంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సిఎం పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్‌రావు, డిపిఒ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలపై ఉద్యమం



**ప్రజాపక్షం /ములుగు సీటీ :** కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ పిలుపులో భాగంగా ఈ రోజు ములుగు జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజీ ప్రాంగణంలో రైతు సంఘం నాయకులు ఇంజం కొమురయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐటి యుసి, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శులు జంపాల రవీందర్, బొమ్మిడి సాంబయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి కట్టబెట్టడంలో నిమగ్నమవడం కార్మిక చట్టాలను కుదించడం వ్యవసాయదారులను, కార్మికులను దారుణంగా మోసం చేయడమే అన్నారు. ఇలాంటి మోసపూరిత పూరిత ప్రభుత్వాన్ని గద్దె దించవలసిన కూడా రైతులు,కార్మికులే అని అన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు ముత్యాల రాజు, పొన్నాల లలిత, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు గుగులోత్ నమ్మయ్య, రైతు సంఘం నాయకులు ఇంజం కొమురయ్య, రత్నం దామెర, పిఓడబ్ల్యు మహిళా సమాఖ్య నాయకులు బొమ్మెడ లక్ష్మి కృ, భూంపల్లి జాన్సీ, లలిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల రక్షణకు కార్మిక వర్గం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

**ప్రజాపక్షం/ నర్సంపేట:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు , కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈరోజు ఎస్‌కెఎం (సంయుక్త కిసాన్ మోర్చా) చేపట్టిన దేశవ్యాప్త జైలు భరో కార్యక్రమంలో భాగంగా నర్సంపేట పట్టణంలో వామపక్ష రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నాయకులు కార్యకర్తలు భారీ ఆందోళన, రాస్తారోకో చేపట్టారు. నాలుగు లేబర్ కోడులను ఉపసంహరించుకునే అంతవరకు రైతు కార్మిక వర్గం విశ్రాంతి లేకుండా పోరాటాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్నం వెంకన్న, సింగతి మల్లికార్జున్, ఎండి మహమూద్, కేతెల్లి సదానందం, వంగల రాగ సుధ, మోడీ మల్లేశం, ఈర్ల పైడి, అక్కపెల్లి రమేష్, ఇల్లందుల సాంబయ్య, జక్కుల తిరుపతి, కసుగుల రంజిత్, అద్దూరి రాజు, కత్తుల కొమురయ్య, ఊసంపెల్లి బాబు, కోరబోయిన కుమార్ స్వామి, గడ్డమీద బాలకృష్ణ, గొర్రె ప్రదీప్, మార్త నాగరాజు, కలకట్ల యాదగిరి, సురేందర్, గణిపాక బిందు పాల్గొన్నారు.

## నేటి నుంచి రెండు రోజులు పోటీలు

**నేడు క్రీడా పోటీలను ప్రారంభించనున్న సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి**




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టిజిఎన్‌పిడిసిఎల్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు క్రీడా టోర్నమెంట్లను నిర్వహించనున్నారని యాజమాన్యం ప్రకటించించింది.2026–27 సంవత్సరానికి సంబంధించిన ఈ క్రీడా పోటీలు ఆగస్టు 11, 12 తేదీల్లో హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం( జెఎన్ ఎస్)లో నిర్వహించనున్నారు. టిజిఎన్‌పిడిసిఎల్‌కార్పొరేట్ కా ర్యాలయం వరంగల్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.ఈ క్రీడా టోర్నమెంట్లను టిజిఎన్‌పిడిసిఎల్‌సి ఎండి క ర్నాటి వరుణ్ రెడ్డి, ఐఎఎస్ నేటి ఉదయం 10 గంటలకు ప్రా రంభించనున్నారు.టిజిఎన్‌పిడిసిఎల్ పరిధిలోని 18 సర్కిళ్లకు చెందిన పురుష, మహిళా ఉద్యోగులు ఈ క్రీడా పోటీల్లో పా ల్గొంటున్నారు. ఈ రెండు రోజుల క్రీడా పోటీల్లో ఉద్యోగులు ఉ త్సాహంగా పాల్గొనేందుకు వీలుగా మొత్తం ఆరు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.బ్యాడ్మింటన్, క్రికెట్, క్యారమ్స్, చెస్, టెన్నిస్, వాలీబాల్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తారు.టిజిఎన్‌పిడిసిఎల్‌లో వివిధ క్రీడాంశాల్లో పురుష, మహిళా ఉద్యోగులు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించడం ద్వారా ఉద్యోగుల్లో టీమ్ స్పిరిట్, ఆరోగ్యకరమైన పోటీ తత్వం, స్నేహభావం, ఉత్సాహం పెంపొందించడమే లక్ష్యంగా సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని యాజమాన్యం తెలిపింది .ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి సంస్థ ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దృఢత్వంతో పాటు కార్యాలయ విధుల్లో మరింత ఉత్సాహంగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని యాజమాన్యం పేర్కొంది.

## బ్యాంకింగ్ సేవల విస్తరణపై లోక్‌సభలో గళమెత్తిన ఎంపి కావ్య

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద ఆర్థిక సేవల పరిస్థితి, జనధన్ ఖాతాల సంఖ్య, రూపే కా ర్డుల జారీ, ఆధార్ అనుసంధానం, ఖాతాల నిర్వహణ, డిబిటి ప్రయోజనాలపై వరంగల్ పార్లమెం ట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, ఆర్థిక అక్షరాస్య త కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ మౌలిక వసతుల విస్తరణపై కూడా వివరాలు కోరారు.వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వరంగల్ జిల్లాలో పిఎంజెడివై ఖాతాలు 2024 మార్చిలో 2,69,894 ఉండగా .. 2026 మార్చి నాటికి 3,02,317కు పెరిగాయి. ఇదే సమయంలో ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాలు 2,18,133 నుంచి 2,65,470కు చేరాయి. రూపే కార్డులు 2,12,030 నుంచి 2,2 6,409కు పెరిగాయి.జన్‌ధన్ ఖాతాల సంఖ్య పెరిగినప్పటికీ ఆపరేటివ్ ఖాతాల సంఖ్యలో తగ్గుదల నమోదైంది. 2024 మార్చిలో 2,28,257 ఖాతాలు ఆపరేటివ్‌గా ఉండగా.. 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గింది. పిఎంజెడివై ఖాతాలకు అనుసంధానమైన డిబిటి పథకాల వివరాలను కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ,గ్రామీణ, పేద, అణగారిన వర్గాలకు ప్రభు త్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేందుకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరం చేయాలన్నారు. డిజిటల్ చెల్లింపులపై అవగాహనను మరి ంత విస్తరించి,మహిళలు,రైతులు,కూలీలు,చిన్నవ్యాపారులు సహా ప్రతి వర్గానికి ఆర్థిక అక్షరాస్యత కల్పించాలని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో బ్యాంకింగ్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, బ్యాంకింగ్ సేవలు,డిబిటి ప్ర యోజనాలు అందేలా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలనికోరారు.

## సెప్టెంబర్1న పెద్ద ఎత్తున బహిరంగ సభ

**సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాషా మియా**



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** పన్నెండేళ్ళుగా మోదీ బిజెపిప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తూ, కార్పొరేట్‌కు అనుకూలంగా పాలన చేయడానికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో సిపిఐ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని వరంగల్ జిల్లా సిపిఐ కార్యదర్శి షేక్ బాషా మియా అన్నారు . సిపిఐ పార్టీ చేపట్టిన పాదయాత్రలో సోమవారం రాత్రి నల్లబెల్లి మండలనికి చేరుకుంది. స్థానిక బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేసిందనీ ఈ సభ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి చైతన్యం చేయడం కోసమే వరంగల్ జిల్లాలో ఆగస్టు 9 నుంచి 14 వరకు పాదయాత్ర చేపట్టినట్టు జరిగిందన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమార స్వామి మాట్లాడుతూ రైతు పంటల కొనుగోలుకు , ఉపాధిహామీ పథకానికి గ్యారెంటీ లేకుండా చేశారని, గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులకు ద్రోహం చేస్తున్నారని, ప్రశ్న పత్రాల లీకేజీలకు పాల్పడుతూ విద్యార్థుల జీవితాలతో చలగాటాలు పడుతున్నారన్నారు. కార్పొరేట్లకు లక్షల కోట్లు రుణమాఫీలు చేస్తూ ప్రజలపై పన్నులు పెంచడాన్ని సిపిఐ వ్యతికిస్తుందన్నారు. ప్రభుత్వ రంగాలను అంబానీ, అదానీలకు కట్టబెట్టే దుశ్చర్యలకు వ్యతిరేకంగా సిపిఐ చేపట్టబోయే ఉద్యమాలలో ప్రజలు పాల్గొనాలన్నారు. అనంతరం మండల కార్యదర్శి పరికి కోర్నేలు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్, కార్యవర్గ సభ్యులు గుండె భద్రి, ఖాద్రీ, శరత్, సువర్ణ రహేలా ,శ్వేత, మున్నీ,జన్ను రాజు, సాంబమూర్తి ఆరెల్లి రవి ,అక్బర్ పాదుషా, ఓర్సు రాజు,మండల సహాయ కార్యదర్శులు మామిండ్ల పెద్ద ఐలయ్య, కడియాల క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్ఎఫ్ 90 వసంతాల రాష్ట్ర స్థాయి ఉత్సవాలు

**ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్**



**ప్రజాపక్షం/హనుమకొండ :** సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండలో జరుగు ఎఐఎస్ఎఫ్ 90వ వసంతాల రాష్ట్రస్థాయి ముగింపు వారోత్సవాల సభలు జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ పిలుపునిచ్చారు.సోమవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ముగింపు ఉత్సవాల పోస్టర్‌లను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆవిర్భవించిన ఎఐఎస్ఎఫ్ దేశ స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి వరకు విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. “చదువుతూ పోరాడుతాం – చదువుకై పోరాడుతాం” అనే నినాదంతో విద్యార్థి సమస్యల పరిష్కారానికి ఎఐఎస్ఎఫ్ కృషి చేస్తోందన్నారు. జాతీయ విద్యా విధానం–2020ను పునఃసమీక్షించి విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణమైన విద్యా విధానాన్ని రూపొందించాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ 600 మంది ప్రతినిధులతో రాష్ట్ర స్థాయి వార్షికోత్సవాల మహాసభలు సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో జరిగే మూడు రోజుల కార్యక్రమాలను హనుమకొండలో నిర్వహిస్తున్నామని, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఎఐఎస్ఎఫ్ లో పనిచేసిన మాజీ నాయకులు, ప్రస్తుత నాయకులు పాల్గొంటారని తెలిపారు. మొదటిరోజు భారీ ర్యాలీ, బహిరంగ సభ, రెండవ రోజు, మూడవ రోజు వారోత్సవ మహాసభలు జరగనున్నట్లు, డెలిగేట్స్ అందరికీ మూడు రోజులపాటు వసతి, భోజనం, కాన్ఫరెన్స్ హాల్ తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విద్యారంగ సమస్యలు పరిష్కార మార్గాలు, ఎఐఎస్ఎఫ్ సంఘ నిర్మాణం, భవిష్యత్తు ఉద్యమాలపై పలు కీలకమైన నిర్ణయాలు జరగనున్నట్లు తెలిపారు. ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలు, రాష్ట్రస్థాయి సభలను విజయవంతం చేసేందుకు విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు, యువత, ప్రజలు తమ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, జిల్లా నాయకులు కే అజయ్, నాగరాజు, వంశీ, రాజు, శ్రావణ్, ముఖేష్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## 4 లేబర్ కోడ్‌ల రద్దుకు సహకరిస్తాం

**జిఎం కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా**





**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సింగరేణి కార్మికులకు వెంటనే 12వ వేతన ఒప్పందాన్ని కమిటీ వేసి అమలు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జీఎం కార్యాలయం ముందు సింగరేణి జాతీయ కార్మిక సంఘాలజెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని కార్మికులకు తన సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 12వ జాతీయ బొగ్గగని కార్మికుల వేతన ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని, అవి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని విమర్శించారు. కోల్ బెల్ట్ ప్రాంతంలో ఉన్న 11 మంది ఎమ్మెల్యేలం నాలుగు లేబర్ కోట్ల రద్దు కోసం మా వంతుగా ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు నల్ల చట్టాలను అమలు కాకుండా అడ్డుకుంటమన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బొగ్గు బ్లాకులను వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకు కేటాయించాలని, కోయగూడెం ఓసీ3 బొగ్గు గనిని కూడా సింగరేణికే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ రంగ సంస్థ లు బలహీనపడటమే కాకుండా కార్మికుల ఉపాధి భద్రత కూ డా ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులు, శ్రమ చట్టాలు, ట్రేడ్ యూనియన్ ఉద్యమాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 12వ జాతీయ బొగ్గుగని కార్మికుల వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

**కార్మికుల సమస్య పరిష్కరించకుంటే సమ్మె తప్పదు జాతీయ సంఘాల హెచ్చరిక**

సింగరేణి కార్మికులకు 12వ వేజ్ బోర్డు వెంటనే అమలు చేయాలని లేదంటే సమ్మె తప్పదని సింగరేణి జాతీయ సంఘాల జెఏసినాయకులు ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఐ ఎన్ టి యు సి జోగబుచ్చయ్య, సిఐటియు నాయకులు దుడ్డల సాయిలు, హెచ్ఎంఎస్ నాయకులు నరేష్ నేత లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రెండు గంటల పాటు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికులకు అమలు చేయవలసిన 12వ వేజ్ బోర్డు కమిటీ వేయకుండా కాలయాపన చేస్తుందని వారు మండిపడ్డారు. అదే స్థాయిలో కార్మికులు హక్కులను సాధించుకునే వరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు వేతన ఒప్పందం అమలు చేసే వరకు అవసరమైతే సమ్మె చేసి ఉద్యమించాలని ఈ సందర్భంగా వారు కార్మికులకు పిలుపుని చ్చారు. అనంతరం జిఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మహా ధర్నాలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్ చందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా, నూకల చంద్రమౌళి, తోట రామచందర్, రవికుమార్, ఐఎన్‌టియుసి నాయకులు మధుకర్ రెడ్డి, హెచ్ఎంఎస్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు అధిక పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ఆరాట పడ్డ వ్యక్తి ‘పెద్ది’

**కంట కన్నీరు పెట్టిన టి.హరీష్‌రావు**
**పెద్ది సంస్మరణ సభలో హరీష్‌రావు ,కెటిఆర్**



**ప్రజాపక్షం / నల్లబెల్లి :** నర్సంపేట నియోజక వర్గ అభివృద్ధిలో తెలంగాణ ఉధ్యమకారుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఎంతో ఆరాట పడ్డారని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు . సోమవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేం ద్రంలో మాజీ ఎమ్మెల్యేపెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభకు మాజీ మంత్రులు కెటిఆర్ ,తన్నీరు హరీష్‌రావులు హాజరై మాట్లాడినారు . ఈ సందర్భంగా మాజీ మంత్రి హారీష్‌రావు మాట్లాడుతూ మాజీఎమ్మెల్యే తెలంగాణ ఉధ్యమకారులంటే ఎం తో ప్రేమగా మాట్లాడేవారని ,వరంగల్ లో తెలంగాణ ఉద్యమం అనగానే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు మాత్రమే వినబడేదని హరీష్ రావు కంట కన్నీరు పెట్టడంతో బిఆర్ఎస్ కార్యకర్తల కళ్ళు చెమ్మగిల్లినాయి . తెలంగాణ ఉధ్యమంలో ,నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిలో ఎప్పుడు తపనపడే వా రని మెడికల్ కాలేజీ కోసం మాజీ సిఎం కెసిఆర్‌తో పట్టుబట్టి నర్సంపేటకు తీసుకువచ్చి పనులు ప్రార ంభించి ప్రజలకు సేవలు అందించే స్థాయికి తీసుకువచ్చారని చెప్పారు . ఈ కార్యక్రమంలో పాల్గొ న్న మాజీ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెం ట్ మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ గోదావరి జలాల కోసం బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సిఎం కెసిఆర్‌తో పోరాటం చేసి పాకాల ,రంగ య్య చెరువుల కు సాగు నీరందించిన ఘనత పెద్ది సుదర్శన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు . ఆయన అంతిమ యాత్ర కాదు జనయాత్రగా మారిందని అవేదన వ్యక్తం చేశారు . వచ్చే రెండు ఏండ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాడుతుందని భవిష్యత్తు తరాలకు గుర్తుండే విధంగా నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టి తీరుతామని చెప్పారు .పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ,కంటికి రెప్పాల కాపాడుకుంటుందని చెప్పారు . సంతాప సభలో పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్ర పటానికి పూలతో ఘనంగా నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనచారి , మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమారు ,మాలోతు కవిత ,మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు ,టి.రాజయ్య ,మాజీ ఎంఎల్‌ఎ అరూరి రమేష్ ,శంకర్‌నాయక్ ,దాస్యం వినయ్‌భాస్కర్ ,చల్లా ధర్మారెడ్డి ,గండ్ర వెంకటరమణారెడ్డి ,పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ,బండా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు .

## కార్మిక, రైతు హక్కులపై దాడి..
# కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోదీ

కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో 'జైల్ భరో'






**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక హక్కులపై కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్రమైనదాడి చేస్తోందని, కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ప్రజల హక్కుల్ని హరిస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి, ఎఐకెఎంఎస్ నాయకులు సురేందర్ ఊక్లా, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడువిశ్వంశెట్టి పూర్ణచంద్రరావు, ఐఎన్‌టిసి జిల్లా కార్యదర్శి జ లీల్, ఎఐపికెఎంఎస్ జిల్లా కార్యదర్శి జాటోత్ కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా జైలు భరో కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు, ఎఐటిసి జిల్లా కార్యదర్శి నారాటి ప్రసాద్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి సీతారామయ్య, టియుసిఐ నాయకులు గోపాల్‌రావు, ఐఎన్‌టియుసి నాయకులు నాగభూషణం అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే వ్యవసాయ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పాత కార్మిక చట్టలను పునరుద్ధారించాలని నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం దే శంలో ఉన్న బొగ్గు బ్లాకులు, అటవీ సంపద, రైతు రోడ్లు ఇలా మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకే తీవ్ర ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే జా తీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని విబి-జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని కార్మికులకు కనీస వేతనం రూ.26000 అమలు చేయాలని నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడండి లేదంటే మోదీ ప్ర భు త్వం గద్దె నుండి దిగిపోండి అంటూ ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సంపద సృ ష్టికర్తలైన కార్మికులు, రైతు, వ్యవసాయ కార్మికుల హక్కులను నిరాకరిస్తున్న మోదీ ప్రభుత్వం నిరంకుశ వైఖరిపై క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరిన్ని పోరాటాలను చేస్తామని నేతలు హెచ్చరించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్‌లో వందలాది మంది రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు రహదారిపై బైఠాయించడంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులను, ప్రజలను అరెస్టు చేసి త్రీటౌన్ మరియు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యానారాయణ, ఎస్‌కెఎం నాయకులు అమర్లపూడి రాము, అవును మధు, సిఐటియు నాయకులు లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, దొడ్డ రవి, సత్య, ఎఐకెఎస్ నాయకులు కొండబోయి వెంకటేశ్వర్లు, కోబల్ కున్సోత్ ధర్మ, వీర్ల రమేష్, తిరుపతిరావు, వెంకట్రావు, తులసిరామ్, ఎఐటియుసి నాయకులు జమలయ్య, ఎస్‌కెఎం నాయకులు బుర్ర వెంకన్న, వెంకటేశ్వర్లు, కుమార్, సంజీవ్, ప్రసాద్, ఆదిలక్ష్మి, మంగమ్మ, ఉమా, జ్యోతి, లక్ష్మి, ఇందిరా, పద్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలి

ఐక్య కార్మిక సంఘాల డిమాండ్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కోల్‌ఇండియా పరిధిలోని బొగ్గు పరిశ్రమల ఉద్యోగుల వేతనాల పెంపు కోసం 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి సింగరేణి జిఎం కార్యాలయం ఎదుట ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, టిబిజికెఎస్ యూనియన్ జెఎసి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. జెవిఆర్ ఒసి, కిష్టారం ఒసి, జెవిఆర్ సిహెచ్‌పి ఉద్యోగులు పాల్గొని నిరసన తెలిపారు.అనంతరం సింగరేణి సిఎండికి ఉద్దేశించిన వినతిపత్రాన్ని జిఎం సరికొండ వెంకటాచారి ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు తీగల క్రాంతికుమార్, కోటేశ్వరరావు, సముద్రాల సుధాకర్, దార భీమయ్య, ఆంజనేయులు, అస్గర్ ఖాన్, సంపత్, గిడ్డయ్య మాట్లాడుతూ 11వ వేజ్ బోర్డు 2026 జూన్‌తో ముగిసినా 12వ వేజ్ బోర్డు ఏర్పాటుకు కేంద్రం ఇప్పటివరకు కమిటీ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే 12వ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 12న రాంచీలో జరిగే సదస్సులో వేజ్ బోర్డుపై స్పష్టత రాకపోతే కోల్‌ఇండియా వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్ భరో



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలూరుపాడు మండల కేంద్రంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పూనెం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు యాస నరేష్ మాట్లాడుతూ పరాయి పాలన పోవాలని క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందని, నేడు మోదీ ప్రభుత్వం, కార్పొరేట్లతో కలిసి కార్మికులకు, రైతులకు, దేశ ప్రజలకు వ్యతిరేకంగా చేస్తున్న పాలన పోవాలని జైల్ భరో కార్యక్రమం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేట్ల ప్రయోజనం కోసం ఏకపక్షంగా మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం కోసం విదేశాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, రైతులకు షరతులు లేకుండా యాప్‌లతో సంబంధం లేకుండా ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మండల కార్యదర్శి వల్లోజు రమేష్, రైతు సంఘం మండల కార్యదర్శి గడిదేసి కనకరత్నం, సిఐటియు మండల కార్యదర్శి బోడా అభిమిత్ర, సిఐటియు ఆశ జిల్లా అధ్యక్షురాలు పూనెం ఝాన్సీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు పద్దం సుగుణ, మండల నాయకులు ఇల్లంగి సీతారాములు, వుడల వెంకటేశ్వర్లు గార్లపాటి వెంకటి, తాటి ఇందిరా, లక్ష్మయ్య, నరసింహారావు, రమేష్, కృష్ణ, నీలం రమేష్ సామ్య, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా 'జైల్ భరో'



**ప్రజాపక్షం/మధిర:** మధిర పట్టణంలో సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు, పాపినేని రామనరసయ్య, పడకంటి మురళి, ఇతర నాయకులు పాల్గొని అరెస్ట్ కావడం జరిగింది. మొదట సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం నాయకులు స్థానిక ఎండివో కార్యాలయం ఎదుట సమావేశం నిర్వహించి పెద్ద సంఖ్యలో హమాలీ, ఆశా వర్కర్లు మధ్యాహ్న భోజన వర్కర్లు అంగన్‌వాడీ టీచర్, వర్కర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ వర్కర్లు ఇంకా ఇతర స్కీం వర్కర్లు, వ్యవసాయ కార్మికులు, రైతులు పాల్గొని తమ డిమాండ్లు సాధన కోసం నినాదాలు చేశారు. అనంతరం భగత్‌సింగ్ విగ్రహం వద్ద బ్రిడ్జి నుండి రాకపోకలను రాస్తారోకో నిర్వహించి అడ్డుకున్నారు. వివిధ ప్రజాసంగాల నాయకులు, కార్యకర్తలను ఈ సందర్భంగా పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు ఆగవు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం గద్దె దిగే వరకు పోరాటాలు కొనసాగుతాయని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. అఖిలపక్ష పార్టీలు, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గజ్జల వెంకటయ్య భవనం నుంచి పెట్రోల్‌బంక్ సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించి, ఖమ్మం–వరంగల్ ప్రధాన రహదారిపై సుమారు రెండున్నర గంటలపాటు రాస్తారోకో చేపట్టారు. అనంతరం జరిగిన సభలో కార్మిక చట్టాల మార్పులను ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ పథకంలో మార్పులను రద్దు చేయాలని, విద్యుత్, విత్తన చట్టాలను వెనక్కి తీసుకోవాలని, పెరుగుతున్న ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా టిజెఎసి అధ్యక్షుడు మందడి ఇజ్రాయిల్, పిండిప్రోలు గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త, వెదుళ్ల చెరువు సర్పంచి ఆరెంపుల వినోద, సిఐటియు మండల కార్యదర్శి వశపొంగు వీరన్న, అఖిల భారత రైతుకూలీ సంఘం(ఎఐకెఎంఎస్) మండల అధ్యక్షుడు గొర్రెపాటి వీరస్వామి, పద్మనాభుల సుధాకర్, అంగిరేకుల నర్సయ్య, నాగటి సురేశ్, కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, మోరపాక నాగయ్య, నీరుడు లాజర్, అజ్మీరా బాలాజీ, బాణోత్‌రవి, బాణోత్ అనిల్ కుమార్, రామావత్ రమణ, సామ శ్రీనివాస్‌రెడ్డి, పత్తి నాగేశ్వరరావు, గోళ్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపాలెంలో సిపిఐ జన చైతన్య యాత్ర

గ్రామ గ్రామాన ఘన స్వాగతం




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సోమవారం రఘునాథపాలెం మండలంలో సాగింది. పాపటపల్లిలో ప్రారంభమైన యాత్ర పాపటపల్లి, చిమ్మపుడి, కోయచలక, బూడిదంపాడు, పుఠాని తండా, ఈర్లపుడి, పంగిడి, చింతగుర్తి, వి. వెంకటాయపాలెం వరకు సాగింది. పాపటపల్లి, చిమ్మపుడి గ్రామాల్లో మహ్మద్ రజబ్‌అలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ గ్రామాన సిపిఐ కార్యకర్తలు ఎదురెగి స్వాగతం పలికారు. గ్రామాల్లో పాదయాత్రలు నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఈ దేశంలో మార్పు రావాల్సిన అవసరాన్ని సిపిఐ నాయకులు వివరించారు. వివిధ సభల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రమాదకరంగా మారాయని, మార్పు జరగకపోతే పేద, మధ్య తరగతి ప్రజలు బతకలేరని ఆయన తెలిపారు. ధన వంతులు మరింత ధనవంతులు అవుతుంటే పేదలు మరింత పేదలు అవుతున్నారని ఆర్థిక అంతరాలు దేశంలో అశాంతికి దారి తీస్తాయన్నారు. ప్రతి యేటా కోటాను కోట్ల రాజకీయ అవినీతి జరుగుతుందని ఈ అవినీతి డబ్బును ఎన్నికల్లో ఉపయోగించి లబ్ధి పొందుతున్నారని సురేష్ తెలిపారు. దశాబ్ద కాలం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందో ఆ హామీల అమలు పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. హామీల అమలుకు సిపిఐ తొలి దశలో జన చైతన్య యాత్రల ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందని స్పందన లేకుంటే ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ యాత్రలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి నిర్మల, సీతామహాలక్ష్మి, పగడాల మల్లేష్, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, చింతల రమేష్, జూలా వెంకటేశ్వర్లు, గాడిచర్ల సత్యనారాయణ, బాగం ప్రసాద్, చీనా, జామ్లా, కురువెళ్ల వెంకన్న, రావెళ్ల సురేష్, బానోత్ నాగేశ్వరరావు, భూక్యా హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం వికటించి విద్యార్థిని మృతి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** అప్పటివరకు తోటి విద్యార్థులతో ఆడుతూ పాడుతూ కలివిడిగా తిరిగిన అమ్మాయి తనను మృత్యువు వెంటాడుతుందని తెలియలేదు. అప్పటివరకు తమ కళ్లముందు ఎంతో ఆనందంగా గడిపిన చిన్నారి అంతలోనే కానరానిలోకాలకు వెళ్లిందనే విషయాన్ని తల్లి దండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. అమ్మా లే అమ్మాలే అంటు గుండెలవిసేలా రోదిస్తున్న తీరు అక్కడున్న వారందరిని కలిచివేసింది. తమ కూతురు ఇక కళ్లముందు లేదన్న విషయాన్ని వారు తట్టుకోలేకపోతున్నారు. ఈ హృదయవిదారక ఘటన మండల పరిధిలోని బస్వాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, కొణిజర్ల ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం బస్వాపురం గ్రామానికి చెందిన చల్లా రమేష్, మౌనిక దంపతుల కుమార్తె హిమశ్రీ (16) బస్వాపురం కెజిబివిలో 8వ తరగతి చదువుకుంటూ అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. గ్రామంలో బోనాల పండుగ జరుగుతుండగా తండ్రి హాస్టల్‌నుంచి ఇంటికి తీసుకొచ్చాడు. అమ్మాయికి జలుబు, దగ్గు వస్తుండగా గ్రామంలోని గ్రామీణ వైద్యుడు అయిన మారుతి సంపత్ వద్దకు సాయంత్రం 6 గంటల సమయంలో తీసుకెళ్లాడు. వైద్యుడు అమ్మాయి ఎడమచేతికి కాన్‌లా పెట్టి ఇంజక్షన్ ఇచ్చి మరో ఇంజక్షన్ మందు ఎక్కిస్తుండగా అమ్మాయి స్పృహ కోల్పోవడంతో పాటు నోటినుంచి నురగ స్తూ చలనం లేకుండా పోయింది. దీంతో గ్రామీణ వైద్యుడు ఆటో పిలిపించి ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఆసుపత్రి సిబ్బంది తండ్రి రమేష్‌ను బయట ఉంచి ఒక గంటతర్వాత బయటకు వచ్చి నీ కూతురు చనిపోయిందని చెప్పారు. వైద్యులను గట్టిగా నిలదీయడంతో మీ అమ్మాయి ఆసుపత్రికి వచ్చేటప్పటికే చనిపోయిందని తేల్చి చెప్పారు. అర్హతలేకుండా వైద్యం చేసి అమ్మాయి చావుకి కారణం అయిన వైద్యునిపై చర్యలు తీసుకోవాలని కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాస్తారోకో

సిపిఐ, ఎఐటియుసి, టియుసిఐ, ఎంసిపిఐ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/మణుగూరు:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు మణుగూరులో సిపిఐ, ఎఐటియుసి, టియుసిఐఎం సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై జెండాలు చేత పట్టుకొని రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది .అధికారుల జోక్యంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, టియు సిఐ జిల్లా అధ్యక్షుడు ఆర్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ , వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి వాణిజ్య ఒప్పందాలను చేస్తుందని, దేశానికి వెన్నుముక రైతు అని చెప్పినటువంటి కేంద్రం, నేడు రైతుకి గిట్టుబాటు ధర లేకుండా, సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా, విత్తనాలు అధిక రేట్లు పెంచుతూ, యూరియా రేట్లు రెట్టింపు చేస్తూ, ఆరు కాలం పంట పండించే రైతుకు గిట్టు గిట్టుబాటు ధర కల్పించకుండా మధ్య దళారీలు దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని వారు ప్రశ్నించారు. జాతీయ ఉపాధి హామీ పథకం 100 రోజులు నుండి 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీ 700 ఇవ్వాలని ఒకవైపు ఆందోళన చేస్తుంటే ఉన్న పథకాన్ని రద్దుచేసి విబి–జి రామ్‌జి పథకం పేరుతో ప్రభుత్వం కుట్ర చేస్తుందని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున దేశవ్యాప్త ఆందోళనకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు ఎడారి రమేష్, వై. రాంగోపాల్, సొందే కుటుంబరావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు దండుగుల బాబు, ఎఐటియుసి సహాయ కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, కొడిమెల సుజాత, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కన్నెబోయిన ప్రసాద్, ఆర్‌టిపి నాగరాజు, బొగ్గు కార్యదర్శి యాకూబ్ , కణతాల కోటయ్య, లింగస్వామి, భీమరాజు కృష్ణ, బత్తుల లక్ష్మయ్య, లక్ష్మి , రంజిత్,ఆంజనేయులు, టియుసిఐ నాయకులు సంజీవరెడ్డి, యాకయ, రాజేందర్, బత్తుల వెంకటేశ్వర్లు, కె. సుధాకర్, తిరుపతి, ఎంసిపిఐ నాయకులు ఎం. మోహనరావు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 26న.. హైదరాబాద్‌లో ఆట– పాట, మాట

అరుణోదయ విమలక్క




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 50 ఏళ్ల ప్రజా సాంస్కృతిక ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 26న ఉదయం 10 గంటల నుంచి సెప్టెంబర్ 28 మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకధాటిగా 50 గంటల పాటు ఆట పాట మాటలతో ప్రజా కళాజాతర కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు అ రుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క తెలిపారు. సో మవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విమలక్క మాట్లాడుతూ విప్లవోద్యమాల నుంచి విప్లవకారులు, ప్రజా ఉద్యమాల నుంచి ప్రజా కళాకారులు ఉద్భవిస్తారన్నారు. తన జీవిత కాలం విప్లవ ప్రజా సాంస్కృతిక ఉద్యమాలలో 50 ఏళ్లు మైలురాయిని అధిగమించిన తన ప్రస్థానంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆట పాట మాటలతో ప్రజా కళా జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విమలక్క ఒక వ్యక్తి కాదని సామూహిక శక్తి అన్నారు. బాల గాయనిగా వెలుగులోకి వచ్చిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసునన్నారు. అనేక కష్ట నష్టాలు ఎదుర్కొని జైలు జీవితాన్ని అనుభవించి ప్రజా ఉద్యమాలే ఆయుధంగా ఎంచుకున్నట్లు తెలిపారు. 50 గంటల పాటు సాగే ప్రజా కళాజాతర నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మల్సూరు, ప్రధాన కార్యదర్శి రమేష్, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి సుధాకర్, భాస్కర్, విజయ్, దర్శి రాకేష్, అనిత పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేసి... ఉద్యోగ భద్రత కల్పించాలి

కేంద్రం మెడలు వంచేలా హోరెత్తిన వామపక్షాల జైల్‌భరో



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** కార్మికుల హక్కులను కాలరాస్తూ, రైతాంగం మెడకు ఉరితాళ్లు బిగిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై నేలకొండపల్లి సమర శంఖారావం పూరించింది. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన జైల్‌భరో కార్యక్రమం మండల కేంద్రాన్ని తీవ్ర ఉద్రిక్తతల నడుమ హోరెత్తించింది. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ సామాన్యుల పొట్టగొడుతున్న కేంద్ర వైఖరిపై కార్మికులు, రైతులు, మహిళలు, యువత పెద్దఎత్తున తరలివచ్చి కదం తొక్కారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు కేంద్ర పాలకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పోరాటాల రక్తతర్పణంతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే చెత్తబుట్టలో వేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత ఇవ్వకుండా కార్పొరేట్ల సేవలకే ప్రాధాన్యమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దేశానికి వెన్నెముకైన రైతన్నలను కేంద్రం నట్టేట ముంచుతోందని ధ్వజమెత్తారు. పండించిన ప్రతి పంటకూ కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వకపోతే దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు మిన్నంటుతాయన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసే ప్రతిపాదిత చట్టాన్ని రద్దు చేయాలని స్పష్టం చేశారు. ఈ రణభేరి ఇక్కడితో ఆగదని, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే వరకు వామపక్షాలు, ప్రజాసంఘాల ఐక్య పోరాటాలు కొనసాగుతాయని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గూడవర్తి నాగేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి కె.వి.రెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉపేందర్, సిపిఐ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి పగడికత్తుల రాందాస్, ప్రజాసంఘాల నాయకులు నాగేశ్వరరావు, రచ్చా నరసింహారావు, యడ్ల తిరుపతిరావు, సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు బాలిన కృష్ణంరాజు, ఆలేటి ఉమామహేష్, కుంచం బిక్షం, భద్రజీ వేంకటేశ్వరరావు, బాలెబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ప్రమాదం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం సోమవరం గ్రామ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అశోక్ లేలాండ్ మినీ ట్రాలీ వాహనాన్ని పార్చునర్ కారు ఢీకొట్టింది. దీంతో మినీ ట్రా లీ అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై రామారావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు ద ర్యా ప్తు చేస్తున్నారు. పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.


## గ్రామపంచాయతీ కార్యాలయం ప్రారంభం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం కట్టుమల్లారం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నూతన గ్రామపంచాయతీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని, గ్రామ పరిపాలన మరింత మెరుగ్గా కొనసాగుతుందని అన్నారు. కట్టుమల్లారం గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. నూతన కార్యాలయ భవనాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మండల, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు బాగుంటేనే రాష్ట్రం బాగు

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గ రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో సోమవారం నిర్వహించిన మహా వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పా ల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతుల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణలో సంవృద్ధిగా వర్షాలు కురిసి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండాలని, రైతుకలు సాగు నీటి కొరత లేకుండా పంటలు సంవృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతు సంతోషంగా ఉంటేనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుంది అని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నా రు. తెలంగాణ పచ్చని పంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు.

## దాడి ఘటనతో మనస్తాపం: ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రమేష్ (38) అనే ట్రాక్టర్ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రమేష్ గతంలో నర్సింగపూర్ గ్రామానికి చెందిన గడ్డం గంగారెడ్డి వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. తనకు రావాల్సిన కేవలం ఆరు వందల రూపాయల డబ్బులు ఇవ్వలేదనే కారణంతో రమేష్ వాట్సాప్ ద్వారా గడ్డం గంగారెడ్డిని దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.దీంతో ఆగ్రహానికి గురైన గడ్డం గంగారెడ్డి మరో వ్యక్తితో కలిసి ఆదివారం ఉదయం రమేష్ ఇంటికి వచ్చి అతనిపై దాడి చేసినట్లు మృతుడి భార్య బందెల మల్లేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం రమేష్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించిన తర్వాత ఇంటికి తీసుకువచ్చినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన రమేష్ ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 4:30 గంటల మధ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదురాలు తెలిపినట్లు జగిత్యాల రూరల్ పోలీసులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దాడి ఘటనతో పాటు రమేష్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు.

## అక్రమంగా రేషన్ దందా

### మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** నిరుపేదలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న మూడు నెలల రేషన్ బియ్యం పై అక్రమార్కులు కన్నేసి గ్రామాల్లో వాలిపోతూ గద్దల్ల తన్నుకు పోతున్న అధికారులు పట్టించుకునే వారే కరువయ్యారు. నిత్యం మండల వ్యాప్తంగా లక్షలాది రూపాయల రేషన్ బియ్యాన్ని ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ కొనుగోలు చేసి అధికారుల కళ్ళ ముందు నుండే తరలించేస్తూ సొమ్ము చేసుకుంటున్న అధికార యంత్రంగా మాత్రం నిద్రమత్తు వీడడం లేదు.అక్రమ వ్యాపారం చేసే నిర్వాహకులు గ్రూపులుగా ఏర్పడి గ్రామాల్లో కొనుగోలు చేస్తున్న వారిని పట్టుకోకపోవడం వెనక వారిచ్చే మామూళ్ల ప్రధాన కారణం అనే వాదనలు వినిపిస్తున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా భారీ వాహనాల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నప్పటికీ అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు వెళుతున్న తమకి ఎందుకు తమ జేబులు నిండితే చాలు అనే విధంగా విధులను నిర్వర్తిస్తున్నారు ఇక్కడి అధికారులు. ఇలా మండల వ్యాప్తంగా కొనుగోలు చేస్తున్న బియ్యం అక్రమ వ్యాపారులు పెద్ద మొత్తంలో అధికారులకు నెల నెలా మామూళ్లు అందిస్తున్నారనే వాదనలు కొనుగోలు చేస్తున్న వ్యక్తుల నుండే బయటకు వస్తున్నాయి. అడ్డు చెప్పాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ వ్యాపారం ఏదైనా మల్లాపూర్ మండలంలో సక్రమమే అనే విధంగా పరిస్థితి తయారయింది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం వీటిపై దృష్టి సారిస్తారో లేదో వేచి చూడాలి మరి.

## కాళేశ్వరం మోటర్లు తక్షణమే ఆన్ చేయండి

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు బహిరంగ లేఖ



**ప్రజాపక్షం/సిద్ధిపేట:** కాళేశ్వరం ప్రాజెక్టు మోటర్లు తక్షణమే ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు బహిరంగ లేఖలో పేర్కొన్నారు. సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు రాసిన లేఖను విడుదల చేశారు. రిజర్వాయర్‌లో నీటిని సకాలంలో నింపకపోవటం వల్ల పంటలసాగు ముందుకు పోగా రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని హరీష్‌రావు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని వివిధ జిల్లా ల లోని రిజర్వాయర్లు అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్. మల్లన్నసాగర్, కొండ పోచమ్మసాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా మిడ్ మానేరు నుండి మోటర్లను ఆన్‌చేసి నీటిని పంపింగ్ చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఒక వైపు ఎలినినో ప్రభావంతో తక్కువ వర్షాభావం, మరో వైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారన్నారు. వానకాలం సాగులో సాగు నీరు కోసం రైతాంగం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండ రిజర్వాయర్‌లను నీటిని పంపింగ్ చేయాలని రైతుల పక్షాన లేఖ ద్వారా హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్‌ఐ

**ప్రజా పక్షం/వేములవాడ టౌన్:** అగ్రహారం గ్రామ శివారులో స్టోన్ క్రషర్ నిర్వాహకుడి వద్ద రూ.20 లక్షలు, రైస్ మిల్ నిర్వాహకుడి వద్ద రూ.10 లక్షలు డిమాండ్ చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే. తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దండు వినోద్, తండ్రి ఐలయ్య, వయస్సు 33 సంవత్సరాలు, పెద్దిగారి అమరగొండ అజయ్, తండ్రి నాగమల్లయ్య, వయస్సు 27 సంవత్సరాలు, అనే ఇద్దరు వ్యక్తులు, కలిసి వ్యాపారం నిర్వహించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని వారిని బెదిరించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారని. నీలం గురవయ్యను నిందితులు లక్ష్యంగా చేసుకొని ఈ నెల 9 వ తేదీన దండు వినోద్ తన మొబైల్ ఫోన్ నంబర్ నుండి నీలం గురవయ్యకు ఫోన్ చేసి, క్రషర్‌కు సంబంధించిన లైసెన్స్, భూమికి సంబంధించిన విషయాలపై అసత్య ప్రచారం చేస్తామని ఫోన్ ద్వారా బెదిరించగా, అసత్య ప్రచారాలు చేయకుండా ఉండాలంటే రూ.20,00,000 ఇవ్వాలని ఇవ్వకపోతే వ్యాపారాన్ని దెబ్బ తీస్తానని బెదిరించగా, దీంతో భయపడిన బాధితుడు ఏటియంకు వెళ్లి రూ.50,000 నగదు ఇవ్వడం జరిగిందన్నారు. వేములవాడకి చెందిన బండ మల్లేశం అను రైస్ మిల్లర్‌ను కూడా బెదిరింపులకు పాల్పడి రూ.10,00,000 డిమాండ్ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందుతులని ఆదివారం రాత్రి సాయినగర్‌లో అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 50,000/ రూపాయల నగదు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకొని సోమవారం రోజు రిమాండ్‌కి తరలించడం జరిగిందన్నారు.

### క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మిక చట్టాల

# పరిరక్షణకు మరో పోరాటం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు కరీంనగర్ లోని కమాన్ చౌరస్తా వద్ద సోమవారం ఎఐటియుసి, టియుసిఐ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైతు, కార్మిక వ్యతిరేక చట్టాల కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జిందం ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోయడ సృజన్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి వాణిజ్య ఒప్పందాలను చేస్తుందని దేశానికి వెన్నుముక అయిన రైతులకు కేంద్రం గిట్టుబాటు ధర లేకుండా సబ్సిడి రుణాలు ఇవ్వకుండా విత్తనాలు అధిక రేట్లు పెంచుతూ యూరియా రేట్లు రెట్టింపు చేస్తూ ఆరుగాలం పంట పండించే రైతుకు అన్యాయం చేస్తూ దళారీల దోపిడిని అడ్డుకోవడంలో విఫలమవుతుందని ప్రశ్నించారు. జాతీయ ఉపాధి హామి పథకం 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలని రోజువారి కూలీ రూ.700 ఇవ్వాలని ఓవైపు ఆందోళనలు చేస్తుంటే ఉన్న పథకాన్ని రద్దు చేసి రాంజీ పథకం పేరుతో ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ 2025 చట్టం రద్దు చేయడంతోపాటు పంటకి గిట్టుబాటు ధర కల్పించాలని, రుణమాఫీ పంటల భీమా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున దేశవ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి కిమ్మసారపు నరసయ్య, బొంతల ఎల్లయ్య, దాసరి అనిల్, టియుసి నాయకులు ఎస్.కమలాకర్ మునీధర్, శ్రీపతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

### సిపిఐ పాద యాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఏఐటీసీ నాయకులు కందుకూరి రాజారత్నం అన్నారు.సోమవారం రోజున 8వ కాలనీ ఏఐటీయూసీ యూనియన్ ఆఫీసులో భారత కమ్యూనిస్టు పార్టీ పాదయాత్ర వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో కేంద్రం లో బిజెపి ప్రభుత్వం మూడవ సారి గెలిచిన తర్వాత అడ్డు అదుపు లేకుండా ధరల పెరుగుదల లేబర్ కోడులను ప్రవేశపెట్టడం జరుగుతోంది ఇది సరైన విధానం కాదని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం తీసుకొని ప్రజా పోరాటాల గురించి వివరిస్తూ పాదయాత్రలు చేయడము జరుగుచున్నది. అందులో భాగంగా పెద్దపెల్లి జిల్లాలో కూడా ఈ యొక్క పాదయాత్రలు చేయడం జరుగుతుందనీ, పెద్దపల్లి జిల్లా లోని కమాన్ పూర్ మండల కేంద్రంలో 11 /8 /26 మంగళవారం నాడు సాయంకాలం నాలుగు గంటలకు రావడం అవుతుందనీ,ఈ కార్యక్రమాన్ని ప్రజలు ఆదరించి జయప్రదం చేయాలని మండల కార్యదర్శి కందుకూరి రాజరత్నం పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆవుల రవికుమార్,నల్ల మదన్న,మహేందర్,తాళ్లపల్లి నారాయణ,జాడి ఆంజనేయులు,సాగే కృష్ణ,అక్రం,సాంబన్న,అనిల్,రాయలింగు గట్టయ్య,పోషం,నీలం మదన్మోహన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల నిరసన

### కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు నిరసన చేపట్టారు. కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచడంతో పాటు కార్మికుల వేతనాలను తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్టీ నంబర్ 1181ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.డి. ఉస్మాన్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, జీవో ఎంఎస్ నంబర్ 14 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. 11/06/2021న జారీ చేసిన జీవో ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.16,600, స్కిల్డ్ కార్మికులకు రూ.20,500, హైస్కిల్డ్ కార్మికులకు రూ.22,750గా వేతనాలు నిర్ణయించారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కార్మికుల వేతనాలను తగ్గిస్తూ 12/07/2026న జీవో ఆర్టీ నంబర్ 1181ను విడుదల చేసిందని ఆరోపించారు. ఏ కార్మిక చట్టంలోనూ వేతనాలను తగ్గించే నిబంధన లేదని, వెంటనే జీవో 1181ను ఉపసంహరించుకుని తగ్గించిన వేతనాలను రద్దు చేసి గతంలో అమలులో ఉన్న వేతనాలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు బర్ల లక్ష్మణ్, నరసయ్య, మధురమ్మ, లక్ష్మి, బర్ల నరసయ్య, వాజిద్, గంగాధర్, నిజాం, తదితర కార్మికులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ధర్మపురి :** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఎస్సై 2 మిర్యాల రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్త్రీలకు సంబంధించిన మోసాలు, నకిలీ ప్రకటనలు, తక్షణ రుణాల పేరుతో మోసాలు, ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగాల మోసాలు, సోషల్ మీడియా మోసాలు, ఎకెపి ఫైళ్ల స్కామ్‌లు, డిజిటల్ అరెస్టులు, వ్యాపార పెట్టుబడులు, క్రెడిట్, డెబిట్ కార్డు మోసాల గురించి ఎస్సై రవీందర్ వివరించారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత, బ్యాంకింగ్, ఆర్థిక వివరాలను పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, ఎకెపి ఫైళ్లను తెరవడం లేదా డౌన్‌లోడ్ చేయడం చేయరాదన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేయడంతో పాటు cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## 4 లేబర్ కోడ్‌లు రద్దు చేసి 44 కార్మిక చట్టాలు అమలు చేయాలి

### ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్




**ప్రజాపక్షం/సిద్దిపేట:** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట పాత బస్టాండ్‌వద్ద కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈసందర్భంగా కిష్టపురం లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వేబ్యాంకులను విమానయానం పోర్టులు, ఎల్‌ఐసి తదితర పరిశ్రమలను బడా పారిశ్రామిక వేత్తలకు అప్పగిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న లక్షలాది కార్మికవర్గం ఉపాధి లేక రోడ్డు పాలవుతున్నారన్నారు. పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయలు, రాయితీలు కల్పిస్తూ కార్మిక వర్గానికి మాత్రం కనీస వేతనాలు అమలు చేయటం లేదన్నారు. అనేక పోరాటాలు, త్యాగాలు బలిదానాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్పులు చేసి కార్పొరేట్ సంస్థల యజమానుల అనుకూలంగా మార్చటం జరిగిందన్నారు. 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని, కార్మిక ప్రయోజనాలను చట్టాలను కాపాడాలని 27 సార్లు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలు చేసిన కార్మిక వర్గం ఎన్ని పోరాటాలు చేసిన కేంద్రం ప్రభుత్వం మాత్రం పట్టించుకోవటం లేదన్నారు. 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయకుంటే కార్మికులంత ఏకమై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షులు ఇట్ల మల్లేశం. కర్నాల చంద్రం. సహాకార్యదర్శి తప్పన్పల్లి బిక్షపతి, బెక్కంటి సంపత్, బాలయ్య. ఐలయ్య. శ్రీనివాస్, మల్లయ్య, రమేశ్, రాములు, భూమయ్య కార్మికులు పాల్గొన్నారు.

## కార్మిక, రైతు సంఘాల రాస్తారోకో




**ప్రజాపక్షం/గోదావరిఖని:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు జైల్ భరో కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని మున్సిపల్ టీ జంక్షన్ వద్ద కార్మిక, రైతు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుఎస్.వీరయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఈ.నరేష్, రైతు సంఘం నాయకులు గుమ్మడి వెంకన్న, ఎం.మల్లయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మికులు, రైతులు, ప్రజలకు వ్యతిరేకంగా విధానాలను వేగంగా అమలు చేస్తోందని ఆరోపించారు. ఎందరో పోరాట యోధుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్ర్యాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని వారు విమర్శించారు. నాడు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో భారతదేశాన్ని కాపాడుకోవాలి అని వారు పేర్కొన్నారు.కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను,కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ జైల్ భరో కార్యక్రమంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు టి.రాజిరెడ్డి, చిలుక శంకర్, వేల్పుల కుమారస్వామి, జూపాక శ్రీనివాస్, ఎం.దుర్గయ్య, రామాచారి, జి.రాజన్న, ఎస్.రాజేశ్వర్, రావు, బిక్షపతి, ఎస్.ప్రసాద్, కే.ధర్మేందర్, పోగుల శేఖర్, శోభన్ బాబు,రాజేశం, శేఖర్,బత్తుల రాజయ్య తదితరులతో పాటు సుమారు 100 మంది పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



**ప్రజాపక్షం/జగిత్యాల:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఎండ గట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి,సీపీఎం జిల్లా ఇంచార్జి లెల్లల బాలకృష్ణ పిలుపునిచ్చారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు అండగా ఉంటూ కార్మిక,రైతు, ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఆరోపిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ చౌరస్తాలో జైల్ బరో నిరసన కార్యక్రమాన్ని సీఐటీయూ, రైతు,వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. నాయకుల ధర్నాను పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేసి ఆందోళన విరమించారు.ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా ఇంచార్జి బాలకృష్ణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, ఐఎఫ్టి యూ జిల్లా కార్యదర్శి చింత భూమేశ్వర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఇందూరి సులోచనలు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం,ఐకెపి వివోఏ, ఫీల్డ్ అసిస్టెంట్, ఆరోగ్య శాఖలో వివిధ స్కీంలో కోటి మంది వర్కర్లు పని చేస్తున్నా నేటికి ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకోలేదన్నారు.కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కొడులను తక్షణమే రద్దు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు అమలు చేయక పోవడంతో ఏటా రూ.4 లక్షల కోట్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార భద్రతా చట్టానికి కేంద్ర తూట్లు పొడిచి అంత్యోదయ పథకం ద్వారా నిరుపేదలకు 35 కిలోల బియ్యాన్ని రద్దు చేసి ఒక్కో మనిషికి 7 కేజీల బియ్యాన్ని మాత్రమే ఇస్తుందని మండిపడ్డారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని దీన్ని నిలువరించేందుకు ప్రజలు ఆందోళనలకు సిద్దంగా ఉండలన్నారు. ఇప్పటికయినా కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని హితవు పలికారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటి శేఖర్,సీపీఎం జిల్లా నాయకుడు భూతం సారంగ పాణి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శారద, నాయకులు జంగిలి ఎల్లయ్య,మాల్యాల సురేష్,వెల్మలపల్లి వేంకట చారి,తదితరులు ఉన్నారు.

## రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం

### వరికి పత్యామ్నాయ పంటలు వేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా నేపథ్యంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి సాగుకు బదులు పత్యామ్నాయ పంటలు సాగు చేయాలని తెలిపారు. ఈ దిశగా వ్యవసాయ అధికారులు రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సుమారు 3 లక్షల 44 ఎకరాల సాగు విస్తీర్ణం ఉందని అన్ని పంటలూ కలిపి ఇప్పటివరకు 2 లక్షల 86 వేల ఎకరాల్లో సాగు ప్రారంభమైందని తెలిపారు. ఇందులో కేవలం వరి మాత్రమే 2 లక్షల 21 వేల ఎకరాల్లో నాట్లు వేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మిగతా సాగు భూముల్లో ఎట్టి పరిస్థితుల్లో వరి పంట సాగు చేయవద్దని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని ఇప్పటికే భూగర్భ జలాలు ఆశాజనకంగా లేవని, చెరువులు కుంటల్లో నీరు అంతంత మాత్రమే ఉండడం వల్ల వరి సాగు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

## 12వ వేజ్ బోర్డు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ బొగ్గు గని కార్మికుల కు జీతాల పెంపు కోసం 12వ వేతన సవరణ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను బొగ్గు పరిశ్రమల్లో అమలు చేయరాదని డిమాండ్ చేస్తూ సింగరేణి ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి యాజమాన్యం కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఏఐటియుసి నుంచి కొరిమి రాజ్ కుమార్, ఐఎన్టీయుసి నుంచి ధర్మపురి, సిఐటియు నుంచి ఎస్ వీరయ్య, హెచ్ ఎం ఎస్ నుంచి దబ్బెట సతీష్ లు పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఉన్న బొగ్గు గని కార్మికులకు జూన్ 30తో 11వ వేజ్ బోర్డు కాలపరిమితి ముగిసిందని, 2026 జూలై 1 నుంచి 12వ వేజ్ బోర్డు ప్రారంభం అయిందని, కానీ కోల్ ఇండియా యాజమాన్యం ఇంత వరకు వేజ్ బోర్డు ప్రక్రియను ప్రారంబించలేదని వారు ఆరోపించారు. గత కొన్ని నెలల క్రితం కోల్ ఇండియా యాజమాన్యంతో బొగ్గు గని కార్మిక సంఘాలతో జరిగిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలు గురించి ప్రస్తావించారని, 51 శాతం ఓట్లు వచ్చిన కార్మిక సంఘంతో వేతన సవరణ జరుపుతామని తెలుపగా కేంద్ర కార్మిక సంఘాల నాయకులు వ్యతిరేకించారని వారు పేర్కొన్నారు. గతంలో వలే 12వ వేజ్ బోర్డు ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయగా కోల్ ఇండియా యాజమాన్యం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని తెలిపారని వారు తెలిపారు. అనంతరం జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కు వినతి పత్రం సమర్పించారు. రంగు శ్రీను, మడ్డి ఎల్లా గౌడ్, తుమ్మల రాజిరెడ్డి, సదానందంతో పాటు జాతీయ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ!



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో అర్ధరాత్రి వేళ ఘోర చోరీ జరిగింది. నిద్రిస్తున్న ఓ వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని దుండగులు పుస్తెలతాడును అపహరించుకుపోయారు. బాధితుల కథనం ప్రకారం.. లక్కారం గ్రామానికి చెందిన బర్ల లక్ష్మి (80)అనే వృద్ధురాలు రాత్రి వేళ ఇంటి బయట నిద్రించారు.ఆమె కుమారుడు బర్ల మొగిలి తన భార్యతో కలిసి ఇంట్లో పడుకున్నారు.అర్ధరాత్రి సమయంలో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు.,లోపల ఉన్నవారు బయటకు రాకుండా ఉండేందుకు ఇంటి తలుపులకు బయట నుంచి గడియ పెట్టారు. అనంతరం బయట నిద్రిస్తున్న లక్ష్మి మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడును దుండగులు తెంచుకుని అక్కడి నుంచి పరారయ్యారు.ఉదయం లేచి చూసేసరికి బంగారం చోరీకి గురైనట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సమాచారం.


# విరాళాల చోరీపై ఆగని నిరసనలు




**న్యూఢిల్లీ:** పార్లమెంట్ ఆవరణలో సోమవారం కూడా ప్రతిపక్ష ఎంపిలు తమ నిరసన ప్రదర్శనను కొనసాగించారు. అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీ, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలకు నిరసనగా కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో సహా ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ భవన ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. పేపర్ లీక్ అంశంపై జులై 20న జరిగిన విద్యార్థి నిరసన సందర్భంగా పోలీసులు దురాగతాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని, ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం ముందు 'చందా చోర్, గద్దీ ఛోడ్', 'అమిత్ షా జవాబ్ దో', 'బిజెపి కే దఫ్తర్ మే' వంటి నినాదాలతో నిరసన తెలిపారు. రామ మందిరంలో విరాళాల చోరీకి ప్రతీకగా ఎంపిలు ఆ ప్రదేశంలో ఒక విరాళాల పెట్టెను ఉంచి, దాని చుట్టూ వరుసగా నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధానంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు చెందిన ప్రతిపక్ష ఎంపిలు, 'అమిత్ షా జవాబ్ దో' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్ వెనుక బారులు తీరి, హోం మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, ఉదయం పార్లమెంట్ ప్రాంగణంలోని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ఛాంబర్‌లో ఇండియా కూటమి పార్టీల ఫ్లోర్ లీడర్లు సమావేశమై, 'చందా చోరీ' (దొంగతనం), విద్యార్థులపై 'పోలీసుల దురాగతాలు' అనే రెండు అంశాలపై ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాలని నిర్ణయించాయి. ప్రతిపక్షాల డిమాండ్లపై పార్లమెంట్ ఉభయ సభలు ప్రతిష్టంభనలో కొనసాగుతుండగా, చాలా వరకు శాసనపరమైన కార్యకలాపాలు గందరగోళం మధ్యనే జరిగాయి.

# ప్రభుత్వ చర్య వల్లే పార్లమెంట్ స్తంభన

- ప్రతిపక్షాలు చర్చను కోరుకుంటున్నాయి
- ప్రధాని మోదీ, అమిత్ సభకు రావడానికి భయపడుతున్నారు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ :** విద్యార్థులపై జరుగుతున్న అరాచకాల గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎందుకు ప్రకటన చేయడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం ప్రశ్నించారు. పార్లమెంటు ఉభయ సభలు స్తంభించిపోవడానికి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. విపక్షాలు చర్చను కోరుకుంటున్నాయని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా సభకు రావడానికి భయపడుతున్నారని, అంటే తాము ఏదో తప్పు చేశామని వారికి తెలుసని ఖర్గే అన్నారు. పార్లమెంటు భవన సముదాయంలో ఖర్గే విలేకరులతో మాట్లాడారు. 'మేము చర్చను కోరుకుంటున్నాము. వారు (ప్రభుత్వం) ఎందుకు చర్చను కోరుకోవడం లేదు? ఇతర అంశాలపై ప్రకటనలు ఇస్తారు కదా, మరి ఈ అంశంపై ఎందుకు ఇవ్వడం లేదు? మేము కేవలం ఒక ప్రకటన మాత్రమే అడుగుతున్నాము. దీనికి వారి దగ్గర సమాధానం లేదు, వారి వల్లే సభ పని చేయలేకపోతోంది. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ప్రధాని మోదీ, హోం మంత్రి షా బాధ్యులు' అని అన్నారు. పిల్లలపై జరిగిన అన్యాయం, అరాచకాలపై అమిత్ షా సభకు వచ్చి ప్రకటన చేసేలా చేయడానికి గత 17 రోజులుగా తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సమాధానం చెప్పడానికి సభకు రావడానికి బదులుగా, ప్రధాని మోదీ రాత్రిపూట ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తున్నారని ఖర్గే విమర్శించారు. ప్రధాని పార్లమెంటును ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. ఇది ఎంపిలకు, ప్రజలకు కూడా అవమానమన్నారు. ప్రధాని, హోం మంత్రి సభను సజావుగా నడపాలని అనుకోవడం లేదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడం గానీ, విద్యార్థులు, యువతకు పరిష్కారాలు చూపడం గానీ చేయడం లేదన్నారు. వారు సభకు వచ్చి ప్రకటన చేయాలి, లేదా సభలో ప్రకటన చేయదలుచుకోకపోతే రాజీనామా చేయాలి అని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. మోదీ, షా ఇంటి నుండే ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఖర్గే ఆరోపించారు. మోదీ, షా గదుల్లో కూర్చుని అన్నీ వింటూ ఉంటారని, ప్రతిపక్ష సభ్యులు మాట్లాడటానికి లేవగానే సభలో గందరగోళం సృష్టించాలని తమ వారికి ఆదేశాలు ఇస్తుంటారని ఖర్గే ఆరోపించారు. రాజ్యసభలో చైర్మన్ కనీసం మా గొంతు వినిపించనివ్వకపోవడం చాలా బాధాకరమన్నారు.

**షా సమాధానం చెప్పేంత వరకూ ప్రతిష్టంభనే : ప్రియాంక**



విద్యార్థులపై పోలీసుల దురాగతాలకు సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒక ప్రకటన చేసే వరకు పార్లమెంటులో ప్రతిపక్షానికి, ప్రభుత్వానికి మధ్య ప్రతిష్టంభన కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. సోమవారం ఆమె పార్లమెంట్ హౌస్ కాంపెక్స్ వద్ద విలేకరులతో మాట్లాడారు. 'ఈ రెండు మూడు రోజుల్లో విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లును రూపొందించి ప్రవేశపెట్టవచ్చని కేంద్ర ప్రభుత్వం భావిస్తే, ఆ కోరికను తమలోనే ఉంచుకోవాలి' అని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఆదివారం అన్నారు. ప్రతిపాదిత చట్టం మైనారిటీలను, ఎన్‌జిఒలను లక్ష్యంగా చేసుకుందని, దీనిని ప్రతిపక్షం ఆమోదించనివ్వదని వేణుగోపాల్ ఆరోపించారు. 'అమిత్ షా ఈ ప్రజా వ్యతిరేక బిల్లును ఆమోదింపజేసినా కూడా, ఆయన పార్లమెంటులో తీవ్ర నిరసనలను ఎదుర్కోవలసి వస్తుందనడంలో సందేహం లేదు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైనది, ప్రజా వ్యతిరేకమైనది. ఇటువంటి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధమైన బిల్లును ఆమోదం పొందనీయబోమని' కేరళలోని అలప్పుజలో వేణుగోపాల్ విలేకరులతో అన్నారు.

# సౌదీ అరేబియా ఫ్యాక్టరీలో ప్రమాదం

## 16 మంది బంగ్లాదేశీ కార్మికులు మృతి

**ఢాకా:**సౌదీ అరేబియాలోని ఒక కర్మాగారంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో 16 మంది బంగ్లాదేశ్ కార్మికులు మరణించారు. రియాద్‌లోని అల్–షిఫా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మూసా ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న సోఫాల తయారీ కర్మాగారంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వారంతా అక్కడికక్కడే మరణించారు.వీరిలో 13 మంది బంగ్లాదేశ్‌లోని నౌగావ్‌కు చెందినవారు కాగా, ఇద్దరు కార్మికులు నటోర్ ప్రాంతానికి చెందినవారు. రియాద్‌లోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలోని కార్మిక సంక్షేమ విభాగ కౌన్సిలర్ రెజాయ్ రబ్బీని ఉటంకిస్తూ ఈ మేరకు ఒక నోటిఫికేషన్ జారీ చేశారు.బాధితుల మృతదేహాలను గుర్తించి వారి కుటుంబాలకు స్వాధీనం చేసేందుకు సౌదీ అధికారులతో నిరంతర చర్యలు జరుపుతున్నట్లు రబ్బీ పేర్కొన్నారు.ఈ అగ్ని ప్రమాదంలో మరణించినవారిలో నౌగావ్‌లో ఉన్న అత్రా ఉపజిల్లాకు చెందిన ఏడుగురు కార్మికులు ఉన్నట్లు గుర్తించారు.

# బిల్లులపై చర్చ జరగాలి

- సభ సజావుగా జరిగేందుకు సహకరించండి
- ప్రతిపక్ష ఎంపిలకు లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లా విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో, సభ సజావుగా సాగేలా చూడాలని, ప్రజల గొంతుక వినిపించేలా సహకరించాలని కోరుతూ స్పీకర్ ఓం బిర్లా సోమవారం నాడు వివిధ పార్టీల సభా నాయకులకు భావోద్వేగపూరిత విజ్ఞప్తి చేశారు. జులై 20న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి, దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన చర్యల గురించి హోంమంత్రి అమిత్ షా స్పందించాలని, అలాగే అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీపై కూడా చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు నిరసనలు చేపడుతున్నాయి. కాగా, సోమవారం ఓమ్‌బిర్లా బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో బిర్లా మాట్లాడుతూ, పార్లమెంటు ఆమోదించే చట్టాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం ఉండేలా సభలో కీలక బిల్లులపై చర్చ జరగాలని, ఎటువంటి అంతరాయం కలగకూడదని సూచించినట్లు సమాచారం. నిర్మాణాత్మక చర్చలు, అర్థవంతమైన భాగస్వామ్యం, అత్యున్నత పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించడాన్ని వివరిస్తూ ప్రజలకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా, ఫలప్రదంగా చర్చించేందుకు వీలుగా సభ కార్యకలాపాలు సజావుగా సాగేలా అన్ని పార్టీలు సహకరించాలని స్పీకర్ కోరారు. ప్రతిపక్ష సభ్యుల నిరంతర నినాదాల కారణంగా వరుసగా 16వ రోజు కూడా దిగువ సభలో ప్రశ్నోత్తరాల సమయం పూర్తి కాలేదు. ప్రస్తుత సమావేశాల్లో లోక్‌సభ మొత్తం తొమ్మిది బిల్లులను ఆమోదించినప్పటికీ, కేవలం రెండింటిపై మాత్రమే చర్చ జరిగింది. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యలపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కేంద్ర హోం మంత్రి ఆ చర్చకు సమాధానం ఇస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం తెలిపారు.

# వాగులో కొట్టుకుపోయిన వ్యాన్

**బాలిక సహా 9 మంది మృతి**
**మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో ఘటన**



**రాజ్‌గఢ్ :** మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో సోమవారం విషాదం చోటుచేసుకుంది. భారీ వర్షాల కారణంగా ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటుతుండగా 11 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ వ్యాన్ వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. ఈ ఘోర ప్రమాదంలో ఒక బాలిక సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు వ్యక్తులు ఈదుకుంటూ వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో సారంగ్‌పూర్ పట్టణం సమీపంలోని పడానా బైపాస్ కల్వర్టు వద్ద ఈ ఘటన జరిగింది. మొత్తం 11 మంది ప్రయాణికులతో ఓ వ్యాన్ సాత్వస్ నుంచి కాడ్లావడ్‌కు బయల్దేరింది. మార్గ మధ్యంలో సారంగ్‌పూర్ పట్టణ సమీపంలో ఝిరి కాలువ భారీ వర్షాల కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తోంది. అయినప్పటికీ వ్యాన్ డ్రైవర్ దానిని దాటేందుకు యత్నించాడు. ఈ క్రమంలోనే ప్రవాహ ఉద్ధృతికి వాహనం నీటిలో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందారు. మరో ఇద్దరు ఈదుకుంటూ సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. మృతులను దేవాస్ ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. ప్రమాద సమయంలో వ్యాన్‌లో ముగ్గురు పురుషులు, నలుగురు మహిళలు, నలుగురు పిల్లలు ఉన్నారని తెలిపారు. స్థానిక అధికారులు, గ్రామస్థులు వద్దని వారిస్తున్నప్పటికీ వినకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నీటిలోకి పోనివ్వడంతో క్షణాల్లోనే వ్యాన్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వ్యాన్ నీటిలో మునిగిపోతుండటం గమనించిన స్థానికులు తమ ప్రాణాలకు తెగించి తాళ్ల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కొందరిని కాపాడే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే నీట మునిగి ఒక బాలిక సహా 9 మంది మరణించారు. పడానా బైపాస్ సమీపంలో వాగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పటికీ, డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై సారంగ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

**పేరుకు మాత్రమే ఉపాధిహామీ**

# అదంతా 'రోజ్‌గార్ చోరీ'

## 'విబి–జి రామ్ జి'పై కాంగ్రెస్ ఫైర్

**న్యూఢిల్లీ :** గ్రామీణ ఉపాధి హామీ పథకం విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజినరేగా) స్థానంలో అమల్లోకి వచ్చిన 'విబి జి రామ్ జి) చట్టం పేరుకు మాత్రమే ఉపాధి హామీ ఇస్తోందని, వాస్తవానికి ఇది 'రోజ్‌గార్ చోరీ' అని మండిపడింది. ఎంజి నరేగాను నిర్వీర్యం చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలు ఇప్పటికే బయటపడుతున్నాయని ఆ పార్టీ పేర్కొంది. బిజెపి కేవలం యువతపైనే కాకుండా, దేశంలోని కష్టపడి పనిచేసే కూలీలపై కూడా లాఠీని ప్రయోగించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వ హయాంలో ఎంజి నరేగాను రద్దు చేయడం ద్వారా లక్షలాది కుటుంబాల పని హక్కును కాలరాశారని, దాని స్థానంలో 'విబి జి రామ్ జి'ని తీసుకురావడం వల్ల 50 శాతం మంది కూలీలు ఉపాధిని కోల్పోయారన్నారు. ఎంజి నరేగానకు సంబంధించిన పెండింగ్ నిధులు రూ. 17,144 కోట్లను రాష్ట్రాలకు చెల్లించారా? అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. కరువు పీడిత రాష్ట్రాలకు ఏమైనా సహాయం అందించారా, ఖరీఫ్ పంటల సాగులో 26.50 శాతం లోటు ఉందని, దీని గురించి ఎవరైనా పట్టించుకుంటున్నారా అని నిలదీశారు. విబి జి రామ్ జి నిధుల విధానంపై సమీక్ష జరపాలని బిజెపి పాలిత రాష్ట్రాలు డిమాండ్ చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం దానిపై ఏమైనా చర్యలు తీసుకుందా? దేశంలోని పేద కూలీలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, మోదీ ప్రభుత్వం వారి కనీస ఆర్థిక, సామాజిక భద్రతను లాగేసుకుంటూ వారిని అవహేళన చేస్తోందని ఖర్గే మండిపడ్డారు. ప్రభుత్వం పునరుద్ధరించిన గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కల్పనలో భారీ తగ్గుదల నమోదైందని (జులైలో ఏడాది ప్రాతిపదికన 49.94 శాతం పతనం) అధికారిక గణాంకాలను ఉటంకిస్తూ వచ్చిన మీడియా నివేదికను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో షేర్ చేశారు. 'మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విబి జిరామ్ జి అమలులో ఉన్న మొదటి నెలలోనే, ఎంజి నరేగాను నిర్వీర్యం చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలు బయటపడుతున్నాయన్నారు. కొత్త చట్టం అమల్లోకి వచ్చిన మొదటి నెల జులైలో నరేగా అమలులో ఉన్న జులై 2025తో పోలిస్తే గ్రామీణ ఉపాధి కల్పన గణనీయంగా తగ్గిందని మాజీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి తెలిపామోదీ ప్రభుత్వం ఎంజిఎన్ఆర్ఇజిఎను బుల్డోజర్లతో రద్దు చేసినప్పుడు కాంగ్రెస్, ప్రతిపక్షాలన్నీ సరిగ్గా ఇదే ఊహించాయని ఆయన అన్నారు.

## 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో

# కార్మికులు, రైతుల నిరసనలు

- వెయ్యికిపైగా ప్రాంతాల్లో ఆందోళనలు
- జైల్‌భరో, రైల్‌రోకో, రాస్తారోకో విజయవంతం
- కేంద్ర కార్మిక సంఘాల వెల్లడి



ఢిల్లీలో 'జంతర్ మంతర్'

**న్యూఢిల్లీ:** 1942 క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం దేశవ్యాప్తంగా జైల్‌భరో, రైల్‌రోకో, రాస్తారోకో ఆందోళనలు విజయవంతంగా నిర్వహించినట్లు కేంద్ర కార్మిక సంఘాలు వెల్లడించాయి. లక్షలాది మంది కార్మికులు, రైతులు, ఇతర వర్గాల ప్రజలు నిరసనలకు దిగారని పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించడంతో పాటు అనేక చోట్ల అరెస్టులకు సిద్ధమవుతూ 'జైలుభరో' కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర రాజధానులతో పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాలు, సభలు, ర్యాలీలు నిర్వహించారు. అనేక ప్రాంతాల్లోని పని ప్రదేశాల్లో నిరసనలు, భోజన విరామ సమయంలో ప్రదర్శనలు, బ్యాడ్జీలు ధరించడం, రైల్‌రోకో, రాస్తారోకో, జైలుభరో కార్యక్రమాలు నిర్వహించినట్లు సంఘాలు తెలిపాయి. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులతో పాటు మహిళా కార్మికులు, స్కీమ్ వర్కర్లు, ఇంటి ఆధారిత కార్మికులు, నిర్మాణ కార్మికులు, బీడీ కార్మికులు, చిరు వ్యాపారులు, రవాణా కార్మికులు, ఆటో, ట్యాక్సీ, ఈరిక్షా డ్రైవర్లు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని వెల్లడించాయి. ఈ మేరకు ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐటియుసి, టియుసిసి, ఎస్‌ఈడబ్ల్యూఎ, ఎఐటియుసి తదితర కేంద్ర కార్మిక సంఘాల వేదిక తరఫున ప్రకటన విడుదల చేశారు. కాగా, కార్మికులు, రైతులు, ఇతర ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేస్తోందని సంఘాలు ఆరోపించాయి. వాణిజ్య ఒప్పందాల పేరుతో వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్వావలంబన ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజా సేవలను ప్రైవేటు, దేశీయవిదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని దుయ్యబట్టాయి. ప్రభుత్వ విద్య, వైద్య రంగాల బడ్జెట్లను తగ్గించడం వల్ల విద్యార్థులు, యువత భవిష్యత్తు దెబ్బతింటోందని... పెరుగుతున్న చమురు, గ్యాస్, నిత్యావసర వస్తువులు, సేవల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశాయి. రైతులకు సి2+50 శాతం ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పించాలని కోరాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు చేపట్టకపోవడం, మంజూరైన పోస్టులను రద్దు చేయడం వల్ల నిరుద్యోగం పెరుగుతోందని మండిపడ్డాయి. భవిష్యత్తులోనూ ప్రజలు, దేశ ప్రయోజనాలను కాపాడేందుకు కార్మిక సంఘాలు, ఎస్‌కెఎం నిరసనలు కొనసాగిస్తాయని, అవసరమైతే సంయుక్త కార్యాచరణ చేపడతాయని ప్రకటన పేర్కొంది.

**కార్మిక కోడ్‌లను ఉపసంహరించాలి**

కార్మిక సంఘాలను బలహీనపరిచే నాలుగు కార్మిక కోడ్‌లను ఉపసంహరించాలని సంఘాలు డిమాండ్ చేశాయి. గ్రామీణ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా హక్కుల ఆధారిత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఆర్ఇజిఎ)ను తొలగించి వేరే విధానం తీసుకొస్తున్నారని విమర్శించాయి. విద్యుత్ సవరణ బిల్లు, విత్తన బిల్లులను కూడా తీవ్రంగా వ్యతిరేకించాయి.

**నిర్బంధ చర్యలపై ఆగ్రహం**

దేశంలో నిరసనలను అణచివేసేందుకు మోదీ సర్కారు నిర్బంధ చర్యలకు పాల్పడుతోందని కార్మిక సంఘాలు మండిపడ్డాయి. దిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఇటీవల విద్యార్థుల ఆందోళనలపై జరిగిన పోలీసు చర్యలే ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నాయి. ఆందోళనకారుల డిమాండ్లపై స్పందించకుండా ఉద్యమ నాయకులను అప్రతిష్టపాలు చేయడం, మతపరమైన ప్రచారంతో ప్రజల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించాయి.

## తమిళనాట ప్రభుత్వ కార్యక్రమాల్లో

# ఇకమీదట తమిళ తల్లి గీతాలాపన



**చెన్నై:** తమిళనాడులో ఇకమీదట జరిగే ప్రభుత్వ కార్యక్రమాలలో రాష్ట్ర గీతాన్ని (తమిళ తల్లి గీతం) ఆలపిస్తారు.ఈ మేరకు తమిళనాడు అసెంబ్లీ సోమవారం ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేసింది. తమిళనాడులో ఇకమీదట ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినాగానీ మొట్టమొదట 'తమిళ్ తాయ్ వర్ఘు' గీతాలాపనతో ప్రారంభించాల్సి ఉంటుంది. తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ అసెంబ్లీలో ఈ తీర్మానం ప్రవేశపెట్టారు.అసెంబ్లీలో శాసనసభాపక్ష నాయకులు,వారి పార్టీలు ఈ తీర్మానానికి పూర్తి మద్దతు ప్రకటించాయి. ప్రధాన ప్రతిపక్షం డిఎంకె,ఎఐఎడిఎంకె కూడా ప్రభుత్వ వైఖరిని గట్టిగా సమర్థించాయి. ఈ తీర్మానాన్ని ముఖ్యమంత్రి విజయ్ సభలో ప్రవేశపెడుతూ, తమిళనాడు భాషా–సంసృతుల హక్కులపట్ల 'తమిళగ వెట్రి కళగం' ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని స్పష్టం చేశారు. ''తమిళం కేవలం ఒక భాష మాత్రమే కాదు, మన జీవితాలు,భావోద్వేగాలు కూడా'' అని విజయ్ చెప్పారు. ఎంతో భావోద్వేగంతో ఆయన ప్రసంగించారు. ''ఒక మాతృమూర్తి లాగానే తమిళ మాతృభాష కూడా ఎంతో స్వచ్ఛమైనది'' అని ఎంతో భావోద్వేగంతో చెప్పారు. ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ ప్రకటించారు. ఈ తీర్మానాన్ని అమలు చేయడానికి ఎవరి దగ్గర నుండీ ఎలాంటి అనుమతి పొందాల్సిన అవసరం లేదని కూడా ప్రకటించారు. ''ఇది తమిళనాడు అసెంబ్లీ చేసిన తీర్మానం, ముఖ్యమంత్రి చేసిన ప్రకటన యావత్ తమిళ ప్రజానీకానికీ ప్రాతినిధ్యం వహిస్తుంది'' అని ఉద్ఘాటించారు. ''తమిళ్ తాయ్ వర్ఘు'' గీతాలాపన రాజకీయ వ్యవస్థకు లేదా భారత జాతి ఐక్యతకు, మన దేశానికి ఎంతమాత్రం వ్యతిరేకం కాదు. ఈ గీతం భారత జాతి అత్యున్నతమైన భిన్నత్వంలో ఏకత్వం అనే ఒక గొప్ప జాతి సూత్రాన్ని ప్రతిబింబిస్తుంది, తమిళ తాయ్ వర్ఘు గీతాన్ని మొట్టమొదట అన్ని ప్రభుత్వ కార్యక్రమాలలోనూ ఆలపించాలని చెప్పడం ఎంతమాత్రం రాజకీయ చర్చకు అస్కారం కలిగించాల్సిన అవసరం లేదు అన్నారు. ఈ తీర్మానం ప్రకారం, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలు,విశ్వవిద్యాలయాలు,ప్రభుత్వ కార్యాలయాలు,ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ అధీనంలో పనిచేసే తమిళనాడు సంస్థలలో మొట్టమొదటగా ఈ గీతాలాపన చేయాలి. అధికారిక కార్యక్రమాల సందర్భంగా జాతీయగీతం జనగణమన ఆలపించే ముందుగా వందేమాతర గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాలని కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా ఇటీవల అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కఠిన ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తమిళనాడు అసెంబ్లీలో ఈ తీర్మానం చేశారు. తమిళనాడు ప్రభుత్వం 1970 నవంబరు 23వ తేదీన ఇదేవిధంగా ఒక ఆదేశం జారీ చేసింది. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ మొట్టమొదట ''తమిళ తాయ్ వర్ఘు' గీతాలాపన చేయాలని 56 ఏళ్ళక్రితం ఆనాటి ప్రభుత్వం ఆదేశించిందన్న విషయం ఈ సందర్భంగా జ్ఞాపకం చేసుకోదగిన విషయం. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబరు 12వ తేదీన అధికారికంగా ఈ గీతాన్ని రాష్ట్రగీతంగా గుర్తించింది. ''తమిళభాష ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన శాస్త్రీయ భాష,తమిళ నాగరికత ప్రపంచంలో ఉన్న పురాతన సంస్కృతీ సంప్రదాయాల్లో ఒకటిగా ఉంది, తమిళ తాయ్ వర్ఘు గీతాన్ని మొట్టమొదట మన్మయియం సుందరనార్ రాశారు. ఆయన 1891లో''మనోన్మయినం'' అనే నాటకం రాశారు. ఆ నాటకం లోంచి తమిళ తాయ్ వర్ఘు గీతాన్ని తీసుకుని అధికారిక గీతంగా చేశారు. దీనిని ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంగా మొదట ఆలపించాలి, ఈ తీర్మానం 1970 నవంబరు 23 నుండి అమలులోకి వచ్చింది'' అని రికార్డులలో ఆనాటి తీర్మానం ఉంది.

# రూ.5లక్షలు... చదలపాలు

## భద్రంగా ఉంటాయని భూమిలో పాతిపెట్టిన రైతు

**బోధన్:** రాజస్థాన్‌కు చెందిన ఓ రైతు దొంగల భంతో తన వద్ద ఉన్న రూ.5లక్షల నగదు బ్యాగును పొలంలో పాతిపెట్టాడు. అయితే ఆ డబ్బును ఎక్కడ దా చాడో మరిచిపోయాడు. కొన్ని నెలల తర్వాత పొలా న్ని దున్నుతుండగా ఆ నగదు బయటపడింది. అయి తే అప్పటికే చెదలు ఆ నోట్లను పాడుచేశాయి. బాలో త్రా జిల్లాలోని పచపద్రా ప్రాంతానికి చెందిన మంగీలాల్ మేఘ్వాల్ అనే రైతు కొన్ని నెలల క్రితం తనకు న్న భూమిలో ఒక భాగాన్ని రూ.5లక్షలకు విక్రయించాడు.ఆ డబ్బుతో తన పొలంలో ఒక గదిని నిర్మించుకోవాలని భావించాడు. అయితే డబ్బును ఇంట్లో ఉంచితే కుటుంబ సభ్యులు ఖర్చు చేస్తారేమో, దొంగతనం జరిగే ప్రమాదం ఉందేమోనని భయపడ్డాడు. దీంతో ఎవరికీ చెప్పకుండా ఒక రాత్రి మొత్తం నగదును పాలిథిన్ సంచిలో పెట్టి తన పొలంలో గుంత తవ్వి పాతిపెట్టాడు.

**CHANGE OF NAME**

I, **MUPPARAM KALPANA, W/o. SUDERSHAN MUPPARAM** (old Name), H.No. 11-1-1945/B/305, Gangasthan-1, Maruthinagar, Nizamabad town, Telangana State, India, has changed as **PRAMEELA MUPPARAM, W/o. SUDERSHAN MUPPARAM** (New Name) for all purposes.

# రష్యాపై ఉక్రేన్ దాడి: 13 మంది మృతి

**కీవ్:**రష్యా నగరం నిజ్నెకామ్స్క్‌పై ఉక్రేన్ చేసిన డ్రోన్ దాడులవల్ల 13 మంది మరణించారు.మరో 48 మంది గాయపడ్డారు. టాటార్‌స్థాన్ ప్రాంత అధికారులు సోమవారం ఈ విషయం చెప్పారు. ఈ నగరం చమురు శుద్ధి పరిశ్రమకు ఖ్యాతిగాంచింది. ఐతే ఉక్రేన్ దేనిని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసిందనే విషయాన్ని రష్యా ప్రకటించలేదు. ఈ నగరంలో రెండు ప్రసిద్ధి చెందిన చమురుశుద్ధి కేంద్రాలు, ఒక పెట్రోకెమికల్ ప్లాంటు ఉన్నాయి.ఇటీవలికాలంలో ఉక్రేన్ తన సరిహద్దులకు సుదూరంగా ఉన్న రష్యాలోని చమురు శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. ఈ దాడుల కారణంగా రష్యాలో చమురు కొరత ఏర్పడింది. ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గతం కంటే ప్రాణ నష్టం కూడా పెరిగింది. అదేవిధంగా నల్లసముద్రంలో కూడా ఉక్రేన్–రష్యాలు పరస్పరం నౌకలపై దాడులు చేసుకుంటున్నాయి.

## చైనాలో 10 రాష్ట్రాలకు డాల్ఫిన్ తుఫాన్ ముప్పు

### పది లక్షలమంది తరలింపు



**బీజింగ్:** అత్యంత శక్తిమంతమైన డాల్ఫిన్ తుఫాన్ తూర్పు చైనాను గడగడలాడిస్తోంది. దాదాపు పది రాష్ట్రాలకు ఈ తుఫాన్ ముప్పు పొంచి ఉంది. భారీ నుండి అతి భారీ వర్షపాతాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. అనేక నగరాల్లో 150 నుండి 350 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యే ప్రమాదం పొంచిఉందని, కొన్నిచోట్ల 400 మిల్లీమీటర్ల వర్షపాతం కూడా నమోదయ్యే ఉపద్రవం ఉందని కూడా వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో దాదాపు పది లక్షలమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 1300 విమానాలను రద్దు చేశారు. ఈ ఏడాదిలో చైనాను ఇప్పటివరకూ 12 తుఫానులు కుదిపేశాయి. ఇప్పుడు ఆ వరుసలో డాల్ఫిన్ 13వ తుఫాను. తూర్పు చైనాలోని షాంఘై మున్సిపాలిటీ ప్రాంతం ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఫుజియాన్ ప్రాంతం ప్రజలను కూడా ఇతర ప్రాంతాలకు తరలించారు. జెజియాంగ్‌లోని తైజౌ, వెన్‌జౌ ప్రాంతాలను డాల్ఫిన్ తుఫాను రెండుసార్లు తాకింది. వచ్చే శుక్రవారం వరకూ తూర్పు చైనాపై డాల్ఫిన్ తుఫాను తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ తుఫానువల్ల భారీ వర్షపాతం, వరదలు, కొండచరియలు విరిగి పడటంవంటివనే అనేక ఉపద్రవాలు సంభవిస్తాయని ఇతర ప్రాంతాల ప్రజలకు కూడా హెచ్చరికలు చేశారు. గస్తీ నిమిత్తం పదుల వేల సంఖ్యలో సహాయ బృందాలను, అధికారులను మోహరించారు.

# ఇరాన్ కఠిన డిమాండ్లతో ట్రంప్ వెనుకంజ



**వాషింగ్టన్:** ఇరాన్ అత్యంత కఠినమైన నిబంధనలు విధించడంతో ట్రంప్ వెనక్కు తగ్గే వ్యూహం అవలంబిస్తున్నారు.ఇరాన్ తాజాగా ముందుకు తెచ్చిన ఆరు డిమాండ్ల విషయాన్ని ఆయన చిన్న చూపు చూడదలిచారు. ఇరాన్‌ను పూర్తిగా సైనికంగా బలహీనపరిచామని పదే పదే చెబుతున్న అమెరికా అధ్యక్షుడే వాస్తవానికి తీవ్ర బలహీన పరిస్థితుల్లో చిక్కుకున్నారని విశ్లేషకులు విమర్శించారు. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత ఎన్నడూ లేని రీతిలో చాలా మహోగ్రంగా ఇరాన్‌పై దాడులు చేయబోతున్నామని వారం రోజులక్రితం ట్రంప్ చేసిన ప్రకటనకు ఈ తాజా వెనుకంజ ప్రకటన పూర్తి విరుద్ధం.యుద్ధం ప్రారంభమైనప్పటినుండీ జలసంధి మూసుకుపోవడంతో చమురు ధరలు ఆకాశాన్ని అంటాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. అమెరికాలో ట్రంప్ వ్యతిరేకత పెరిగిపోయింది. నవంబరులో ద్వైవార్షిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్ విధించిన కఠినమైన డిమాండ్లు ట్రంప్‌కు అశనిపాతంగా మారాయి. ఆయన పాలనాయంత్రాంగం రోజువారీ విధుల్లో తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నది.ఐతే చమురు ధరలు తగ్గుతున్నందువల్ల అమెరికా ప్రజల బాధ కొంత తగ్గిందని ట్రంప్ అన్నారు. కానీ ప్రస్తుత అనిశ్చితి కారణంగా చమురు ధరలు సోమవారం మళ్ళీ పెరిగాయి.

ఇరాన్ కఠినమైన డిమాండ్లు విధిస్తున్నప్పటికీ, ట్రంప్ వెనుకంజ వేస్తున్నారని ఆక్సియోస్ వార్తాసంస్థ సోమవారం ప్రకటించింది. జలసంధిని తెరవడంలో ఇరాన్ జాప్యంపట్ల ట్రంప్ ఎలాంటి అసంతృప్తి,ఆగ్రహం వ్యక్తం చేయలేదని కూడా పేర్కొంది. ఐతే ఇది భయమా?వ్యూహమా?దేశీయ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంవల్లనా? అనే విషయాన్ని ఆక్సియోస్ ప్రస్థావించలేదు. ఐతే ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచుతామని ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. ఇప్పటికే ఆ దేశంపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతున్న విషయాన్ని అమెరికా అన్నివిధాలుగా గమనిస్తోందని ఆక్సియోస్‌తో ఆయన చెప్పారు. ''ఈ విషయంలో మేం పెద్దగా హడావుడి చేయడం లేదు, నిశ్శబ్దంగా గమనిస్తున్నాం, వారితో పరోక్ష చర్చలు జరుపుతున్నాం, ఇరాన్ చేతిలో డబ్బు లేదు, తీవ్ర ద్రవ్యోల్బణ పరిస్థితులు ఇరాన్‌లో నెలకుని ఉన్నాయి, వీటన్నింటినీ గమనిస్తున్నాం'' అని చెప్పారు. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం తొలగించాలని, ఖ్యంగా యుద్ధంలో చేసిన దాడులకు జరిగిన తీవ్ర నష్టానికిగాను పరిహారం చెల్లించాలని, ఎలాంటి షరతులూ లేకుండా స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని,ఇక ఎన్నడూ ఇరాన్‌కు అమెరికా నుండి బెదిరింపులు ఎదురుకాకూడదని, ఈ షరతులు పూర్తిగా అంగీకరిస్తేనే హోర్ముజ్ జలసంధిని తెరుస్తామని, అప్పటివరకూ వారితో ప్రత్యక్షంగా మాటామంతీ ఉండబోదని ఇరాన్ జాతీయ భద్రతామండలి ఉన్నతాధిపతి,ప్రస్తుతం మొజ్తాబా ఖమేనీ రాజకీయ సలహాదారు మహ్మద్ బాఘెర్ జోల్ఘాదర్ స్పష్టం చేయడంతో ట్రంప్ ఇరకాటంలో పడ్డారు.

### దిగ్బంధనం తొలగిస్తేనే జలసంధి తెరుస్తాం: బఘాయీ

ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం తొలగిస్తేనే హోర్ముజ్ జలసంధిని తెరుస్తామని ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయి ల్ బఘాయీ చెప్పారు. శత్రువు చర్యలు కొనసాగినంతకాలం జలసంధికి భద్రత చేకూర్చడం అసాధ్యంగా ఉంటుందని సోమవారం టెహ్రాన్‌లో జరిగిన పత్రికాగోష్ఠిలో చెప్పారు. జలసంధిని తిరిగి సాధారణ కార్యకలాపాలకోసం తెరవడం అమెరికాపైనే అధారపడి ఉందన్నారు. హోర్ముజ్ జలసంధి నిర్వహణపై ఇరాన్–ఒమన్‌మధ్య చర్చలు పురోగతిలో ఉన్నాయని, ఐతే ఈ జలాల్లో ప్రయాణించే నౌకలపై రుసుములు విధించే విషయాన్ని ఇంకా చర్చించడంలేదన్నా రు. జలసంధిలో ఒక సురక్షితమైన మార్గాన్ని ఏర్పాటు చేసే విషయంపైనే చర్చల్లో ప్రధానంగా దృష్టిసారించామన్నారు. యుద్ధంవల్ల చేసిన నష్టానికి తగిన పరిహారం ఇరాన్‌కు అమెరికా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## హమాస్ నియంత్రణకు ట్రంప్ ప్రణాళికే ఏకైక మార్గం

- హమాస్ ఆయుధాలు వదిలాకే ఐడిఎఫ్ నిష్క్రమణ
- పీస్‌బోర్డు అమలు అధిపతి మ్లాడెనోవ్ వెల్లడి

**జెరూసలెం:** ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు 2023 అక్టోబరు తరహా దాడులను శాశ్వతంగా అడ్డుకోవాలంటే డోనాల్డ్ ట్రంప్ సారథ్యంలో గా జా శాంతి మండలి ప్రతిపాదించిన 15 సూత్రాల ప్రణాళిక తప్ప మరో మార్గం లేదని శాంతి మండ లి విధానాల అమలు అధిపతి నికోలే మ్లాడెనోవ్ ఉద్ఘాటించారు. హమాస్ పూర్తిగా ఆయుధాలు స్వాధీనంచేసి నియుధీకరణ పాటించిన తర్వాతే ఇజ్రాయెల్ సైన్యం గాజా నుండి వైదొలగుతుందని నెతన్యాహూకు ఇచ్చిన వాగ్దానాన్ని ఆయన పునరుద్ఘాటించారు. ఒకవైపు హమాస్ ఆయుధాలు అప్పగిస్తుంటే మరోవైపు ఇజ్రాయెల్ కూడా దశలవారీ గా సైన్యాలను ఉపసంహరించాల్సి ఉంది. కానీ మునుపటి మాట నుండి మ్లాడెనోవ్ పక్కకు జరిగా రు. కానీ హమాస్ ఒక ప్రకటన చేస్తూ, 15 సూత్రా ల ప్రణాళికకు ఇజ్రాయెల్ కట్టుబడి ఉండేవిధంగాఅమెరికా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది ఐతే నిజమైన నిరాయుధీకరణను హమాస్ పాటించినప్పుడే ఐడిఎఫ్ గాజా నుండి వైదొలగుతుందని మ్లాడెనోవ్ చెప్పారు. ఐతే హమాస్ వద్ద చాలా శక్తిమంతమైన, భారీ ఆయుధాలు ఉన్నాయి. అవన్నీ ఎంతో విలువైన ఆయుధాలు. కాగా మ్లాడెనోవ్ ప్రకటనను జర్మనీ ప్రభుత్వం సమర్థించింది.

హమాస్ ఉగ్రవాదులు ఆయుధాలను వదిలిపెట్టేవరకూ గాజా నుండి తమ ఐడిఎఫ్ సైన్యాలు వైదొలగకుండా అక్కడే కొనసాగుతాయని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ఆదివారం మంత్రివర్గ సమావేశంలో ప్రకటించారు. ట్రంప్ ప్రతిపాదించిన 15 సూత్రాల ప్రణాళికను నెతన్యాహూ నిర్ద్వంద్వంగా తిరస్కరించడంతో ఇజ్రాయెల్‌కు, అమెరికాకు మధ్య హమాస్ విషయంలో విభేదా లు తలెత్తాయని వార్తలు వెలువడ్డాయి. కానీ నెతన్యాహూ ఈ ప్రణాళిక తిరస్కరించడాన్ని అమెరికా చాలా తేలికగా తీసుకుంటున్నట్లు వైట్‌హౌస్ వర్గా ల నుండి సంకేతాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మ్లాడెనోవ్ ఛానెల్–12 ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, హమాస్ దాడులను అదుపు చేసేందుకు 15 అంశాల ప్రణాళిక అమలు చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ విషయంలో తదుపరి చర్చలు కొనసాగుతున్నాయని, ఈ చర్చలు అందరికీ సానుకూల ఫలితాలను ఇస్తాయని ఆశిస్తున్నామని చెప్పారు.

ట్రంప్ ప్రతిపాదించిన 15 సూత్రాల ప్రణాళిక ప్రకారం హమాస్ ఉగ్రవాదులు తమ వద్ద ఉన్న సమస్త ఆయుధాలను గాజా లో కొత్తగా ఏర్పడే పాలస్తీనా పాలక సంస్థ ప్రభుత్వానికి స్వాధీనం చెయ్యాలి. యుద్ధం వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆ ప్రాంతం నుండి ఇజ్రాయెల్ సైన్యాలు వైదొలగిపోయావాలి. అందుకు అనుగుణంగా ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభించాలి. ఒప్పందం ప్రసుత దశ అమెరికా–హమాస్‌లకు సంబంధించిన విషయమని, హమాస్ ఇప్పు డు తన వద్ద ఉన్న ఆయుధ సంపద మొత్తాన్ని స్వాధీనం చేయాల్సి ఉందని మ్లాడెనోవ్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఆమోదంతో 2025 సెప్టెంబరులో గాజా శాంతి మండలి ఆవిర్భవించింది.

## అల్ మఖా పోర్టుపై హౌతీల క్షిపణి దాడి

### ఏడుగురు మృతి

**సనా:** ఎర్ర సముద్రంలో అల్ మఖా(అల్ మోచా ఓడరేవు) ఓడరేవుపై హౌతీ తిరుగుబాటు సైన్యాలు క్షిపణులు,డ్రోన్లతో దాడి చేశాయి. ఈ దాడిలో ఏడుగురు మరణించారు. మరణించినవారిలో యెమెన్ ప్రభుత్వ దళాలకు చెందిన నలుగురు సైనికులు కూడా ఉన్నారు. యెమెన్ ప్రభుత్వం ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. ఈ దాడులు చేసింది తామేనని అన్వరుల్లా హౌతీ తి రుగుబాటుదారులు ప్రకటించారు. ఇరాన్ అనుకూల హౌతీలు దాడులు కొనసాగిస్తూ ఉండటంతో ఎర్ర సముద్రం మరో యుద్ధ కేంద్రంగా మారింది. అల్–మఖా దాని వాణిజ్య రేవులపై అంతకు ముందు దాడి జరిగిన తర్వాత ఆదివా రం పొద్దుపోయిన తర్వాత మళ్ళీ ఈ దాడులు కొనసాగాయి. యెమెన్ పశ్చిమతీరం వెంబడి ప్ర భుత్వ అధీనంలో ఉన్న కేంద్రాలపై హౌతీలు త మ దాడిని విస్తరించారు.అంతకు ముందు హౌతీ లు చేసిన దాడుల్లో 11 మంది మరణించారు. ఈ ఘటన నుండి ఇంకా తేరుకోకముందుగానే మళ్ళీ రెండోసారి కూడా హౌతీలు దాడులు కొనసాగించారు. రెండోసారి దాడిలో ఏడుగురు మరణించగా 30 మంది గాయపడ్డారు.

ఇరాన్ ఇచ్చిన పిలుపుతో హౌతీ తిరుగుబాటుదారులు జులై 20వ తేదీన ఎర్ర సముద్రంలో దాడులు ప్రారంభించారు. హోర్ముజ్ జలసంధిలో ఐఆర్‌జిసి సైన్యాలు అనుసరించిన వ్యూహాన్నే తాము కూడా అమలు చేస్తామని, నౌకల రాకపోకలను స్తంభింపజేస్తామని వారు ప్రకటించారు. అనుకున్నవిధంగానే సౌదీ అరేబియాకు చెందిన నౌకలపై దాడులు చేశారు. యెమెన్‌లో తమపై సౌదీ అరేబియా దిగ్బంధనం తొలగించేవరకూ ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియా నౌకలను తిరగనివ్వబోమని వారు ప్రకటించారు. 2004 నుండి హౌతీలకు,సౌదీఅరేబియాకు మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి.

## వరుణ యాగం

(మొదటి పేజీ తరువాయి)



తరలివచ్చిన 108 మంది ఋత్వికులు, అర్చకులు శాస్త్రక్తంగా యాగాన్ని నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున 4:05 గంటలకు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా వరుణ యాగం ప్రారంభమైంది. గోపూజతో శ్రీకారం చుట్టిన ఋత్వికులు యాగ ప్రదక్షిణ,పుణ్యాహవాచనం, అంకురార్పణం, ఋష్యశృంగ పూజ తదితర క్రతువులను నిర్వహించారు.కృష్ణా నది తీరంలో చతుర్విధ పారాయణం, వేద మంత్రోచ్ఛారణల మధ్య యాగం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.సాయంత్రం 3.24 గంటలకు పూర్ణాహుతితో వరుణ యాగం సంపూర్ణమైంది. పూర్ణాహుతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణాహుతి సమర్పించి యాగాన్ని ముగించారు.సీఎం దంపతులకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం,జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు.మేళతాళాల నడుమ యాగశాలకు తీసుకెళ్లారు.వరుణ యాగంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి,మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు,మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి,ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య,ఎమ్మెల్యే వేముల వీరేశం,రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి,ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు,సుదర్శన్‌రెడ్డి,మాజీ మంత్రి జానారెడ్డి,దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు,జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎస్‌పి శరత్‌చంద్ర పవార్,అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, ప్రేమ్‌కరణ్‌రెడ్డి,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, ఆలేరు,భువనగిరి, తుంగతుర్తి, మిర్యాలగూడ, దేవరకొండ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామే లు, బత్తుల లక్ష్మారెడ్డి,బాలునాయక్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు,మిర్యాలగూడ ఆర్‌డిఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్లు తొలగింపు! (మొదటి పేజీ తరువాయి)

సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తికాగా, రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం పురోగతి నమోదైంది. డిజిటలైజేషన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా 94.30 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. అనంతరం మెదక్ (90.54 శాతం), సూర్యాపేట (90.43 శాతం), జగిత్యాల (89.60 శాతం), కుమురం భీమ్ ఆసిఫాబాద్ (89.45 శాతం) జిల్లాలు నిలిచాయి. మరోవైపు హైదరాబాద్ జిల్లా కేవలం 58.58 శాతం డిజిటలైజేషన్‌తో చివరి స్థానంలో ఉండగా, మేడ్చల్‌మల్కాజిగిరి (63.82 శాతం), రంగారెడ్డి (64.91 శాతం) జిల్లాల్లోనూ ప్రక్రియ ఆశించిన వేగంతో సాగలేదు. రెండుసార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం గణనీయంగా పెరగకపోవడం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది.

**69 లక్షల మంది ఫారాలు సమర్పించలేదు**

రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినప్పటికీ, దాదాపు 69 లక్షల మంది ఇప్పటికీ తమ వివరాలను సమర్పించలేదని తెలుస్తోంది. ఇల్లు మారడం, ఇంట్లో అందుబాటులో లేకపోవడం, మరణాలు, నకిలీ నమోదులు వంటి కారణాలతో ఈ ఫారాలు స్వీకరించలేకపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ఇంటింటికీ తిరిగి ఫారాల సేకరణను సోమవారంతో ముగించారు. సేకరించిన వివరాలన్నింటినీ ఆన్లైన్లో నమోదు చేసే డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

**ఈనెల 17న మూసాయిదా జాబితా**

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తయినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) ఈ నెల 12న అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అనంతరం ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. ఆ జాబితాపై నెలరోజుల పాటు అభ్యంతరాలు, సవరణల కోసం దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిశీలించిన తర్వాత అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు.

## నాణ్యమైన విద్య

(మొదటి పేజీ తరువాయి)

పేదింటి ఆడపిల్లలు వసతి గృహాల్లో చదువుకునేందుకు అవసరమైన కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు, పుస్తకాలు, ఇతర సామగ్రిని విద్యా సంవత్సరం ప్రారంభమైన నెల రోజుల్లోపే నాణ్యమైన మెటీరియల్‌తో అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున కేటాయించి, సుమారు 3,500 మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతమైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను నిర్మిస్తోందన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ విజ్ఞప్తి మేరకు విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి వెంటనే స్పందించారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రిల్స్, ప్రహరీ తదితర అవసరమైన పనులను టాప్ ప్రాధాన్యతతో చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రజా ప్రభుత్వం : మంత్రి పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు మౌలిక వసతులు, నూతన భవనాల నిర్మాణం, ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో విద్యాబోధనపై పూర్తి దృష్టి సారించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.నాణ్యమైన విద్యే భవిష్యత్ తెలంగాణ నిర్మాణానికి బలమైన పునాది అని పేర్కొంటూ, పెరుగుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా నైపుణ్యాలు, వృత్తి పరమైన సామర్థ్యాలను పెంపొందించుకునేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా మంత్రులు విద్యార్థినులకు బ్లాంకెట్లు, ట్రంక్ బాక్సులు, కార్పెట్లు, ఇతర అవసరమైన సామగ్రిని స్వయంగా అందజేశారు. నూతన భవనంలో విద్యార్థినులకు అందుబాటులోకి వచ్చిన వసతులను పరిశీలించి, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం**

అనంతరం విద్యలో ప్రతిభ కనబరిచి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు ఘనంగా సన్మానించి, అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈఓ గిరిరాజ్ గౌడ్, ప్రిన్సిపాల్ అనితాదేవి , వివిధ శాఖల అధికారులు, కెజిబివి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ముట్టడిలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 4 కిలోమీటర్ల పొడవునా భారీ భద్రతను మోహరించారని, ఉన్నతాధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్, జిల్లా పోలీసులు, క్యూఆర్‌టి నుండి 1,500 మందికి పైగా సిబ్బందిని మోహరించినట్లు వారు చెప్పారు.

**తల, చేతులు, ముఖం పగులొగట్టారు**

అసెంబ్లీకి వెళ్లే దారిలో జగన్నాథ్‌పూర్ ఆలయం సమీపంలోని చివరి బారికేడ్ వద్దకు విద్యార్థ ర్యాలీ చేరుకోగానే పోలీసులు లాఠీచార్జి చేశారని, దీంతో అనేక మందికి గాయాలైనట్లు పలువురు నిరసనకారులు పేర్కొన్నారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని, అయినా పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమానుషమన్నారు. వారు కేవలం శారీరక గాయాలు మాత్రమే చేయగలరని, తమ ఆలోచనలకు హాని చేయలేని నిరసనకారుడైన పీయూష్ కుమార్ సోని పిటిఐకి తెలిపారు. చాలా మంది విద్యార్థినులు గాయపడ్డారని, పోలీసులు తమ తల, చేతులు, ముఖం, అన్నిచోట్లా కొట్టాని ఆరోపించారు. నియామక పరీక్షల అవకతవకలపై నిరసన 17వ రోజుకు చేరుకోవడంతో, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ 51వ పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ యాత్ర, ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పాత అసెంబ్లీ భవనం బయట ప్రారంభమైంది. ఈ సమస్యపై తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జెఎల్‌కెఎం నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో అంబులెన్స్‌లో ఈ యాత్రలో చేరారు. ఆయన మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ చిత్రపటాన్ని పట్టుకుని కనిపించారు. అసెంబ్లీ మార్చ్ మార్గంలో ముళ్లకంచె బారికేడ్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ, తమకు జరిగిన అన్యాయాలపై విద్యార్థులలో ఆగ్రహం పెల్లుబుకుతోందని మహతో అన్నారు. తమ గొంతును అణచివేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందని, ఇక ఇప్పుడు తాము ఎలాంటి చర్చలు జరపబోన్నారు. తాము సభను చేరుకోలేకపోతే, తమ గొంతులైనా అసెంబ్లీలో ఉన్న ప్రజాప్రతినిధులకు చేరాలని, తమును దేశద్రోహులుగా చూస్తున్న ప్రభుత్వానికి భయపడమని, వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఒక నిరసనకారుడు అన్నారు. ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న జెపిఎస్‌సీసిజెఎస్ఎస్‌సి రిఫారమ్స్ మంచ్, సంఘ విద్రోహ శక్తులు యాత్రలో చేరకుండా నిరోధించడానికి సుమారు 500 మంది వలంటీర్లను మోహరించినట్లు తెలిపింది. ఈ సమస్యపై ఒక రోజు నిరాహార దీక్ష చేసిన తర్వాత మార్చ్‌లో చేరిన జెఎల్‌కెఎం ఎమ్మెల్యే జైరామ్ మహతో మాట్లాడుతూ, విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారని, పోలీసులు వారిని ఎందుకు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ప్రశ్నంచారు. ఇదిలా ఉండగా, బిజెపి తన రాజకీయ ప్రయోజనాల కోసం ఈ నిరసనను హైజాక్ చేసిందని రాష్ట్ర మంత్రి సుదివ్య కుమార్ ఆరోపించారు. అసెంబ్లీ బయట ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం వారి డిమాండ్లలో 95 శాతం నెరవేర్చినప్పటికీ ఉద్యోగార్థులు ఆందోళన చేయడం దురదృష్టకరమని ఆయన అన్నారు. అంతకుముందు, అసెంబ్లీలో నిరసనలపై ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, ఈ ఆందోళన విద్యార్థుల ఉద్యమం నుండి బిజెపి దుష్ట మనస్తత్వం, రాజకీయ కుట్రల ఆధిపత్యంలోకి మారిందని కుమార్ ఆరోపించారు.

## హుష్‌కాకి

(మొదటి పేజీ తరువాయి)

స్థానంలో ఉన్న బిజెపి ఎంపి జగదంబిక పాల్, ప్రతిపక్షాల డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకరించిందని, సభలో క్రమశిక్షణను పునరుద్ధరించాలని సభ్యులను కోరారు. 'హోం మంత్రి స్పందించడానికి సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి చెబుతుంటే, సభలో క్రమశిక్షణను పునరుద్ధరించండి. ఇది వర్షాకాల సమావేశాల చివరి వారం. సమావేశాల చివరి మూడు వారాలుగా జరిగిన ఈ గందరగోళానికి ఎవరు బాధ్యులు? మీరు చర్చలో పాల్గొనడం లేదు' అని పాల్ అన్నారు. నిరసనల మధ్య, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు, 2026ను ప్రవేశపెట్టి, దానిని పరిశీలన, ఆమోదం కోసం ముందుకు తీసుకువెళ్లారు. సభలో మేఘ్వాల్ మాట్లాడుతుండగా ప్రతిపక్ష ఎంపిలు తీవ్రంగా నినాదాలు కొనసాగించారు. ఆ గందరగోళం మధ్య లోక్‌సభలో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లు తరువాత కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లును ప్రవేశపెట్టగా, అది సమాఖ్య స్వరూపానికి విరుద్ధమని పేర్కొంటూ ఆర్ఎస్‌పికి చెందిన ఎన్.కె. ప్రేమచంద్రన్ దానిని వ్యతిరేకించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ కేరళ (పేరు మార్పు) బిల్లును ప్రవేశపెట్టగా, సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టారు.

**రాజ్యసభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్**

రామమందిర విరాళాల చోరీ, విద్యార్థి నిరసనకారులపై పెల్లెట్ గన్‌ల వినియోగం వంటి అంశాలను లేవనెత్తడానికి ప్రతిపక్షాలు చేసిన ప్రయత్నాలను చైర్ (సభాపతి) అనుమతించకపోవడంతో సోమవారం రాజ్యసభ నుండి వాకౌట్ చేశాయి. అదే సమయంలో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు, 2026'ను చర్చ కోసం సభలో ప్రవేశపెట్టారు. జూలై 20న విద్యార్థులు చేపట్టిన ర్యాలీ సందర్భంగా విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెల్లెట్ గన్‌లను ఉపయోగించారన్న ఆరోపణలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించాలని, అలాగే రామమందిర విరాళాల చోరీ లేదా దుర్వినియోగంపై జవాబుదారీతనం ఉండాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. రాజ్యసభ ఉదయం ప్రారంభమైన తరువాత రెండుసార్లు వాయిదా అనంతరం తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమైంది. ఆ వెంటనే డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభను వెంటనే 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2.15 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, వలసపాలన కాలం నాటి చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న బిల్లును సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు.

ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే కొన్ని అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నించారు. అయితే, సభ్యులు కేవలం బిల్లుపైనే మాట్లాడాలని చైర్మన్ సూచించారు. కొనసాగుతున్న గందరగోళం మధ్య, మాట్లాడాల్సిందిగా చైర్మన్ టిఎంసి సభ్యుడు నదీముల్ హక్‌ను ఆహ్వానించారు. ఆదివారం నాడు జరిగిన ఒక 'అత్యంత తీవ్రమైన సంఘటన' గురించి ప్రస్తావించడానికి హక్ ప్రయత్నించారు.

అయితే, పరిశీలనలో ఉన్న బిల్లుపైనే మాట్లాడాలని చైర్ హక్‌ను కోరారు. ఆ అంశాన్ని లేవనెత్తడానికి అనుమతించలేదు. ఆ తర్వాత బిజెపి సభ్యుడు అరుణ్ సింగ్‌ను మాట్లాడాల్సిందిగా ఆహ్వానించారు. దీంతో ప్రతిపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయి. 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్, 1891'ను రద్దు చేసి, దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి, బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ మార్పులకు అనుగుణంగా బ్యాంక్ రికార్డులకు సంబంధించిన చట్టపరమైన విధానాన్ని మార్చడానికి ఉద్దేశించిన 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు, 2026'ను రాజ్యసభ చేపట్టిన సమయంలో ఈ ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం క్లుప్త చర్చ తర్వాత ఈ బిల్లు మూజువాణి ఓటింగ్ ద్వారా ఆమోదించారు.

## జైల్ భరో సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

ర్యాలీలు, జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిర్యేకంగా ప్రజా సంఘాల నాయకులు నినాదాలు చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిగా వారంతా ఎక్కడిక్కడ అరెస్టులు అయ్యారు. అరెస్టు చేసిన వారిని పోలీసులు సోంత పూచికత్తుపై విడుదల చేశారు.

**స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాల్సిందే: కార్మిక, ఎస్‌కెఎం నేతల డిమాండ్**

కేంద్ర ప్రభుత్వం స్వదేశీ విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ రైతు, కార్మిక, ప్రజలకు వ్యతిరేకంగా, సూక్ష్మ చిన్న మధ్య తరహా వ్యాపార సంస్థల పట్ల అలంభిస్తున్న వ్యతిరేక విధానాల వల్లే దేశంలో పేదరికం అసమానతలు పెరుగుతున్నాయని, కార్మిక సంఘాల నాయకులు ఎస్‌కెఎం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటు సంస్థలకు కట్టబెట్టెందుకు చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. అఖిల భారత కమిటీ పిలుపు మేరకు కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'జైల్ భరో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ చౌరస్తా నుంచి లోక్‌భవన్‌కు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పోలీసులు మార్గమధ్యలోనే అడ్డుకోవడంతో కార్మిక, రైతు సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడికి భారీగా చేరుకున్న పోలీసులు కార్మిక, రైతు సంఘాల నేతలను అదుపులోకి తీసుకుని వివిధ పోలీసుస్టేషన్లకు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎఐటియుసి నేతలు ఎండి.యూసుఫ్, ఎస్.బాలరాజ్, ఎం.నరసింహ, వి.ఎస్.బోస్, కమతం యాదగిరి, ఎం.ఎస్.మూర్తి, బొడ్డుపల్లి కిషన్, హసీనా బేగం, సి.ఎస్.శ్రీనివాస్, ఎ.పార్వతి ఎన్ లక్ష్మీ బాయి, సిఐటియు నాయకులు పాలడుగు భాస్కర్, వెంకటేష్, ఐఎన్‌టియుసి నేతలు ఆర్.డి.చంద్రశేఖర్, విజయ్ కుమార్, ఆదిల్ షరీఫ్, ట్రేడ్ యూనియన్ల నేతలు కె.సూర్యం( టియుసిఐ), ఎం.శ్రీనివాస్, అనురాధ (ఐఫ్‌టియు), భరత్ (ఎఐయుటియుసి), ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు పశ్య పద్మ, టి.సాగర్, కోకన్వీనర్లు ప్రభాకర్, బిక్షపతి, జక్కుల వెంకటయ్య, రాము, విజయ్, అరబండి ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు దేవభక్తుని సంధ్య, డి.జి.నరేంద్ర ప్రసాద్, ప్రభు లింగం, సుధాకర్ గౌడ్, శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు వెంకట్రామ్, ప్రసాద్, పద్మ, కాజా తదితరులు ఉన్నారు. విదేశాలతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు, స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటలకు కనీస మద్దతు ధర అమలు, రైతు రుణ విమోచన చట్టం, 2013 చట్టం ప్రకారమే భూసేకరణ సేకరణ, 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనుల భూ హక్కుల రక్షణ, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు ఉపసంహరణ, 4 లేబర్ కోడ్‌లు, సీడ్ బిల్–2025, జాతీయ ఆహార భద్రత చట్ట సవరణ బిల్లు రద్దు తదితర ప్రధాన ఏడు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ట్రేడ్ యూనియన్, ఎస్‌కెఎం నేతలు నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను సాధించేంత వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

**కార్పొరేట్, సంపన్నుల సేవలో కేంద్ర సర్కార్ : భాగం**

ఖమ్మంలో జరిగిన జైల్ భరో కార్యక్రమంలో అంబేద్కర్ సెంటర్ నుంచి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. పోలీసులు అఖిలపక్ష నేతలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వందల సంఖ్యలో ఆందోళనకారులు తమను కూడా అరెస్టు చేయాలంటూ పోలీస్ స్టేషన్‌లో చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ ఆందోళనకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య, బానోత్ చంద్రావతి, సివై పుల్లయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు, కార్మిక సంఘాల నాయకులుర, తదితరులు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ సర్కార్ సంపన్నుల సేవలోనే ఉందని రైతులు, కార్మికుల పట్ల కక్షపూరిత వైఖరిని అవలంభిస్తుందన్నారు. దేశ సంపదను అంబానీ, అదానీలతో పాటు కార్పొరేట్లకు కట్టబెడుతూ వ్యవసాయ రంగాన్ని కూడా వారి పరం చేసేందుకే నూతన సాగు చట్టాలను తీసుకు వచ్చిందని ఆయన తెలిపారు. చారిత్రిక పోరాట నేపథ్యంలో సాగు చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన దొడ్డి దారిని వాటిని అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు. పంటకు మద్దతు ధరను ప్రకటించడంతో పాటు వాటి అమలుకు మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు రావాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు వచ్చేంత వరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనను నిర్వహించి ఈ ప్ర టభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆయన తెలిపారు. సంఘటిత పోరాటాలే మోడీ ప్రభుత్వాన్ని నిలువరిస్తాయన్నారు. రాముడి పేరుతో ఎంతో కాలం ప్రజలను వంచించలేరని హేమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిడికంటి వెంకటరెడ్డి, శంకరయ్య, సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, బండి పద్మ, వై. విక్రం, నవీన్‌రెడ్డి, శోభ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

## కింగ్ కోహ్లీ ఓ మిస్టరీ బౌలర్

# పంజాబ్ కింగ్స్ స్టార్ క్రికెటర్



ఛేజ్ మాస్టర్, రన్ మెషీన్, టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన స్టార్ బ్యాటర్ అని అందరికీ తెలిసిన విషయమే. కానీ ఆస్ట్రేలియా ఆల్ రౌండర్, పంజాబ్ కింగ్స్ స్టార్ క్రికెటర్ మార్కస్ స్టోయినీస్ తన బ్యాక్యార్డ్ క్రికెట్ (పరదాల మధ్య సరదాగా ఆడే క్రికెట్) జట్టు కోసం టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లీని ఓ బౌలర్‌గా సెలెక్ట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. విరాట్ కోహ్లీని ప్రపంచమంతా గొప్ప బ్యాటర్‌గా భావిస్తుంటే.. మార్కస్ స్టోయినీస్ మాత్రం అతడిని బౌలర్‌గా ఎంచుకోవడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**కోహ్లీని బౌలర్‌గా ఎంచుకోవడానికి కారణం**

స్టార్ స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్లో మార్కస్ స్టోయినీస్ ఈ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నాడు. బ్యాక్యార్డ్ క్రికెట్లో విరాట్ కోహ్లీ వేసే పార్ట్‌టైమ్ బౌలింగ్ అత్యంత విచిత్రంగా, బ్యాటర్లకు అర్థం కాని విధంగా ఉంటుందని స్టోయినీస్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీ బౌలింగ్ స్టైల్ సాధారణంగా మిగతా బ్యాటర్లకు పెద్దగా పరిచయం ఉండదు కాబట్టి.. కోహ్లీ ఓ మిస్టరీ బౌలర్‌గా ప్రత్యర్థులను బోల్తా కొట్టించగలడని స్టోయినీస్ సరదాగా వివరించాడు.

**కోహ్లీ బౌలింగ్ రికార్డులు**

విరాట్ కోహ్లీ తన కెరీర్ ప్రారంభంలో భారత్ తరపున, ఐపీఎల్‌లో ఆర్సీబీ తరపున అప్పుడప్పుడు బౌలింగ్ చేసేవాడు. విరాట్ కోహ్లీ అంతర్జాతీయంగా టీ20ల్లో 4 వికెట్లు, వన్డేల్లో 5 వికెట్లు పడగొట్టాడు. టెస్టుల్లో మాత్రం విరాట్ కోహ్లీకి వికెట్ దక్కలేదు. ఐపిఎల్‌లో ఆర్సీబీ తరపున విరాట్ కోహ్లీ ఇప్పటివరకు 4 వికెట్లు తీశాడు. 2016లో గుజరాత్ లయన్స్ జట్టుపై 25 పరుగులిచ్చి 2 వికెట్లు తీయడం కోహ్లీ బెస్ట్ బౌలింగ్ గణాంకాలు కావడం గమనార్హం.

**2023 ప్రపంచ కప్లో మరపురాని వికెట్**

చివరగా విరాట్ కోహ్లీ భారత్ తరపున 2023 వన్డే ప్రపంచ కప్ లో నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేశాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్లో డచ్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్‌ను ఔట్ చేసి దాదాపు 9 ఏళ్ల తర్వాత వన్డేల్లో వికెట్ సాధించాడు. అంతేకాకుండా తన హోమ్ టీమ్ ఢిల్లీ తరపున ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 3 వికెట్లు, లిస్ట్‌ఏ క్రికెట్లో 5 వికెట్లు పడగొట్టాడు. టెస్టులు, టి20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ.. ప్రస్తుతం వన్డేలు, ఐపిఎల్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. రాబోయే వెస్టిండీస్‌తో స్వదేశంలో జరగబోయే వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ తిరిగి భారత జట్టు తరపున మైదానంలోకి దిగే అవకాశాలు ఉన్నాయి.

## ఆటగాళ్లేం యంత్రాలు కాదు



**వివిఎస్ లక్ష్మణ్**

భారత జట్టులో ఆటగాళ్ల గాయా లు ఇటీవల పెద్ద తలనొప్పిగా మారగా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సిఒఇ చీఫ్ వివిఎస్ లక్ష్మణ్ స్పందించాడు.

భారత జట్టులో ఆటగాళ్ల గాయా లు ఇటీవల పెద్ద తలనొప్పిగా మారగా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సిఒఇ చీఫ్ వివిఎస్ లక్ష్మణ్ స్పందించాడు. క్రికెటర్లేం యంత్రాలు కాదని, కోలుకోవడానికి వారికీ తగినంత సమయం కావాలని అతడు అభిప్రాయపడ్డాడు. అంతేగాక సిఒఇ అనేది కేవలం పునరావాస కేంద్రం కాదని, క్రికెటర్లు అత్యున్నత స్థాయిలో రాణించడానికి వారికి తోడ్పాటునందించడమూ తమ బాధ్యతల్లో భాగమని చెప్పాడు. ఆటగాళ్ల గాయాల విషయంలో ఏ ఒక్కరినీ బలిపశువుగా చేయడం సరికాదన్న లక్ష్మణ్.. బిసిసిఐ, సిఒఇ, భారత జట్ల (పురుషుల, మహిళల) మధ్య అద్భుతమైన సమన్వయం ఉందని పునరుద్ఘాటించాడు. ఆటగాళ్ల ఫిట్నెస్‌కు సంబంధించి ఎప్పటికప్పుడూ సెలక్షన్ కమిటీకి నివేదికలు అందజేస్తామని వివిఎస్ తెలిపాడు.

## 18 నెలల్లో 17 కేజీల బరువు తగ్గిన సర్ఫరాజ్ ఖాన్




సర్ఫరాజ్ ఖాన్ సూపర్ స్లిమ్ అయ్యాడు. బాడీ వెయిట్ తగ్గాడు. 18 నెలల్లో అతను 17 కేజీల బరువు తగ్గేశాడు. ముంబై క్రికెటర్ ఇటీవల తన ఫిట్నెస్‌పై ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలోనే లంకతో జరిగే టెస్ట్ సిరీస్‌కు అతన్ని ఎంపిక చేశారు. క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ మళ్లీ టీమిండియా జట్టులో చోటు సంపాదించాడు. శ్రీలంకతో జరిగే టెస్ట్ సిరీస్‌కు అతన్ని ఎంపిక చేశారు. సాయి సుదర్శన్ గాయపడడంతో.. అతని స్థానంలో సర్ఫరాజ్‌కు చోటు కల్పించారు. అయితే గతంలో భారీ బరువు వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న సర్ఫరాజ్ ఖాన్.. ఇప్పుడు సూపర్ స్లిమ్ అయ్యాడు. గడిచిన 18 నెలల్లోనే అతను సుమారు 17 కేజీల బరువు తగ్గాడని తెలిసింది. దీంతో చాలా అట్రాక్టివ్‌గా, హుషారుగా సర్ఫరాజ్ కనిపిస్తున్నాడు. ఇటీవల ముంబై టీ20 లీగ్‌లో అతను తన మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్నాడు. అతను తన ప్రాక్టీస్ను కశ్మీర్కు మార్చేశాడు. అక్కడ నెట్ బౌలర్లతో ప్రాక్టీస్ చేశాడు. ఈ సమయంలోనే అతను ఫిట్నెస్‌పై మరింత ఫోకస్ పెట్టాడు. నేను ఫిట్ లేకపోవచ్చు, కానీ అన్ని రకాలుగా పోరాడుతాను అని కొన్ని రోజుల క్రితమే సర్ఫరాజ్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నాడు.

యువతరంగం

## విద్యారంగానికి కేటాయింపు ఎంత?

### ఎఐ యుగంలోనూ పాత విద్యా విధానం!

శాస్త్ర, సాంకేతిక రంగం శరవేగంగా పరుగులు తీస్తున్న తరుణంలో ఒక పెద్ద మార్పు భారత యువత ముందుంది. అదే కృత్రిమ మేధస్సు (ఎఐ). ఈ ఎఐ కొన్ని ఉద్యోగాలను మార్చుతుంది. కొన్ని పనులను ఆటోమేట్ చేస్తుంది. కొన్ని కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది. అందుకే, రాబోయే ఆర్థిక వ్యవస్థలో కేవలం డిగ్రీ ఉండటం సరిపోదు. విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, సృజనాత్మకత, కమ్యూనికేషన్, డిజిటల్ నైపుణ్యాలు, శాస్త్రీయ దృక్పథం, నిరంతర అభ్యాస సామర్థ్యం మరింత విలువైనవిగా మారతాయి. ఇక్కడ భారత విద్యా వ్యవస్థకు ఒక ప్రాథమిక సవాలు ఎదురవుతోంది. పరీక్షలో సరైన సమాధానం గుర్తించడం, జ్ఞాపకశక్తితో విషయాలను పునరావృతం చేయడం, ర్యాంకు సాధించడం వంటి అంశాలపై ఎక్కువగా ఆధారపడే విద్యా సంస్కృతి ఎఐ యుగానికి ఎంతవరకు సరిపోతుంది? యంత్రాలు ఇప్పటికే సమాచారాన్ని వేగంగా సేకరించగలవు. పునరావృత పనులు చేయగలవు. పాఠ్యాన్ని తయారు చేయగలవు. ప్రాథమిక విశ్లేషణలు చేయగలవు. అలాంటి సమయంలో మనిషి ప్రత్యేకత ఎక్కడ ఉంటుంది? ప్రశ్నించడంలో. కొత్త ఆలోచన చేయడంలో. సంక్లిష్ట సమస్యలను అర్థం చేసుకోవడంలో. నైతిక నిర్ణయాలు తీసుకోవడంలో. సృజనాత్మకంగా స్పందించడంలో. ఇతరులతో కలిసి పనిచేయడంలో మనిషి తన ప్రత్యేకతను చూపాలి. ఉనికిని చాటుకోవాలి. ప్రతిభతో ముందుకు సాగాలి. ఈ కారణంగానే, భారత విద్యా సంస్కరణ పరీక్షల సంస్కరణతో ఆగకూడదు. అది నేర్చుకునే విధానాన్నే మార్చాలి.



విద్యా మంత్రిత్వ శాఖకు 2026–27 బడ్జెట్‌లో రూ. 1,39,289 కోట్లు కేటాయించడం గణనీయమైన మొత్తం. ఇందులో పాఠశాల విద్యకు రూ.83,562 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 55,727 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం విద్య, నైపుణ్యాలు, యువతను ఆర్థిక వృద్ధికి అనుసంధానించే చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెబుతోంది. అయితే విద్యపై ఖర్చు పెరగడం మాత్రమే విజయానికి ప్రమాణం కాదు. ఆ డబ్బు ఎక్కడ ఖర్చవుతోంది? ఉపాధ్యాయుల నాణ్యత ఎలా ఉంది? ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి? ప్రభుత్వ కళాశాలల్లో పరిశోధన స్థాయి ఏమిటి? విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు అందుతున్నాయా? గ్రామీణ విద్యార్థికి పట్టణ విద్యార్థితో సమానమైన డిజిటల్ ప్రాప్యత ఉందా? ఇవి మరింత ముఖ్యమైన ప్రశ్నలు. ఒక సంపన్న కుటుంబానికి చెందిన విద్యార్థి ఖరీదైన కోచింగ్ తీసుకోగలడు. కృత్రిమ మేధస్సు (ఎఐ) సాధనాలను ఉపయోగించగలడు. ఉత్తమమైన ఆన్‌లైన్ కోర్సులు కొనగలడు. పరీక్షలో విఫలమైతే మరోసారి ప్రయత్నించగలడు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థికి ఈ ఎంపికలు పరిమితంగా ఉంటాయి. అందువల్ల విద్యలో అసమానత చివరకు ఉద్యోగ మార్కెట్‌లో అసమానతగా మారుతుంది. రిజర్వేషన్లు సామాజిక న్యాయానికి కీలకమైన సాధనం. కానీ రిజర్వేషన్ ఒక్కటే అసమానతను తొలగించదు. అసమాన పాఠశాలలు, అసమాన కుటుంబ ఆదాయాలు, కోచింగ్‌కు అసమాన ప్రాప్యత, డిజిటల్ వనరుల్లో అసమానత, ఉద్యోగ మార్కెట్‌లో అసమాన అవకాశాలు కొనసాగితే విద్యా సమానత్వం సాధ్యం కాదు.

## నిరుద్యోగం ఓ శాపం..




నేడు దేశ యువతలో పెరుగుతున్న అసంతృప్తిని రాజకీయ కోణంలో మాత్రమే అర్థం చేసుకోవడం పొరపాటు. ఇది ఒక సామాజిక, ఆర్థిక, విద్యా సంక్షోభం. యువత ఉద్యోగం కోరుతోంది. అది అసాధారణమైన డిమాండ్ ఏమీ కాదు. నిరుద్యోగం ఒక శాపం. మానసికంగా కుంగతీసే, చికిత్సలేని వ్యాధి. అందుకే, నేటి యువత ఉద్యోగాలు కోరుకుంటున్నారు. మంచి భవిష్యత్తు కోరుకుంటున్నారు. ఉన్నత విద్యను కోరుకుంటున్నారు. వివిధ ప్రవేశ, ఉద్యోగ పరీక్షలు న్యాయంగా జరగాలని కోరుకుంటున్నారు. అది ప్రత్యేక హక్కు కాదు. వారు తమ డిగ్రీకి తగిన అవకాశాలు దక్కాలని అంటున్నారు. అది అవాస్తవమైన ఆశ కాదు. వారు తమ కుటుంబం చేసిన విద్యా పెట్టుబడికి ఒక సామాజిక ప్రతిఫలం రావాలని కోరుతున్నారు. అది సహజమైన ఆకాంక్ష. ఈ అసంతృప్తిని వక్రీకరిస్తూ 'యువతలో సహనం తగ్గింది' అని వ్యాఖ్యానించడం దుర్మార్గం. సమస్యను తప్పుగా అర్థం చేసుకోవడం. ప్రభుత్వాలు పరీక్షలను విశ్వసనీయంగా నిర్వహించాలి. ఖాళీలను సమయానికి ప్రకటించి నియామకాలను పూర్తి చేయాలి. విద్యా సంస్థల నాణ్యతను పెంచాలి. ప్రభుత్వ విద్యకు తగిన వనరులు అందించాలి. ఎంఎస్ఎంఇ రంగాన్ని బలోపేతం చేయాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణను మార్చాలి. కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. ఆ వృద్ధిలో తమకు స్థానం ఎక్కడ ఉందో వారు తెలుసుకోవాలి. భారతదేశం తన యువ జనాభాను నిజమైన ఆర్థిక శక్తిగా మార్చగలిగితే 21వ శతాబ్దంలో ప్రపంచంలో తన స్థానాన్ని మరింత బలపరచగలదు. కానీ చదువుకున్న యువతకు అవకాశాలు లేకుండా, పరీక్షలపై నమ్మకం లేకుండా, ఉద్యోగాలు అస్థిరంగా, విద్య అసమానంగా ఉంటే అదే జనాభా అనుకూలత సామాజిక అసంతృప్తికి మూలంగా మారవచ్చు. 2026లో కనిపిస్తున్న యువత అసంతృప్తిని ఒక హెచ్చరికగా చూడాలి. ఇది ఒక పరీక్షా పేపర్ గురించి మాత్రమే కాదు. ఒక నియామక ప్రక్రియ గురించి మాత్రమే కాదు. ఒక ప్రభుత్వం గురించి కూడా కాదు. భారతదేశం తన యువతకు ఇచ్చిన వాగ్దానం గురించి. 'చదువు ఉంటే.. అవి బలహీనపడినప్పుడు ఆగ్రహం మొదలవుతుంది. భారతదేశం ఇప్పుడు ఆ ఆగ్రహాన్ని అణచివేయాల్సిన దశలో లేదు. దాని మూలాలను అర్థం చేసుకుని పరిష్కరించాల్సిన దశలో ఉంది. ఎందుకంటే యువతకు సానుభూతి అవసరం లేదు. పరిష్కారం కావాలి. తమ కష్టానికి అర్థవంతమైన భవిష్యత్తు ఉండాలి.

## పాషన్‌తో సినిమా తీసిన తెలంగాణ దర్శక,నిర్మాతలు

### 'హుషార్ పిట్టలు' ట్రైలర్ ఆవిష్కరణలో సురేష్ బాబు



అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బివిజి స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి.15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నిర్మాత సురేష్బాబు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డి.సురేష్బాబు మాట్లాడుతూ తెలంగాణ నుంచి వచ్చిన దర్శక, నిర్మాతలు ఎంతో పాషన్‌తో సినిమా తీశారు. మా సురేష్ ప్రొడక్షన్స్ ప్రతినిధులు ఈ సినిమా చూసి పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఇవ్వడంతో ఈ సినిమాను మా సురేష్ ఏషియన్ ఫిలింస్ ద్వారా విడుదల చేస్తున్నాం. ఈ సినిమా విషయంలో ఎదురైన అన్ని కష్టాలు దాటుకుని ఈ స్టేజ్‌కు వచ్చారు. వాళ్ల ఎగ్రెసివ్‌తో ఈ సినిమాను మార్కెటింగ్ చేస్తున్నారు. విడుదలకు ముందే కొన్ని షోలు వేస్తున్నారు. ఆ పాజిటివ్ ఫీడ్‌బ్యాక్‌తో. మౌత్ టాక్‌తో ఈసినిమా మరింత మందికి రీచ్ అవుతుంది. తప్పకుండా ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ హుషార్ పిట్టలు చిత్రం ఎంతో నేచురల్‌గా ఉంటుంది ఈ సినిమా చూస్తే అందరికి మీ ఊరికి వెళ్లొచ్చిన ఫీలింగ్ కలుగుతుంది.ఈ సినిమా విజయంతో నాకు సినీ ఇండస్ట్రీలో కూడా గుర్తింపు వస్తుందని అనుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ వాసవీ గణేషన్, హీరో అన్ను, బెక్కెం వేణుగోపాల్, దర్శకుడు బిక్షు, గీత రచయిత చిరంజీవ్, డిఒపి రుద్రసాయి, నటులు గోవర్ధన్, భాను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 'స్లమ్ డాగ్'లో గౌరీ హెగ్డేగా టబు

రీల్




దర్శకుడు పూరి జగన్నాథ్, హీరో విజయ్ సేతుపతి మొదటిసారిగా కలసి చేస్తున్న పాన్ఇండియా యాక్షన్ డ్రామా 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్'. రా ఎమోషన్స్, పవరుర్ఫుల్ యాక్షన్, మిస్టరీ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఇప్పటికే టబు ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన మేకర్స్.. తాజాగా ఆమె పాత్రకు సంబధించిన పవర్ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.నగరంలోని స్లమ్ ఏరియా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ గ్లింప్స్.. అక్కడి రఫ్ వాతావరణాన్ని పరిచయం చేస్తూ మొదలవుతుంది. ఆ తర్వాత కారు దిగుతూ, సిగరెట్ వెలిగించి, పరిస్థితులను తన కంట్రోల్లోకి తీసుకునే గౌరి హెగ్డేగా టబు ఎంట్రీ ఇచ్చారు. స్థానిక గూండాకు వార్నింగ్ ఇచ్చి, ఆ వెంటనే చెంపదెబ్బ కొట్టే సన్నివేశం ఆమె పాత్ర ఎంత పవర్ఫుల్‌గా ఉండబోతోందో చెబుతోంది.గౌరి హెగ్డే కేవలం పవర్ఫుల్ ఆఫీసర్ మాత్రమే కాదు.. ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గని, భయమంటే తెలియని, కాంప్రమైజ్ కాని మహిళగా ఆమె పాత్రను ఆమె పోషించారు. రోడ్డుపై గూండాలను ఎదుర్కొంటూ, లాఠీతో వారిని అదుపులోకి తీసుకునే విధానం ఆకట్టుకునేలా చిత్రీకరించారు. ఫియర్‌లెస్ విమెన్, పవర్ ఫుల్ ఆఫీసర్, డెవిల్ ఇన్ ది డిపార్‌మెంట్ అంటూ గ్లింప్స్‌లో కనిపించే పదాలు గౌరి హెగ్డే పాత్ర స్వభావాన్ని మరింత స్పష్టంగా తెలియజేస్తున్నాయి. చివర్‌లో గౌరి హెగ్డే, డిప్యూటీ కమిషనర్, ఇన్కమ్ ట్యాక్స్ అంటూ టబు తనను తాను పరిచయం చేసుకునే సీన్ హైలైట్‌గా నిలిచింది. ఈ ఇంట్రడక్షన్‌లో పూరి జగన్నాథ్ మార్క్ కనిపిస్తోంది. గ్లింప్స్‌లో విజయ్ సేతుపతి పాత్రకు సంబంధించిన కొన్ని షాట్లు కూడా ఆకట్టుకున్నాయి. పవర్ఫుల్ క్యారెకర్‌లను డిజైన్ చేయడంలో తనదైన శైలిని చూపించే పూరి జగన్నాథ్.. గౌరి హెగ్డే పాత్రను కూడా అదే తరహాలో ఇంట్రెస్టింగ్‌గా తీర్చిదిద్దినట్‌లో గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది.ఈ చిత్రంలో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా, దునియా విజయ్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారు. బ్రహ్మాజీ, విటివి గణేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సామ్ కె. నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్నారు. సంతోష్ నూజిల్లా ఎడిటింగ్. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ తమ పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై జేబీ నారాయణరావు కొండ్రొల్లా జేబీ మోషన్ పిక్చర్స్ తో కలిసి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ఇండియా స్థాయిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'కపాలి'లో హన్సిక ఫస్ట్ లుక్ రిలీజ్



హీరో రోహిత్ నారా ప్రస్తుతం సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ 'కపాలి'లో నటిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు రామ్ గన్ని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సప్త అశ్వ మీడియా వరక్స్ బ్యానర్‌పై కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మించగా, విజయ్ కృష్ణ లింగమనేని సమర్పిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా హన్సిక మోత్వానీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇంటెన్స్ లుక్‌లో హన్సిక కనిపిస్తున్న ఈ పోస్టర్.. 'కపాలి' కథలో ఆమె పాత్రకు ఉన్న ప్రాధాన్యతను సూచిస్తోంది. ఆమె చుట్టూ ఉన్న మిస్టీరియస్ ఎలిమెంట్స్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి.ఈ చిత్రంలోని మిగతా నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు నిర్మాతలు తెలిపారు.



## హీరో కిరణ్ అబ్బవరం హీరోగా 'ఇంద్రపుత్ర'


జి స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మాణంలో కొత్త దర్శకుడు శ్రీకాంత్ పుప్పాల కాంబినేషన్‌లో కిరణ్ అబ్బవరం హీరోగా ఎపిక్ మైథాలజీ మూవీ 'ఇంద్రపుత్ర' ఫస్ట్ ఛాప్టర్ ప్రకటించారు. పురాణ ఇతిహాసాల్లోని ధర్మానికి అధర్మానికి మధ్య జరిగే పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాను రూపొందిస్తున్నారు కొత్త దర్శకుడు శ్రీకాంత్ పుప్పాల తెలిపారు. మైథాలజీ, యాక్షన్, ఫాంటసీ, ఎమోషన్ వంటి అంశాలతో గ్రాండ్ స్కేల్ లో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా 'ఇంద్రపుత్ర' ఫస్ట్ ఛాప్టర్ మూవీ నిర్మాణం కానుంది.భాషలకు అతీతంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా లార్జ్ స్కేల్ పాన్ ఇండియా చిత్రంగా 'ఇంద్రపుత్ర' ఫస్ట్ ఛాప్టర్ తెరపైకి రానుంది.వచ్చే ఏడాది ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కు రెడీ కానుంది. ఈ చిత్రానికి కీర్తన్ స్టోరీని అందించి, కుస్సుమ్ అరోరాతో కలిసి ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. నిర్మాత ప్రేరణ అరోరా మాట్లాడుతూ 'ఇంద్రపుత్ర' ఫస్ట్ ఛాప్టర్ చిత్రంతో మేమంతా ఎంతో ప్యాషన్‌తో ఒక సరికొత్త సినిమాటిక్ వరల్‌ను క్రియేట్ చేస్తున్నాం. మన పురాణ ఇతిహాసాల నుంచి స్ఫూర్తిగా తీసుకున్న అంశాలతో నేటి ట్రెండ్ కు తగిన మేకింగ్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. అక్టోబర్ నుంచి మా మూవీ షూటింగ్ ప్రారంభిస్తాం అన్నారు.

## ఒఎంజి చేతికి 'కిల్లర్' ఓవర్సీస్ హక్కులు



సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ 'కిల్లర్'కు అంతర్జాతీయ స్థాయిలో మరో కీలక ముందడుగు పడింది. పూర్వాజ్ రచన, దర్శకత్వం, నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ హక్కులను ఒఎంజి పిక్చర్స్ సొంతం చేసుకుంది. ఉర్వీష్ పూర్వజ్ సమర్పణలో, థింక్ సినిమా బ్యానర్‌పై తెరకెక్కుతున్న 'కిల్లర్'లో జ్యోతి పూర్వజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. 'కిల్లర్'లో జ్యోతి పూర్వజ్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సాధారణ మహిళా పాత్రలకు భిన్నంగా, సైన్స్ ఫిక్షన్ ప్రపంచంలో ఒక శక్తివంతమైన సూపర్‌షీగా జ్యోతి పాత్రను దర్శకుడు పూర్వాజ్ డిజైన్ చేశారు. ఓఎంజీ పిక్చర్స్ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్‌లో భాగంగా 'కిల్లర్'ను తెలుగు, తమిళ భాషలలో అంతర్జాతీయ ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. అమెరికా, యూరప్, కెనడా, అరబ్ దేశాలు, మలేషియా, న్యూజిలాండ్, రష్యా తదితర ప్రాంతాలలో కూడా విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## 'డిటెక్టివ్ జీవన్'గా మురళీశర్మ



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'సుధీర్స్ జోకర్'. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆనంద మీడియా బ్యానర్‌పై ప్రొడ్యూసర్స్ శ్రీనివాసులు పి.వి., విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పిఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. 'సుధీర్స్ జోకర్' సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో మురళీశర్మ డిటెక్టివ్ జీవన్ పాత్రలో ప్రేక్షకులను ఆకట్టుకోబోతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఎన్ను సూపర్ హిట్ చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలు పోషించి పేరు తెచ్చుకున్న మురళీశర్మకు ఈ డిటెక్టివ్ జీవన్ పాత్ర మరో గుర్తుండిపోయో క్యారెక్టర్ కాబోతోంది. డిటెక్టివ్ జీవన్ ఎలాంటి ప్రయత్నాలు చేశాడు అనేది ఈ సినిమాలో ప్రేక్షకులకు ఆసక్తి కలిగించనుంది.సుడిగాలి సుధీర్, అయేషా, అభిరామి,మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ ధర్మేంద్ర కాకర్ల ,సినిమాటోగ్రఫీ అహ్మద్ షెరీఫ్, మ్యూజిక్ లియోన్ జేమ్స్.



## బిజెపి ప్రజావ్యతిరేక పాలనను నిరసించండి

గోడపత్రికను ఆవిష్కరించిన దేవరం మల్లేశ్వరి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కేంద్రంలోని బిజెపి ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14వ తేదీ వరకు చేపట్టిన పాదయాత్రలను, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని సెప్టెంబర్ 1న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత జాతీయ మహిళ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో జాతీయ మహిళసమాఖ్య కార్యకర్తలతో కలిసి ఆమె చలో ఢిల్లీ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక విద్య, ఆరోగ్యం అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధర ఏర్పాటుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళ రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని కార్మికులు, హక్కులను పరిరక్షించాలన్నారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలోఎన్నికలను పునరుద్ధరించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, దళిత, ఆదివాసిలపై అకృత్యాలను, దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునగ సామ్రాజ్యం, శ్రీలత, మంగమ్మ, నర్సమ్మ, వీరమ్మ, జ్యోతి, వెంకటమ్మ, సూరమ్మ, పద్మ, రాణి, నాగమణి, నాగలక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం




**ప్రజాపక్షం/మునుగోడు:** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ మునుగోడు మండల అధ్యక్ష,కార్యదర్శులు కట్ట దశరథ,పగిళ్ల రమేష్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ నెల 13న మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా 15వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మునుగోడులోని సిపిఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో చదువుకున్న యువతకు తగిన ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారిందన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని యువతకు హామీ ఇచ్చిందని, అయితే ప్రభుత్వ రంగంలోని ఖాళీలను భర్తీ చేయడంలో జాప్యం చేస్తోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శివర్ల నాగరాజు,గడ్డం ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు సోమగాని వెంకటేష్, గడ్డం నవీన్ పాల్గొన్నారు.

## కేంద్రం తీరుతో రైతు పరిస్థితి అగమ్యగోచరం





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడ పట్టణంలో ప్రచార యాత్రలో భాగంగా నిర్వహించిన భారీ పాదయాత్ర జనసందోహంతో సాగింది. పాలనను తీవ్రంగా అస్తవ్యస్తం చేసిన పాలకుల తీరును నిరసిస్తూ ప్రజలను పోరాటాల వైపు మమేకం చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత డీజిల్, పెట్రోల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల నడుము విరిచారని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తక్షణమే అమలు చేయకుండా రైతాంగానికి ఏ విధంగా మేలు చేస్తారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, పోలేపల్లి విజయ్ కుమార్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగా నాయక్, సాలె జగన్, ప్రజానాట్యమండలి ప్రతినిధులు వెన్నెల వెంకన్న, కలకొండ శ్రీను, వంగూర్ శీను, మహిళా సమాఖ్య ప్రతినిధులు దాసర్ల దుర్గమ్మ, ఎర్రబోతు పద్మ, ఎస్కే షమీమ్ పాల్గొన్నారు.

## కేంద్రం ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు విమర్శించారు.ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ నెల 13న మునుగోడులో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా 15వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం నార్కట్‌పల్లిలో నిర్వహించిన ఏఐవైఎఫ్ నకిరేకల్ నియోజకవర్గ మహాసభలో ఆయన మాట్లాడారు.మహాసభకు ఎస్‌కె షరీఫ్ అధ్యక్షత వహించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని యువతకు హామీ ఇచ్చిందని, ఆ హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వెంకటేశ్వర్లు ఆరోపించారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ఏఐవైఎఫ్ విస్తృత పోరాటాలు నిర్వహించాలని సూచించారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు.మహాసభలో సిపిఐ మండల కార్యదర్శులు పెండ్యాల శంకర్,అక్బర్,మాజీ ఏఐవైఎఫ్ నియోజకవర్గ నాయకులు వెంపటి శ్రీను, జిల్లా సత్యం,జహంగీర్,జెరిపోతుల మహేష్, శిరబోయిన జానీ,ఖమ్మంపాటి వెంకన్న,తోడుసు మహేష్,మధు, సాయి,రవి,రాజు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి పాలనకు చరమగీతం




### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము :** ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బిజెపిని గద్దె దించాల్సిందేనని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార యాత్రలో భాగంగా నేరేడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి, పెద్దమునిగల్, కొత్తపల్లి, పేర్వాల, నేరేడుగొమ్ము, తిమ్మాపూర్ గ్రామాలలో జరిగిన సిపిఐ ప్రజా చైతన్య యాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం నిత్యవసర ధరలను పెంచి సామాన్యులు బతకలేని పరిస్థితిని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరల పెంపు అడ్డు అదుపు లేకుండా పెంచుతున్నారని ప్రజలపై ఏమాత్రం బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు. విద్యా వ్యవస్థను గాడిన పెట్టలేని కేంద్ర బిజెపి సర్కార్ యువత నుండి వస్తున్న వ్యతిరేకతను తగ్గించుకోవడంలో కంటి తుడుపు చర్యలు చేశారని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి నర్సింహా, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, నేరేడుగొమ్ము మండల కార్యదర్శి రామాంజనేయులు, దేవరకొండ, చందంపేట మండల కార్యదర్శులు వెంకటయ్య, సుదర్శన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు రామ్వామి, రంగారెడ్డి, వెంగలయ్య, దేవీలాల్, శివ, రమేష్, సురేష్, ఆంజనేయులు, మల్లయ్య, బక్కయ్య, వెంకటయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.

### మోదీకి అంబానీ, ఆదానిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు

మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు

**ప్రజాపక్షం/దేవరకొండ :** ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి అంబానీ, ఆదానిలపై ఉన్న ప్రేమ దేశ ప్రజలపై లేదని మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. సోమవారం దేవరకొండ మండలంలోని తెలుగుపల్లి గ్రామంలో సిపిఐ ప్రజా చైతన్య యాత్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బిజెపిని గద్దెదించి పాలనకు చరమగీతం పాడాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి నర్సింహా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, రామాంజనేయులు, వెంకటయ్య, రామస్వామి, రంగారెడ్డి, విజేందర్, వెంగలయ్య, దేవీలాల్, లింగయ్య, చక్రి, వెంకటేష్, భారీములు తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ యాత్ర

**ప్రజాపక్షం/చందంపేట :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార యాత్ర సోమవారం చందంపేట మండలంలో కొనసాగింది. ఈకార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్రలు, ప్రచార జాతలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చందంపేట మండలంలోని ముడదండ్ల, చందంపేట, గన్నేర్లపల్లి, పోలేపల్లి, గాగిళ్లాపూర్, పెద్దమూల, చిత్రియాల, నల్లచెలమూల గ్రామాల్లో సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార జాత నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనోద్దిన్, మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, సహాయ కార్యదర్శి మొగిలయ్య,జిల్లా కౌన్సిల్ కనకాచారి పాల్గొన్నారు.







## బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా కొనసాగించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభపక్ష నేత కూనంనేని సాంబశివరావుకు అఖిలపక్ష నాయకుల వినతి

**ప్రజాపక్షం/కోదాడ:** హైద్రాబాద్ చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను సూర్యాపేట మీదుగా కొనసాగించి, సూర్యాపేటలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి, సూర్యాపేట అఖిలపక్ష నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభపక్ష నేత కూనంనేని సాంబశివరావుకు కోదాడలో వినతిపత్రం అందజేశారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని, ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తాలని వారు కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రం జాతీయ రహదారి 65పై హైద్రాబాద్, విజయవాడ నగరాల మధ్య కీలక ప్రాంతంలో ఉందని నాయకులు తెలిపారు. పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటను బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో విస్మరించరాదని కోరారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని ఏర్పాటు చేయడం వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఖమ్మం, వరంగల్ ప్రాంతల ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుందని వివరించారు. సూర్యాపేటను బుల్లెట్ ట్రైన్ మార్గంలో చేర్చడం వల్ల ఈ ప్రాంతంలో రవాణ సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య పర్యాటక రంగాల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని నాయకులు పేర్కొన్నారు. సూర్యాపేట ప్రజల చిరకాల డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేయాలని కూనంనేని సాంబశివరావును కోరారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ప్రొఫెసర్ అరుట్ల జానకిరెడ్డి, ముఖ్య సలహదారు రమణచారి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టపల్లి సైదులు, నాయకులు పేర్ల నాగయ్య, ముత్యాలు, జర్నలిస్టులు రాంబాబు, భూపతి రాములు, సిపిఐ నాయకులు కంబాల శ్రీనివాస్, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## స్వేచ్ఛ, వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలి

సూర్యాపేటలో జైల్‌భరో విజయవంతం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** స్వేచ్ఛ, వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ఎస్‌కెయం జాతీయ కమిటి ఇచ్చిన జైల్‌బరో పిలుపును పోలీస్ నిర్బంధాలను చేదించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవనం నుండి కొత్త బస్టాండ్ నుండి సిపిఐ, ఎఐటియుసి, ఎఐకెఎంఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరి కొత్త బస్టాండ్ నుండి నేషనల్ హైవే 65 రోడ్డు పై జైల్‌భరో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. మోడి ప్రభుత్వం రైతు కార్మిక వ్యతిరేక విధానాలను వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వానికి పోరాడాలని కోరారు. జైల్‌భరో కార్యక్రమాలను నిర్వహిస్తున్న రైతు కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామికమని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, కప్పోజు సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దూళిపాళ ధనుంజయనాయుడు, రెమిడాల రాజు, సిపిఐ నాయకులు ఎల్లంల యాదగిరి, బూర వెంకటేశ్వర్లు, దంతాల రాంబాబు, చామల అశోక్‌కుమార్, గుగులోతు రాజారాం, ఖమ్మంపాటి రాము, ఎడెల్లి శ్రీకాంత్, బూర సైదులు, కామేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్‌గా మీలా మహాదేవ్ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామిక వేత్త, సుధాకర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండి మీలా మహాదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని లయన్స్ ఐ హాస్పిటల్‌లో సభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారి మొరిశెట్టి లక్షాది, సహాయ ఎన్నికల అధికారులు యాద కిరణ్, గుడిపూడి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. చైర్మన్‌గా మీలా మహాదేవ్ పేరును దోసపాటి గోపాల్ ప్రతిపాదించగా గుడిపూడి వెంకటేశ్వరరావు బలపర్చారు. దీంతో మీలా మహాదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అలాగే కార్యదర్శిగా పెండెం చంద్రశేఖర్, కోశాధికారిగా చిలుముల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా తోట శ్యాంప్రసాద్, కక్కిరేణి చంద్రశేఖర్, పోలబోయిన నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా మిర్యాల సుధాకర్ ఎన్నికయ్యారు. ఈసి సభ్యులుగా నూక వెంకటేశం గుప్తా, ఈగ దయాకర్, పటేల్ నర్సింహారెడ్డి, భువనగిరి భాస్కర్, ఆరె సురేష్‌రెడ్డి, కుమ్మరికుంట్ల లింగయ్య, బెలిదె అంజయ్య, రామడుగు ధర్మారావు, చల్లా లక్ష్మి కాంత్, రాచకొండ శ్రీనివాస్, మట్టపల్లి రాధకృష్ణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోదు భాస్కర్, నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన మహాదేవ్‌తో పాటు ఎన్నికైన మిగతా కార్యవర్గాన్ని అభినందించారు. ఈ లయన్స్ ఐ హాస్పిటల్ అభివృద్ధికి, పేద ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని, సేవలు మరింత విస్తరింపజేయాలని ఆకాంక్షించారు. తనను ఐ హాస్పిటల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు మీలా మహాదేవ్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహకరించిన ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై సమరశీల ఉద్యమాలకు సిద్ధం

భువనగిరిలో ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన..




**ప్రజాపక్షం/భువనగిరి :** కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై కార్మికులు, రైతులు ఐక్యంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. సోమవారం కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీల పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన జైల్భరో కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, వ్యవసాయ రంగాలను కార్పొరేట్, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు కట్టబెట్టేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై రానున్న రోజుల్లో మరింత ఉధృతమైన ఉద్యమాలు నిర్వహిస్తామని ఎండీ ఇమ్రాన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు నాయకులు దంతూరి జ్ఞానేశ్వర్, రామకృష్ణ, మద్రిపల్లి సాయి కిరణ్, పంజాల సాయి, మల్లెల అంజయ్య, రమేష్, పాండు, ఐలయ్య, రాములు, నరసింహ, జగన్, భాస్కర్ పాల్గొన్నారు.

## మతం మారితే హక్కులు మారకూడదు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి, రాజ్యాంగ ప్రకారం ఎస్సీలకు అందుతున్న రిజర్వేషన్లు, రాయితీలు హక్కులు వర్తింపజేయాలని ఫాస్టర్స్ ఫెలోషిఫ్ గౌరవ అధ్యక్షులు బిషప్ సిహెచ్ సాల్మన్‌రాజు, ఫాస్టర్స్ ఫెలోషిఫ్ చైర్మన్ రెవరెండ్ శాంసన్‌మామిడి, పాస్టర్స్ ఫెలోఫిప్ గౌరవ అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ ఎం.ప్రభుదాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు వద్ద బ్లాక్‌డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ ఆర్గనైజేషన్ అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహనికి వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950లో అమలులోకి వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా మతం మారిన దళిత క్రైస్తవులు రాజ్యాంగపరంగా తమకు దక్కాల్సిన ఎస్సీ హోదా, రిజర్వేషన్లు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిక్కు, బౌద్ధమతాలకు చెందిన దళితులకు ఎస్సీ హోదా కల్పించిన విధంగానే దళిత క్రైస్తవులకు కూడా సమాన హక్కులు కల్పించాలని కోరారు. రాజ్యాంగంలోని అర్టికల్ 14 సమానత్వాన్ని, అర్టికల్ 16 సమాన అవకాశాలను కల్పిస్తున్న నేపథ్యంలో దళిత క్రైస్తవుల విషయంలో వివక్ష కొనసాగడం బాధకరమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి బలమైన సిఫార్స్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.



## దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు పోరాటాలకు సిద్ధం

**ప్రజాపక్షం/చండూరు:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నిర్వహిస్తున్న చలో జైలు భరో కార్యక్రమంలో భాగంగా చండూరు పట్టణ చౌరస్తాలో ఎఐటియుసి,రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వ కార్మిక,రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్,మండల అధ్యక్షుడు భూతరాజు దేవదాసు, రైతు సంఘం మండల కార్యదర్శి బండమీది వెంకన్న మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు పోరాటాలకు సిద్ధమవుతున్నారని అన్నారు. కార్మికులు,రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వారి హక్కులను హరించే విధంగా విధానాలను రూపొందించడం దుర్మార్గమని విమర్శించారు. పని ప్రదేశంలో సామాజిక భద్రత, సమ్మె చేసే హక్కు,సామూహిక బేరసారాల హక్కులను కేంద్ర ప్రభుత్వం బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు అలేటి జగన్,కల్లెట్ల వెంకన్న,భూతరాజు రవి, తీగల రామకృష్ణ, రామచంద్రం,నిమ్మల సత్యం పాల్గొన్నారు.




## 12న రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ రాక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 12న రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,సభ్యులు కుష్రమ్ నీలాదేవి,రాంబాబు నాయక్, కొంకతి లక్ష్మీనారాయణ,జిల్లా శంకర్,రేణిగుంట్ల ప్రవీణ్ లు ఈనెల 12న ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకుంటారని ఎస్‌సి,ఎస్‌టిలకు సంబంధించిన భూ సమస్యలు,ఎస్‌సి,ఎస్‌టిల పై దాడులు,ఉద్యోగాల లో రోస్టర్ పాయింట్ అమలు,బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీలో రిజర్వేషన్ అమలు,తదిత అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

## ముళ్లపొదల్లో పసికందు



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : నస్పూర్ పట్టణంలోని లక్ష్మినగర్ తహసిల్దార్ కార్యాలయం సమీపంలో ముళ్లపొదల్లో అప్పుడే పుట్టిన మగ పసికందు లభ్యమయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కవర్లో చుట్టి చెట్ల పొదల్లో పడేసిన నవజాత శిశువు ఏడుపు విని చుట్టుపక్కల వారు గమనించారు. వెంటనే స్థానికులు 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.పసికందును అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు మెరుగుపరచాలి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : జిల్లాలోని ఆదివాసీ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వర రావు కోరారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నాగేంద్రను సోమవారం ఆయన శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మారుమూల ప్రాంతంలో జన్మించిన వ్యక్తి జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టి, ప్రజలకు మెరుగైన వైద్యం అందించి ఆరోగ్య శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున్, నాయకులు కుందారపు బాలకృష్ణ, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

## ఇవిఎం గోడౌన్ సందర్శించిన కలెక్టర్




ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియ భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ సీళ్లను పోలీసు బందోబస్తును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖాధికారి శంకర్ ఉన్నారు.

## కానిస్టేబుల్ ఎస్ఐ అభ్యర్థులకు ఉచిత శిక్షణ శిబిరం




ప్రజాపక్షం/మెదక్ : ఉమ్మడి మెదక్ జిల్లాలోని యువతి యువకులకు అఖిలరాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ శిబిరం ఫౌండేషన్ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మెదక్ పట్టణ సీఐ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ లో గోడ పత్రికను విడుదల చేశారు. నిరుపేద యువతి యువకులు అన్ని వర్గాలకు చెందినవారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని వారి నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగం సాధించాలన్నారు.16వ తేదీన రామాయంపేట స్నేహ డిగ్రీ కళాశాలలో పరీక్ష కు హాజరై అర్హత సాధించిన వారికి నాగూర్ కర్నూల్, వట్టెం వద్దా పిసి ఎష్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. యువతి యువకులు ఇంటర్మీడియట్ డిగ్రీ పాసైన వారు 16 తేదీన రామాయంపేట స్నేహ డిగ్రీ కళాశాలలో జరుగు అర్హత పరీక్షకు హాజరు కావాలని, అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 1 నుండి శిక్షణ పూర్తయ్య వరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.సంకల్పశక్తి విజయానికి మార్గమని ఆయన తెలిపారు. అభ్యర్థులకు ఏదైనా సందేహాలు ఉంటే 7416661182 నంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది రమేష్, శివ పాల్గొన్నారు.

## సిసిఐ సాధన ఉద్యమానికి గ్రామస్తుల మద్దతు



ప్రజాపక్షం/మావల: సిసిఐ పరిశ్రమ పున:ప్రారంభం కోసం సిసిఐ సాధన సమితి చేపట్టిన రెండో రోజు రిలే నిరాహార దీక్షలో చాందా గ్రామస్తులు పాల్గొన్నారు. మాజీ మంత్రి జోగు రామన్న దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సీసీఐ తెరుస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించడం లేదని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే పరిశ్రమ పునఃప్రారంభాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సీసీఐ తెరిచే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి నాలుగో మహాసభలను జయప్రదం చేయండి

బిహెచ్ఇ ఎల్ యూనియన్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు

ప్రజాపక్షం/ సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో బి.హెచ్.ఈ ఎల్. యూనియన్ కార్యాలయం నందు రాష్ట్ర నాలుగో మహాసభల విడుదల చేయడం జరిగింది. ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు సెప్టెంబర్ నెల 6,7,8 తేదీలలో కరీంనగర్ పట్టణంలోని పద్మ నాయక కళ్యాణ మండపం నందు నిర్వహించడం జరిగుతుందని ఈ మహాసభలను కార్మిక వర్గం విజయవంతం చేయాలని తెలియజేయడం జరిగింది. భారత దేశంలో అక్టోబర్ 31న ఏర్పాడిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటియుసీ అని కార్మికులకు స్వాతంత్రానికి పూర్వమే కార్మిక హక్కుల కోసం పోరాడి అనేక కార్మిక చట్టాలను సాధించి పెట్టిన సంఘం ఏఐటియుసీ అని తెలిపారు. రాజ్‌కుమార్ సురేష్ కుమార్, యాదిరెడ్డి ,బిహెచ్ఈఎల్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.



# మెదక్ కలెక్టరేట్‌లో తాగునీటి కష్టాలు!

● తాగునీటి కోసం తంటాలు.. డబ్బానీళ్లే దిక్కా? ● సిబ్బందికి క్యాన్లు మోయడం తప్పదా..?



ప్రజాపక్షం/మెదక్ : జిల్లా పాలనకు గుండెకాయ కలెక్టర్ కార్యాలయం ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రధాన పరిపాలనా కేంద్రం నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం వచ్చిపోయే మెదక్ జిల్లా కలెక్టరేట్‌లోనే తాగునీటి కోసం తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కలెక్టరేట్‌లో అవసరానికి సరిపడా శుద్ధమైన తాగునీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో జిల్లా కేంద్రం 3 కిలోమీటర్ల దూరం నుంచి కలెక్టరేట్ సిబ్బంది నీటి క్యాన్లను మోసుకెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. కలెక్టరేట్‌లోని కార్యలయాలకు తాగునీరు అందించేందుకు సిబ్బంది భారీ వాటర్ క్యాన్లను భుజాన వేసుకొని తీసుకెళ్లే దృశ్యాలు ప్రతి రోజు దర్శనమిస్తాయి. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కొలువుదీరే ప్రాంగణంలోనే తాగునీటి కోసం ఇలా క్యాన్లు మోయాల్సి రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రజల సమస్యలను పరిష్కరించే కలెక్టరేట్‌లో ఒక ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సాధ్యం కాదా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. అలాంటి కనీస సౌకర్యం కోసం వాటర్ క్యాన్లపై ఆధారపడాల్సివస్తే జిల్లా పరిపాలనా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే మారుమూల గ్రామాల్లో ప్రజల తాగునీటి సమస్యలను ఎవరు పట్టించుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కార్యాలయ అవసరాలకు అవసరమయ్యే మంచి నీళ్లను ప్రతిసారీ బయట నుంచి నీటి క్యాన్లు తెప్పించడం శాశ్వత పరిష్కారం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సిబ్బంది క్యాన్లను భుజాన వేసుకొని మోయడం ఇప్పట్లో తప్పేట్లు కనబడటం లేదు. కలెక్టరేట్ కు అవసరమైన సామర్థ్యంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, ప్రతి విభాగానికి తాగునీరు అందేలా వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఉద్యోగులతో పాటు కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రజలకు మంచినీరు అందించాలని ఆదేశాలు ఇచ్చే అధికార యంత్రాంగం ముందు జిల్లా పరిపాలనాలో మంచినీటి సౌకర్యాన్ని మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

**ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందిస్తారా..?**

కలెక్టరేట్‌లో తాగునీటి అవసరాలను అధికారులు సమీక్షించి,శాశ్వత పరిష్కారంగా ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, సందర్శకులు కోరుతున్నారు. కోట్ల రూపాయల అభివృద్ధి పనులపై నిర్ణయాలు తీసుకునే కలెక్టరేట్ లో గుక్కెడు మంచినీటి కోసం క్యాన్లు మోయాల్సిన పరిస్థితికి స్వస్తి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సిఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలన

కలెక్టర్,ఎస్‌పి, టిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



ప్రజాఫక్షం/సంగారెడ్డి : రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ,టీసిసి వర్కింగ్ ప్రెసెడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. సభలు కార్యక్రమాలు నిర్వహించనున్న అంబేద్కర్ స్టేడియం ,తారా డిగ్రీ కళాశాల ప్రాంగణాలను వారు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు ,ప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. భద్రత ఏర్పాట్లు పార్కింగ్, ట్రాపిక్, నియంత్రణ ,బారికేడింగ్ వేధిక ఏర్పాట్లు తదతర అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా సంబందిత ఆర్ అండ్ బి డిపార్మ్టెమెంట్, అధికారులు ,ఆర్డీఓ, మున్సిపల్ కమీషన్ తహసీల్దారు ,పోలీసు శాఖ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

## గ్రామస్తుల అలసత్వానికి బలైన బడి

అంజనీ తండాలో మూతపడిన ప్రభుత్వ పాఠశాల!



ప్రజాపక్షం/నర్సాపూర్ జి : పాఠశాల అంటే కేవలం ఒక భవనం కాదు.. ఊరి భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యానిలయం. ప్రభుత్వం నిధులు కేటాయించి, ఉపాధ్యాయులను నియమించినా గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు, ఊరి పెద్దల నిర్లక్ష్యం మూలంగా నర్సాపూర్ (జి) మండలంలోని అంజనీ తండా ప్రభుత్వ పాఠశాల నేడు మూతపడే పరిస్థితికి చేరింది.ఊరి ప్రజలు చూపిన అలసత్వమే ఈ దుస్థితికి ప్రధాన కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**తల్లిదండ్రుల నిర్లక్ష్యమే కారణమా?** విద్య ప్రాముఖ్యతను గుర్తించకపోవడం, పిల్లలను సరిగ్గా బడికి పంపించకపోవడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోయి చివరికి పాఠశాలకు తాళం పడింది. ప్రభుత్వం పాఠశాలలు నిర్మించి, ఉపాధ్యాయులను కేటాయించగలదు కానీ, పిల్లలను బడికి పంపే బాధ్యత మాత్రం కచ్చితంగా తల్లిదండ్రులదే.

**ముందున్నది ప్రయాసల కాలమే!** సొంత ఊరిలోని బడిని కాపాడుకోవాల్సిన సమయంలో నిర్లక్ష్యం వహిస్తే, రేపటి రోజున చిన్నారి పిల్లలను చదువు కోసం మైళ్ల దూరం ఉన్న పొరుగు గ్రామాలకు పంపాల్సి వస్తుంది.

# ధరలకనుగుణంగా వేతనాలు పెంపు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్




ప్రజాపక్షం / మంచిర్యాల : నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల వేతనాలను కూడా పెంచాలని, కార్మికులు, రైతుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏలాల్ కుమార్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు టి శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన క్విట్ ఇండియా స్ఫూర్తితో నేడు కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరిస్తోందని విమర్శించారు. కనీస వేతనాలు, ఉద్యోగ, సామాజిక భద్రత కల్పించకుండా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాయడం దుర్మార్గమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, సరైన మార్కెట్, రుణ విముక్తి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, నిత్యావసరాల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎండి అక్బర్ అలీ, గౌరవ అధ్యక్షుడు ఖలీందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌలు, బోయపోతుల కొమురయ్య, మండల శ్రీనివాస్, రామన్న, దేవి పోచన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్, పద్మావతి, రఫియా, శ్రీనివాస్, పైరాల రాములు, సురేందర్, రమేష్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, పిఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, ఐఎఫ్‌టి యు నాయకులు తిరుపతి రెడ్డి, జాఫర్, పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అరుణోదయ నాయకులు మల్లన్న, సమ్మన్న, ఎఐకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగర్ల శంకర్, గంగయ్య, రాకేష్ పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో 'జైల్ భరో' విజయవంతం

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మండిపడ్డ కార్మిక, రైతు సంఘాలు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక, రైతు మరియు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్మల్ జిల్లాలో సోమవారం నిర్వహించిన "జైల్ భరో" కార్యక్రమంవిజయవంతమైంది.అంబేద్కర్ విగ్రహం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, రెండు గంటల పాటు రాస్తారోకో చేపట్టారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాట క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలతో 4 లేబర్ కోడ్లను తేవడమే కాకుండా, రోజువారీ పని గంటలను 8 నుండి 12 గంటలకు పెంచేందుకు యాజమాన్యాలకు స్వేచ్ఛనిచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. పంటలకు కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పి) చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడాన్ని, అంత్యోదయ ఆహార భద్రతా చట్టంలో బియ్యం కోత విధిస్తూ తెస్తున్న సవరణలను విద్యుత్ సవరణ బిల్లు 2025ను తీవ్రంగా వ్యతిరేకించారు.సిఐటియు, టియుసిఐ, ఐఎఫ్టియు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రగతిశీల మహిళా సంఘం మరియు విద్యార్థి సంఘాల (ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు) ముఖ్య నాయకులు బొమ్మెన సురేష్, పి. గంగమణి, రామ లక్ష్మణ్, హరిత, దుర్గ నూతన్ కుమార్, నాగేలి నర్సన్న,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎదురెదురుగా బైకులు ఢీ : కారోబార్ మృతి

గ్రామంలో విషాదఛాయలు



ప్రజాపక్షం/పాపన్నపేట: ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొని పాపన్నపేట గ్రామ పంచాయతీ ఉద్యోగి (కారోబార్), పాపన్నపేట తాజా మాజీ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్ సోదరుడు ఆకుల కృష్ణ దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేట గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. దీనితో పాపన్నపేటలో పూర్తిగా విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానికుల, పోలీసుల సమాచారం మేరకు పాపన్నపేట గ్రామానికి చెందిన ఆకుల కృష్ణ (40) పాపన్నపేట పంచాయతీ కార్యాలయంలో కారోబార్ గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం తన ద్విచక్రవాహనం పై బంధువైన వెంకట్ తో కలిసి మెదక్ వైపు నుంచి పాపన్నపేట వైపు వెళుతున్నాడు. ఇదే క్రమంలో ముస్లాపూర్ వైపు నుండి వస్తున్న బైక్ యూసుఫ్‌పేట గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా ఢీ కొనడంతో కృష్ణ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108, పాపన్నపేట పోలీసులకు సమాచారం అందివ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కృష్ణ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కాగా మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నేరాల అరికట్టడమే లక్ష్యం : ఎస్‌పి జానకి షర్మిల

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి డా. జి. జానకి షర్మిల,ఐపీఎస్ అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం (మంత్లీ క్రైమ్ రివ్యూ) నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తూ, దీర్ఘకాలిక పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సిసిటిఎన్ఎస్ డేటాను ఎప్పటికప్పుడు నవీకరించాలని,రౌడీషీటర్లపై నిఘా పెంచాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు,వృద్ధులు,పిల్లల ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలన్నారు.ఇళ్ల దొంగతనాలు,వాహన చోరీలు, చైన్ స్నాచింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి రాత్రి గస్తీని పెంచాలన్నారు.సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.సమావేశం అనంతరం ఎస్పీ పోలీసు వాహనాల కండిషన్,రికార్డులను తనిఖీ చేశారు. భైంసా ఎఎస్‌పి సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్,ఇన్‌స్పెక్టర్లు,ఎస్‌హెచ్ఓలు పాల్గొన్నారు.




## 12వ వేతన ఒప్పందం కోసం కార్మిక గర్జన

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : 12వ వేతన ఒప్పందం కోసం జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా, ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. వేతన ఒప్పంద కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, హింద్ మజ్దూర్ సభ నాయకులు కొరిమి రాజ్‌కుమార్, పేరం రమేష్, రామస్వామి, తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. 12వ వేతన కాలపరిమితి ప్రారంభమైనప్పటికీ కమిటీ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం కార్మికుల పట్ల నిర్లక్ష్యమేనని విమర్శించారు. వేతనాలు, అలవెన్సులపై తక్షణమే చర్చలు ప్రారంభించాలని, లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కొట్టే కిషన్‌రావు, ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్ జోయల్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు వెంగళ శ్రీనివాస్, తోడే సుధాకర్, హింద్ మజ్దూర్ సభ నాయకులు కొమురయ్య, దుర్గం లక్ష్మణ్ పాల్గొన్నారు.



## రైతులను కార్పొరేట్ కంపెనీలకు బానిసలుగా మారుస్తున్న మోదీ ప్రభుత్వం








ప్రజాపక్షం/నిజామాబాద్ : రైతులను అమెరికాకు కార్మికులను కార్పొరేట్ కంపెనీలకు బానిసలుగా మోడీ ప్రభుత్వం మారుస్తుందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఓమయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ అన్నారు. మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కార్మిక రైతు సంఘాలు జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుండి ధర్నాచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నాచౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోవటంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి ఒకటవ టౌన్‌కు తరలించారు. మోడీ ప్రభుత్వం భారత రైతాంగాన్ని అమెరికాకు, కార్మికవర్గాన్ని కార్పోరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తుందన్నారు. కార్మిక, రైతు వ్యవసాయ కూలీ రంగాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని లేనిచో ఈ దేశంలోనే కోట్లాది కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు సంఘటితమై ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ రైతు, కార్మిక సంఘాల నాయకులు వెంకన్న, రాజేశ్వర్, సురేష్, సాయరెడ్డి, హన్మాండ్లు, శివకుమార్, మల్లిఖార్జున్, సత్తెక్క, కిషన్, కిరణ్, ఒడ్డెన్న, నసీర్, గోవర్ధన్, భానునర్సయ్య, సాయిలు, అలీ పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి

ప్రజాపక్షం/భైంసా : సరదాగా ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోజరిగింది. స్థానికుల వివరాల ప్రకారం..కుబీర్కు చెందిన ముగ్గురు బాలురు సోమవారం డోడర్నా చెరువుకు ఈతకు వెళ్లారు. ఒకరు ఒడ్డున ఉండగా ఇద్దరు చెరువులో దిగి నీటిలో మునిగిపోయారు. స్థానికులు గణేశ్ (13)ను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. సోఫియాన్ (10) చెరువులోనే ప్రాణాలు విడిచాడు.ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరిని వెతికి తీసి సుపత్రికి తరలించారు.దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకోనీ దర్యాప్తు చేస్తున్నారు.



"కేంద్రంలో ప్రధాని మోదీ కార్పొరేట్లకు అండగా ఉంటూ, దేశ ప్రజలపై ధరల భారం మోపుతున్నారని సిపిఐ నాయకులు ఆరోపించారు. సామాన్యులపై ధరల భారం వేస్తున్న బిజెపి పాలనకు రానున్న రోజుల్లో చరమ గీతం పాడాలని వారు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 5 రోజులుగా నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాతాలలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు."


హన్మకొండలో...


జనగాంలో...


నాగర్‌కర్నూల్ తెల్కపల్లిలో...


నల్లగొండ జిల్లా నాంపల్లిలో...


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో...


జగిత్యాల జిల్లా మల్యాలలో...


పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో...


ఖమ్మం జిల్లా కామేపల్లిలో...


నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో...


వరంగల్ జిల్లా దుగ్గొండిలో...


మహబూబ్‌నగర్ జిల్లా సిసి కుంటలో...


మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో...

# కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తున్న మోదీ సర్కార్

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు

ప్రజాపక్షం / విలేకరుల బృందం

కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ ఊడిగం చేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు సిపిఐ ప్రజా చైతన్య ప్రచార యాత్రను సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని, మోదీ పాలనలో ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజలకు హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. పేద, బడుగు, బలహీనవర్గాల కోసం పోరాడే కమ్యూనిస్టులుగా తాము ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామన్నారు. సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రజల్ని చైతన్య పరుస్తూ జిల్లాలో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్న, చొప్పరి సోమయ్య, చామకూర యాకూబ్, గుగులోతు సఖి, నగేష్, ఐలయ్య, బాణాల వెంకన్న పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లాలో సిపిఐ ప్రచార జాత యాత్ర సోమవారం 5వ రోజు హనుమకొండ మండలానికి చేరుకుంది. జీటి రెడ్డి నగర్ నుండి పాదయాత్ర పలువేల్పుల వరకు సాగింది. జాతా బృందానికి రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్ ఆధ్వర్యంలో స్వాగతం పలుకగా బతుకమ్మలతో, కోలాట బృందాలతో పాదయాత్ర కొనసాగింది. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన సభలో తక్కళ్లపల్లి మాట్లాడారు. కార్యక్రమంలో నేదునూరి జ్యోతి, సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎన్ఎ.స్టాలిన్, మునిగాల బిక్షపతి, కర్రె లక్ష్మణ్, కొట్టెపాక రవి, యేషబోయిన శ్రీనివాస్, మాలోత్ శంకర్ నాయక్, శనిగరపు రాజ్‌కుమార్, రసమల్ల దీన, దామెర సుదర్శన్, అలువాల రాజు, పొనుగోటి రాముగోపాల్‌చారి, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్ పాల్గొన్నారు.

### హామీలు నెరవేర్చకుంటే ప్రభుత్వాలను ఎండగడుతాం : నరసింహ

హామీలను నెరవేర్చకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగడతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో చేపట్టిన పాదయాత్ర ఐదో రోజు తెల్కపల్లి మండల పరిధిలోని చిన్నముద్దనూరు, రామ్‌రెడ్డిపల్లి, కారువంగ, తాళ్లపల్లి, నడిగడ్డ, రామగిరి, గౌరారం, పర్వతాపురం రాకొండ గ్రామాల్లో కొనసాగింది. తెల్కపల్లిలోని లింగాల్ రోడ్డు పెట్రోల్ బంక్ నుంచి నెహ్రూ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సూర్యశంకర్ గౌడ్ అధ్యక్షతన కార్యక్రమంలో కె.కేశవులుగౌడ్, బాలమురళీ కృష్ణ, మారేడు శివశంకర్, మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దేశామోని ఆంజనేయులు, బుగ్గ స్వామి, గొడుగు విష్ణు, నరేందర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు తన్నీరు మల్లయ్య, నరసింహ, మధు, నిరంజన్, పర్వతాలు, మాడుగుల నరసింహ, కేశవులు, రాములు పాల్గొన్నారు.

### సార్వత్రిక విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలి : సత్యం

ప్రజలకు సార్వత్రిక విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య ప్రచార యాత్ర సోమవారం నాంపల్లి మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పూలమాల వేసి నివాళులర్పించారు. నల్లగొండ జిల్లాకు కీలకమైన ఎస్ఎల్‌బిసి ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నెల్లికంటి సత్యం కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యచారి, మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు చెల్లం పాండురంగారావు, బి.జగన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, ఊరిపాక వెంకటయ్య, పల్లె సైదులు, కోరె సత్తయ్య, నేరెళ్ల సైదులు, గిరి స్వామి, రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను, కానుగుల మహేష్, మోగుదాల సైదమ్మ, బుషిపాక యాదయ్య, రేవెల్లి ఉపసర్పంచ్ వంగూరి సాయిలు, పల్లేటి దశరథ్, చెన్నోజు వెంకటాచారి పాల్గొన్నారు. ప్రజాచైతన్య యాత్రలో మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పలువురికి సిపిఐ కండువాలు కప్పి ఆహ్వానించారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు : రమేష్

ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్ కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర రెండో రోజు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గిర్నిబావికి చేరింది. పాదయాత్రలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి బాషుమియా, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, గుండె బద్రి, వీరగోని శంకరయ్య, తాళ్లపల్లి రహేల, ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, చిట్యాల సువర్ణ, బొట్ల శ్రీనివాస్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఆరెల్లి రవి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సాంబమూర్తి, నాయకులు శ్వేత, గజవెల్లి చిరంజీవి, జన్ను రాజు, మున్ని, శంషాద్దేన్, తోటరాజు, ఎండి యాకుబ్, శమీనా, సరిత, సారంగం, రాజా పాల్గొన్నారు




### ధరలు తగ్గించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం : విశ్వనాథం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో సోమవారం పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం హాజరై మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు తగ్గించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఇరువురాళ్ల భూమేష్, కొక్కుల శాంత, సుతారీ రాములు, వెన్న మహేష్, బుల్లె లక్ష్మీరాజు, బొల్లి రాజయ్య, బట్టు రాజయ్య, అందే వంశీ, రామిళ్ల రాంబాబు పాల్గొన్నారు.

### ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలి : సదానందం

కేంద్రంలోని ప్రజా వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. సోమవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలో సిపిఐ ప్రజాజాతన్ను తాండ్ర సదానందం ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్‌తో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్ గోవర్ధన్, గోశికమోహన్, కె.కనకరాజు, సిపిఐ కార్పొరేటర్ మార్కాపూరీ సూర్య, కోడం స్వామి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, తాళ్లపల్లి మల్లయ్య, ఎం.ఎల్లయ్య, ఎజ్జ రాజయ్య, ఓదమ్మ, పూసల రమేష్, ప్రీతం, శనిగరపు చంద్రశేఖర, తోడేటి లావణ్య, రచన, ఎం.తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి, గట్టయ్య పాల్గొన్నారు.

### మోదీవి విచ్ఛిన్నకర విధానాలు : దండి

దేశ ప్రధానిగా మోదీ అనుసరిస్తున్న విధానాలు దేశ విచ్ఛిన్నానికి, అంతర్గత ఆందోళనలకు దారి తీస్తున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. ప్రజా చైతన్య యాత్ర ఐదవ రోజు ఖమ్మం జిల్లాలోని కామేపల్లి, కారేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో సాగింది. యాత్ర కు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి నేతృత్వం వహించారు. యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్ ప్రసంగించగా అజ్మీర రామ్మూర్తి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, పగడాల మల్లేష్, మిడికంటి వెంకటరెడ్డి, రావి శివరామకృష్ణ, బత్తినేని నీరజ, తాటి నిర్మల, సృజన, ఇటికాల రామకృష్ణ, యంగల ఆనందరావు, ఏసు, యమాల గోపాలరావు, మోహన్‌రావు, శ్రీనివాసరావు, బానోత్ రాంకోటి, వెన్నం భాస్కర్, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, శాఖమూరి శ్రీనివాసరావు, చింతల రమేష్, జూలా వెంకటేశ్వర్లు, బాగం ప్రసాద్, గాడిచర్ల సత్యనారాయణ, చీనా, జామ్లా, కురువెళ్ల వెంకయ్య, రావెళ్ల సురేష్ పాల్గొన్నారు.

### మార్పు రావాలి : విజయసారథి

వచ్చే ఎన్నికల్లో ఓటు చోర్...నోటు చోర్ నరేంద్ర మోదీని గద్దె దించాలని ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మండలంలోని హరిపిరాల గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు వల్లపు కొమురెల్లి స్మారక స్థూపం నుంచి ప్రచార పాదయాత్రను ప్రారంభించారు. యాత్రలో మండల కార్యదర్శి బందు మహేందర్, గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్‌కుమార్, ముద్రబోయిన వెంకన్న, వల్లపు వెంకన్న, దాసరి కృష్ణమూర్తి, వెంకన్న, మంగళపల్లి మల్లయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.


కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో...

### కొత్తగూడెం ప్రాంత అభివృద్ధికి సిపిఐ కట్టుబడి ఉంది : సాబీర్ పాషా

కుంటుపడిన కొత్తగూడెం ప్రాంత అభివృద్ధిని గాడిలో పెట్టింది ఒక్క సిపిఐ మాత్రమేనని, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేస్తున్న అభివృద్ధి కృషికి ప్రభుత్వం పూర్తిగా సహకరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా స్పష్టం చేశారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టిన జన చైతన్య యాత్ర సోమవారం భద్రాద్రి జిల్లా మండల కేంద్రంలో ప్రారంభమై లక్ష్మీ దేవిపల్లి మండలంతోపాటు కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి కార్మిక ప్రాంతాలలో సాగింది. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై ప్రజాచైతన్య యాత్రకు సంఘీభావం ప్రకటించారు. జిల్లా యాదవ సంఘం నాయకులు మచ్చా శ్రీనివాసరావు యాత్రలో పాల్గొన్నారు. యాత్రలో ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సరరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, వాసిరెడ్డి మురళి, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, జి.వీరస్వామి, ఎస్‌కె. ఫహీం, భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, నిమ్మల రాంబాబు, కాటూరి రాము, జర్పుల ఉపేందర్, రత్నకుమారి, ప్రజాప్రతినిధులు బోయిన విజయ్ కుమార్, బండి నర్సింహా, దుర్గయ్య, సుధాకర్, మునిగడప పద్మ, శంకర్ పాల్గొన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఫయాజ్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో సిపిఐ పాదయాత్ర 5వ రోజు కోడేరు మండలంలోని పసుపుల, కొండ్రావ్‌పల్లి, జానంపల్లి, తీగలపల్లి గ్రామాలలో జరిగింది. కార్యక్రమంలో టి.నరసింహ, బండి లక్ష్మీ పతి, తప్పెట కిరణ్‌కుమార్, బిజ్జి వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, కృష్ణ, ప్రకాష్, రాధాకృష్ణ, రామకృష్ణ, నరసింహ, కె.సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటమే లక్ష్యం : బాలకిషన్

'ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల లక్ష్యమని సిపిఐ మహబూబానగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. సోమవారం దేవరకద్ర నియోజకవర్గం, సిసి కుంట మండల కేంద్రంలో సిపిఐ ప్రజా జనచైతన్య యాత్రను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, సిసి కుంట మండల కార్యదర్శి అమర జ్యోతి, వెంకటయ్య, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు భార్గవి, శ్రీను, దేవానందం, సత్యనారాయణరెడ్డి, మహేష్‌బాబు, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు రెహమాన్, ఇందిర, రాజశేఖర్, రాము, గూడుభాష, భరత్, తన్వీర్, అజయ్, నవాజ్, అంజాద్ పాల్గొన్నారు.

### అబద్ధపు ప్రచారంతో గద్దెనెక్కిన బిజెపి : పంజాల

సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారాలు చేసి ప్రజలను నమ్మించి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కిందని, రానున్న రోజుల్లో అదే సోషల్ మీడియా ద్వారా గద్దెదిగక తప్పదని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లో ప్రారంభమైన సిపిఐ ప్రచార జాతా 5వ రోజు తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి, మొగిలిపాలెం, పొలంపల్లి గ్రామా ల్లో జరిగింది. జాతాకు సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి అధ్యక్షత వహించగా నాయకులు పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, సూరం మల్లేశం, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వరుకోలు సదానందం, పిట్టల శ్రీనివాస్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, కాంతాల తిరుపతిరెడ్డి, ఎల్లా స్వామి, భద్రయ్య, సంతోష్ చారి, బీర్ల స్వాతి, స్వప్న, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

## బెదిరింపులు

(మొదటి పేజీ తరువాయి)

ఆ పోరాటాలకు తలొగ్గిన బిజెపి ప్రభుత్వం స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ రైతులకు క్షమాపణ చెప్పే దుస్థితికి బిజెపి పాలన జరిగిందని, రైతు ల కనీసం మద్దతు ధర చట్టం అమలు చేయడంలో వైఫ ల్యం చెందారని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని, మహిళలకు రక్షణ కరువైందని పోరాడి సాధించుకున్న మహిళా రిజర్వేషన్ అమలు చేయడం లేదని, కార్మిక హక్కులను చట్టాలను రద్దు చేస్తూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం ప్రభుత్వం అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు అందనంత దూరంలో విద్య, వైద్యం ఉందని కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిపోయి పెట్టుబడిదారుల చేతుల్లో వ్యాపారమైందన్నారు. జిల్లా కేంద్రాల్లో ఉన్న ఆసుపత్రుల్లో కనీస మౌళిక సదుపాయాలు లేవని అన్ని రోగాలకు సంబంధించనటువంటి డాక్టర్ల కొరత ఉందని ప్రభుత్వ ఆసుపత్రులు కేవలం పోస్టుమార్టం చేయడానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయని మండిపడ్డారు. మండల కేంద్రాల్లో ఆసుపత్రులు నిర్మించి నలుగురు డాక్టర్లను ఏర్పాటు చేస్తామని విఫలమయ్యారని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కూనీ చేస్తుందని అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన హక్కులు, చట్టాలు అమలు చేయడం లేదని అన్నారు. అర్హులైన పేదలకు కూడు, గుడ్డ, నీడ కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని దేశ భవిష్యత్ కాపాడుకోవడానికి ప్రజలంతా ఉద్యమాల వైపు పయనించాలన్నారు. జాతాలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కోఆర్డినేటర్స్ కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, నాగెల్లి లక్ష్మారెడ్డి, కాంతాల అంజిరెడ్డి, బీర్ల పద్మ, కొట్టె అంజలి, కూన మల్లయ్య, పిప్పళ్ల కనుకయ్య, మైసంపల్లి మల్లేశం, బోయిని తిరుపతి, బోయిని మల్లయ్య, చెరుకు అంజనేయులు, గాజుల లక్ష్మణ్, మోలుగురి ఆంజనేయులు, ముల్కల పవన్, ఎండి నయీమ్, బొమ్మకంటి అంజయ్యచారి, రమేశ్, మీసం లక్ష్మణ్, గోపయ్య, యాదగిరి, రాజయ్య, సంతోష్ చారి, బీర్ల స్వాతి, స్వప్న, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

అంశాలు ముడిపడి ఉండటమే ఇందుకు ప్రధాన కారణమని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఎంపి రేణుకా చౌదరి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఏదైనా నీటిపారుదల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించే ముందు పలు సాంకేతిక, ఆర్థిక అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు ప్రతిపాదనను పరిశీలించే క్రమంలో సంబంధిత రాష్ట్రాల ప్రయోజనాలు, నీటి లభ్యత, ప్రాజెక్టు వ్యయం, అంతర్రాష్ట్ర అంశాలు తదితరాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కృష్ణా నది జలాల వినియోగానికి సంబంధించిన అంశాలు ఉండటంతో అంతర్రాష్ట్ర జల వివాదాలు ముడిపడి ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు. కృష్ణా జలాల పంపిణీ, వినియోగంపై ఇప్పటికే వివిధ రాష్ట్రాల మధ్య వివాదాలు ఉన్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించే అంశం మరింత సంక్లిష్టంగా మారిందని ఆయన పేర్కొన్నారు. కృష్ణా జల వివాదాల అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో కూడా ఉందని కేంద్ర మంత్రి తెలిపారు. న్యాయస్థానం పరిధిలో ఉన్న అంశాలకు సంబంధించి ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాజెక్టును సాంకేతిక, ఆర్థిక మదింపునకు తీసుకోవడం సాధ్యం కాదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com